

అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



పెరిగిన చైనా ఎగుమతులు
భారత్, పాక్ పోరు ఆందోళనకరం
14వ పోప్‌గా రాబర్ట్ ప్రివోస్ట్
లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 160 | శనివారం | 10-05-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## మళ్లీ కవ్వింపు చర్యలు

నియంత్రణ రేఖ వెంబడి భారీగా కాల్పులు జరిపిన పాక్ రేంజర్లు
దీటుగా తిప్పికొట్టిన భారత సైన్యం

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ మరోసారి కవ్వింపు చర్యలకు దిగింది. జమ్ము, సాంబా, పఠాన్‌కోట్‌లతో పాటు అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, హోషియార్ పూర్, గురుదాస్‌పూర్, తర్న్ తరణ్ లక్ష్యంగా డ్రోన్ దాడులకు తెగబడింది. అయితే, దాయాది డ్రోన్ దాడుల్ని భారత సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. జమ్ము నగరం వ్యాప్తంగా సైరన్లు మోగాయి. తనకూ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా ఎక్స్ వేదికగా ప్రకటించారు. జమ్ము, పరిసర ప్రాంత ప్రజలు వీధుల్లోకి రావొద్దని, ఇళ్లకే పరిమితం కావాలని ఆయన సూచించారు. వదంతులను పట్టించుకోవద్దని, ఆధారాలు లేని, ధ్రువీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దని పిలుపునిచ్చారు. మరోవైపు, నియంత్రణ రేఖ వెంబడి పాక్ రేంజర్లు భారీగా కాల్పులకు తెగబడ్డారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దేశంలోని పలు ప్రాంతాల్లో బ్లాక్ అవుట్ విధించారు. జమ్మూ డివిజన్ ఉధంపుర్‌లో పూర్తిగా బ్లాక్ అవుట్ పాటించారు. ఆ ప్రాంతంలో భారీగా సైరన్ శబ్దాలు వినిపిస్తున్నాయి. జమ్మూ, అఖ్నూర్, జైసల్మేర్, హర్యానాలోని అంబాలా, పంచకుల, పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్, మోగా, జలంధర్, ఫజిల్కా సహా పలు సరిహద్దు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సరిహద్దు ప్రాంతాల్లో తరువాయి 2లో


మోదీ తన నివాసంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించిన దృశ్యం

## ఆహారం, ఇంధనానికి ఆందోళన వద్దు

- నిల్వలు పుష్కలంగా ఉన్నాయి
- సజావుగానే బ్యాంక్ సేవలు
- అసత్య ప్రచారాలు నమ్మొద్దు
- పోర్టులు, నౌకాశ్రయాలు, టెర్మినల్ల వద్ద భద్రత పెంపు
- ప్రధాని మోదీ, అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్‌లు భద్రతపై వరుస సమీక్షలు
- ఐపిఎల్ మ్యాచ్‌లు వారం వాయిదా
- క్షీణించిన దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు

**న్యూఢిల్లీ :** భారత్‌-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తల నేపథ్యంలో దేశ ప్రజల భద్రత కోసం భారత ప్రభుత్వం పలు కీలక చర్యలు తీసుకుంటోంది. ఎటువంటి పరిస్థితులు వచ్చినప్పటికీ దేశంలో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల కొరత లేదని, తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని హామీనిచ్చింది. మరోవైపు దేశంలో ఎలాంటి ఇంధన కొరత లేదని భారతీయ చమురు కంపెనీలు తెలిపాయి. దీని గురించి జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చాయి. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ఎల్పీజీ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నాయి. ప్రజలు భయపడి ముందుగా కొనుగోలు చేయడం లేదా నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని చమురు కంపెనీలు స్పష్టం చేశాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు ఇతర ఇతర ప్రముఖ బ్యాంకులు.. తమ ఎటిఎంలు పూర్తి నగదు నిల్వలతో సంపూర్ణంగా పనిచేస్తున్నాయని, డిజిటల్ సేవలు సజావుగా పనిచేస్తున్నాయని తెలిపాయి. భారత్, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య రానున్న రోజుల్లో ఎటిఎంలు మూతపడే అవకాశం ఉందని సోషల్ మీడియాలో వచ్చిన అసంబద్ధ వార్తలని తెలిపాయి. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పోర్టులు, నౌకాశ్రయాలు, టెర్మినల్లలో భద్రత పెంపుకు ఆదేశించింది. భద్రత రెండో లెవల్‌కు పెంచుతూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ శ్రీహరి కోట సహా 11 ఇస్రో కేంద్రాల్లో హై అలర్ట్ ప్రకటించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధమైంది. దీని కోసం ఎయిర్ సైరన్స్‌ను పరీక్షించింది. ప్రజలు భయాందోళన చెందవద్దని సూచించింది. శుక్రవారం మధ్యాహ్నం 3.00 గంటల నుంచి ఎయిర్ సైరన్ టెస్ట్ నిర్వహించారు. రెండు సార్లు చొప్పున 15 నుంచి 20 నిమిషాల పాటు సైరన్ మోగించారు. ఢిల్లీలోని ఎత్తైన తరువాయి 12లో



## పౌర విమానాలే కవచం

- భారత్‌పై పాక్ డ్రోన్ దాడులు
- ప్రార్థనా మందిరాల కూల్చివేత
- అయినా సంయమనం పాటించాం
- 36 ప్రాంతాలలో 400 డ్రోన్లు నిర్వీర్యం
- భారత విదేశాంగ, రక్షణ శాఖలు వెల్లడి

**న్యూఢిల్లీ:** భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా గురువారం రాత్రి పాకిస్థాన్ చేపట్టిన దాడులపై భారత విదేశాంగ శాఖ వివరాలు వెల్లడించింది. జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 300 నుంచి 400 డ్రోన్లతో పాక్ దాడులు చేసినట్లు తెలిపింది. పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోందని వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో తరువాయి 2లో

## తప్పుదోవ పట్టించే కంటెంట్‌పై చర్యలు తీసుకోవాలి

- తక్షణమే చర్యలు చేపట్టాలని సిపిఐ వినతి
- కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్విణి వైష్ణవ్‌కు సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా లేఖ



**న్యూఢిల్లీ :** 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో భారత్‌పాకిస్థాన్ సైనిక ఘర్షణలకు సంబంధించి కొన్ని న్యూస్ చానెళ్లు ప్రసారం చేస్తున్న రెచ్చగొట్టే, తప్పుదోవ పట్టించే కంటెంట్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఐ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.ఈ మేరకు శుక్రవారం సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విణి వైష్ణవ్‌కు ఒక లేఖ రాశారు. మతవిద్వేషాన్ని రెచ్చగొట్టడం, అసత్య ప్రచారం చేస్తున్న న్యూస్ చానళ్లు, ప్లాట్‌ఫారమ్‌లకు వ్యతిరేకంగా తక్షణమే ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలని ఆయన తన లేఖలో అభ్యర్థించారు. 'ఆపరేషన్ సిందూర్ తర్వాత అనేక న్యూస్ చానళ్లు రెచ్చగొట్టే, తరువాయి 2లో

## అన్ని జిల్లా కేంద్రాల్లో సంఘీభావ ర్యాలీలు

- పోలీసులు సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలి
- ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించి మాక్ డ్రిల్ చేపట్టాలి
- హై లెవెల్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రజాపక్షం/హైదరాబాద్



భారత్‌-పాక్ యుద్ధ వాతావరణం సందర్భంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు పోలీస్ అధికారులు సమగ్రమైన యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని ముందుకు వెళ్లాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు సూచించారు. సచివాలయంలో శుక్రవారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన హై లెవెల్ కమిటీ కీలక సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ తోపాటు చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, తరువాయి 2లో

## అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు

- గ్రామ, మండల, అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంజూరు చేస్తాం
- నిరుపేదలు, వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత
- సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన
- మృతిచెందిన జర్నలిస్టు కుటుంబాలకు రూ.లక్ష చొప్పున చెక్కుల పంపిణీ


ప్రజాపక్షం/హైదరాబాద్

అర్హులైన జర్నలిస్టులందరికీ గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు, అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని వెంటనే జిల్లా కలెక్టర్లను ఆదేశిస్తామని హామీనిచ్చారు. ఇటీవల వృత్తి నిర్వహణ, వివిధ కారణాలతో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు రూ.1లక్ష చొప్పున చెక్కులను తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, తరువాయి 2లో

### 'రూ. 10 కోట్ల' నిధులు

మంజూరయ్యేలా చూడండి
శ్రీనివాస్ రెడ్డి

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల తాను కేరళ, కర్నాటక మీడియా అకాడమీలను పరిశీలించానని, కేరళ అకాడమీ యూనివర్సిటీ తరహా కోర్సులను నిర్వహిస్తోందని వివరించారు. కర్నాటక, కేరళ అకాడమీలు తెలంగాణ అకాడమీ కంటే ముందు ఉన్నాయని, ప్రస్తుతం శిక్షణకు అనుకూలంగా తెలంగాణ మీడియా భవనం పూర్తయిన నేపథ్యంలో ఆ రెండు అకాడమీలతో సమానంగా తెలంగాణ మీడియా తరువాయి 2లో

## ఎన్‌ఇపిని అమలు చేయాలని బలవంతం చేయలేం

పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు

రాష్ట్ర ప్రభుత్వం చర్యలు పౌరుల ప్రాథమిక హక్కులు ఉల్లంఘించేలా ఉంటే కోర్టులు జోక్యం చేసుకోవచ్చని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడుల్లో కచ్చితంగా జాతీయ విద్యా విధానం అమలుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. విద్యావిధానాన్ని అమలుచేయాలని ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేమని జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ఉంటే మాత్రం ఆ విషయంలో కోర్టు జోక్యం చేసుకోవచ్చని తెలిపింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ రాజ్యాంగ పరంగా విద్యావిధానాన్ని అమలుచేయాలని పేర్కొంటూ ఓ న్యాయవాది సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దేశవ్యాప్తంగా విద్యలో ఏకరూపకతను నెలకొల్పడానికి కేంద్రం ఎన్‌ఇపి విధానాన్ని అమలుచేయాలని యోచిస్తోందని.. కానీ పలు రాష్ట్రాలు ఈ విధానాన్ని అనవసరంగా రాజకీయ సమస్యగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఉచిత విద్య ఒక తరువాయి 2లో

## తగిన మూల్యం తప్పదు

పహల్గామ్ ఘటన మానవత్వాన్ని మంటగలిపింది

- హిందూ ముస్లింల మధ్య గొడవలు పెట్టేందుకు పాకిస్థాన్ ఉగ్రమూకలు యత్నించాయి
- హిజ్‌బుల్ ముజాహిద్దీన్, లష్కర్ ఏ తోయిబా ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి భారత్‌కు పంపుతోంది
- సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా ఆగ్రహం
- భారత్‌కు సంఘీభావంగా ఇస్కస్ తెలంగాణ రాష్ట్ర సమితి, ఐప్సో ర్యాలీ



ప్రజాపక్షం/హైదరాబాద్

అమాయక ప్రజల ప్రాణాలు తీసిన పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకుంటుందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి, భారత సాంస్కృతిక స్నేహ సంఘం (ఇస్కఫ్) అధ్యక్ష వర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. పహల్గామ్ ఘటన మానవత్వాన్ని మంటగలిపిందన్నారు. హిందూ, ముస్లింల మధ్య గొడవలు సృష్టించేందుకు పాకిస్థాన్ ఉగ్రవాద మూకలు ప్రయత్నించాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యా ఫాసిజంపై విజయం సాధించిందని అన్నారు. ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి, అఖిల భారత శాంతి సేవ సంఘం(ఐప్సో) ఆధ్వర్యంలో శుక్రవారం భారత సైన్యానికి సంఘీభావంగా హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్ నుంచి హైదర్‌గూడ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిని ఖండించారు. అనంతరం హిమాయత్ నగర్ లోని ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో ఫాసిజంపై విజయం సాధించిన 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అజీజ్ పాషాతో పాటు ఐఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, ఇస్కఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.గోపాల్, అరుణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తరువాయి 2లో

## రెడ్‌స్క్వేర్‌లో ఘనంగా విక్టరీ డే వేడుకలు

- పరేడ్‌లో రష్యాతో పాటు పాల్గొన్న 13 దేశాల మిలిటరీ బృందాలు
- వీక్షించిన చైనా, వియత్నాం, వెనిజులా, బ్రెజిల్, క్యూబా సహా 27 మంది దేశాధినేతలు

**మాస్కో :** ద్వితీయ ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై రష్యా విజయ 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మాస్కోలోని రెడ్‌స్క్వేర్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రియోబ్రెజెన్స్కి రెడిమెంట్ ఆనర్ గార్డ్ యూనిట్ ఆధ్వర్యంలో రష్యా జాతీయ పతాకాన్ని, చారిత్రాత్మక విక్టరీ పతాకాన్ని పట్టుకొని ముందుకు సాగడం ద్వారా భారీ సైనిక కవాతు ప్రారంభమైంది. 1945లో రిచ్‌స్టాగ్‌పై రష్యన్ సైనికులు ఈ విక్టరీ బ్యానర్‌ను ఎగురవేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, యుద్ధ యోధులు, వివిధ విదేశీ నాయకులు రెడ్‌స్క్వేర్‌లోని సెంట్రల్ రివ్యూయింగ్ స్టాండ్ నుంచి పరేడ్‌ను వీక్షించారు. రష్యా విదేశాంగ మంత్రి ఆండ్రే బెలౌసోవ్ పరేడ్‌ను పరిశీలించగా, గ్రౌండ్ ఫోర్సెస్ కమాండర్ ఇన్ ఛీఫ్ జనరల్ ఆఫ్ ఆర్మీ ఒలెగ్ సల్యూకోవ్ నేతృత్వం వహించారు. రష్యా మీడియా సంస్థ టాస్ కథనం ప్రకారం మాస్కోలోని రెడ్‌స్క్వేర్‌లో జరిగిన విక్టరీ డే పరేడ్‌కు 27 దేశాల నాయకులు హాజరయ్యారు. వారిలో చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనోసియో లులా ద సిల్వా, సెర్బియా అధ్యక్షుడు అలెక్సాండర్ వ్యూకిక్, స్లోవక్ ప్రధాన మంత్రి రాబర్ట్ ఫికో, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో, క్యూబా అధ్యక్షుడు మెగ్యుయెల్ డియాజ్ క్యానెల్, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టో లామ్, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తాహ్ ఎల్‌-సిసి, పాలస్తీనా అధ్యక్షుడు మహమౌద్ అబ్బాస్, వెనెజులా అధ్యక్షుడు నికొలస్ మదురో, ఇథియోపియా అధ్యక్షుడు టాయే అట్‌స్కె సెలాస్సీ, గినియా బిస్సావ్ అధ్యక్షుడు ఉమారో సిస్సోకో తదితరులు ఉన్నారు. గత ఏడాది రష్యా విక్టరీ డే పరేడ్‌లో 9 వేల ట్రూప్‌లు, 61 ఆయుధ వ్యవస్థలు, 15 యుద్ధ విమానాలు భాగస్వామ్యం అయ్యాయి. ఈ ఏడాది 13 దేశాల నుంచి పరేడ్ బృందాలు రెడ్‌స్క్వేర్ పరేడ్‌లో పాల్గొన్నాయి. అలాగే సిఐఎస్ దేశాఉ అజర్‌బైజాన్, బెలారస్, కజకస్తాన్, తజకిస్తాన్, కిర్గిస్తాన్, తరువాయి 12లో








## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు నెలవేతనం విరాళం

నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఇవ్వాలని సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్



ఒక భారతీయునిగా తన బాధ్యతగా భావించి, దేశ భద్రత కోసం తన ఒక నెల జీతాన్ని ' నేషనల్ డిఫెన్స్ ఫండ్'కు విరాళంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. భారత్ సైనిక దళాలు తీవ్రవాదాన్ని తరిమికొట్టేందుకు, సరిహద్దులను, ప్రజలను రక్షించేందుకు చేస్తున్న పోరాటానికి ఇది చిన్న మద్దతు అని తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## యుద్ధంలో జోక్యం చేసుకోవడం మా పని కాదు : అమెరికా

**వాషింగ్టన్ :** భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య ఘర్షణలు మధ్యలో జోక్యం చేసుకోవడం'' ప్రాథమికంగా తమ పని కాదని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చెప్పారు. '' ఉద్రిక్తతలను కొంత మేరకు తగ్గించుకునేందుకు ఇరువురిని ప్రోత్సహించేలా ప్రయత్నించడం వరకే మేము చేయగలం. కానీ, యుద్ధం మధ్యలో జోక్యం చేసుకోవడం ప్రాథమికంగా మా పని కాదు. దీనిని నియంత్రించడంలో అమెరికా సామర్థ్యంతో సంబంధం లేదు. ఆయుధాలు వదిలిపెట్టమని భారతీయులకు అమెరికా చెప్పలేదు. మేము దౌత్య మార్గాల ద్వారా వ్యవహారాలను చక్కదిద్దే పనిని కొనసాగిస్తాం''ని అమెరికాకు చెందిన ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు. ''ఇది విస్తృత ప్రాంతీయ యుద్ధంగా మారకూడదనే మా ఆకాంక్ష, ఆశ. అణుయుద్ధాన్ని దేవుడే ఆపాలి,'' అని వాన్స్ చెప్పారు. ప్రస్తుత సమయంలో అలా జరుగుతుందని తాము అనుకోవడం లేదన్నారు.

# పెరిగిన చైనా ఎగుమతులు

టారిఫ్‌ల యద్ధంతో అమెరికాకు తగ్గిన ఎగుమతులు

ఇతర దేశాలకు వాణిజ్యంతో లోటు భర్తీ


సుంకాలపై నేడు జెనీవాలో అమెరికా, చైనా చర్చలు



**బీజింగ్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ యుద్ధం నేపథ్యంలో ఏప్రిల్ మాసంలో అమెరికాకు చైనా ఎగుమతులు తగ్గాయి. గత మాసంలో చైనా ఎగుమతులు మొత్తం గత ఏడాది కంటే 8.1 శాతానికి పెరిగింది. అనేక మంది ఆర్థికవేత్తలు ఊహించిన దానికంటే 2 శాతం వేగంగా పెరుగుదల కనిపించింది. గత ఏడాది కంటే దిగుమతులు ఏప్రిల్ మాసంలో 0.2 శాతం తగ్గాయి. అమెరికాకు షిప్‌మెంట్‌లు 21 శాతం తగ్గాయి. చైనాకు అమెరికా నుంచి దిగుమతులతో గత ఏడాది కంటే 13 శాతం తరుగుదల కనిపించింది. గత ఏడాది ఏప్రిల్ మాసంలో అమెరికాతో చైనాకు మిగులు వాణిజ్యం 27.2 బిలియన్ డాలర్లుగా నమోదుకాగా, ఈ ఏడాది అదే మాసంలో 20.5 బిలియన్ డాలర్లుగా ఉంది. తొలి నాలుగు మాసాలలో అమెరికాకు చైనా ఎగుమతులు 2.5 శాతం పడిపోగా, అమెరికా నుంచి దిగుమతులు 4.7 శాతం పడిపోయింది. అమెరికా చైనాపై టారిఫ్‌ను 145 శాతానికి పెంచగా, చైనా ప్రతిగా 125 శాతం చేసింది. ఈ వారాంతానికి టారిఫ్‌లలో నెలకొన్న ప్రతిష్టంభన తొలిగిపోయే అవకాశం ఉందని భావిస్తున్నారు. అమెరికా ట్రెజరరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్, ఇతర వాణిజ్య అధికారులు జెనివాలో శనివారం నాడు చైనా అధికారులతో సమావేశం కానున్నారు. అదే సమయంలో బీజింగ్, అమెరికాల మధ్య వివిధ అంశాలలో వైరుధ్యాలు నెలకొన్నాయి. ముఖ్యంగా వ్యూహాత్మక ప్రయోజనాల విషయంలో ఉన్నాయి. ఈ అంశాలు ఇరు దేశాల మధ్య చర్చల సందర్భంగా ఆటంకంగా మారే అవకాశం ఉండొచ్చు.

# 14వ పోప్‌గా రాబర్ట్ ప్రివోస్ట్

తొలిసారి అమెరికన్ ఎన్నిక : ట్రంప్ హర్షం



**రోమ్ :** అమెరికాకు చెందిన రాబర్ట్ ప్రివోస్ట్ (69) 14వ పోప్‌గా ఎన్నికయ్యారు. పోప్ ఎన్నిక ప్రక్రియ పూర్తి అయిందని, కొత్త పోప్‌గా రాబర్ట్ ప్రివోస్ట్ ఎన్నికపై వాటికన్ ఒక ప్రకటన చేసింది. వాటికన్ సిటీలోని సిస్టిన్ చాపెల్ చర్చి పొగగొట్టం నుంచి తెల్లటి పొగ విడుదల చేయడం ద్వారా పోప్‌ను ఎన్నుకునే ప్రక్రియ పూర్తయినట్టు సంకేతమిచ్చారు. పోప్‌గా అమెరికన్ ఎన్నిక కావడం ఇదే మొదటిసారి. పోప్ రాబర్ట్ ప్రివోస్ట్ సంప్రదాయం ప్రకారం పోప్ లియో సెయింట్ పీటర్స్ కూడలిలోని బాల్కనీ నుంచి వేలాది మంది క్యాథలిక్స్‌కు శాంతి సందేశమిచ్చారు. ''ఆర్డో రితూమ్ కాంక్లేవిస్'' నిబంధనల ప్రకారం పోప్ ఎన్నిక పూర్తి అయినట్లు వాటికన్ వర్గాలు తెలిపాయి. కార్డినళ్లలో అందరికంటే పెద్దవారైన మత గురువు 'అత్యున్నత మత గురువుగా మీ ఎన్నికను అంగీకరిస్తున్నారా' అని పోప్ రాబర్ట్‌ను ప్రశ్నించారు. 'ఇకపై ఏ పేరుతో మిమ్మల్ని పిలవాలని కోరుకుంటారు' అని అడిగారు. తన ఎన్నికను అంగీకరిస్తున్నట్లు పోప్ రాబర్ట్ చెప్పారు. దీంతో 133 మంది కార్డినళ్ల సమావేశం ముగిసింది.పోప్ ఎన్నిక పూర్తి అయినట్లు సంకేతం అందిన వెంటనే 'వైవల్ ఇల్ పపా' (పోప్ వర్ధిల్లాలి) అంటూ క్యాథలిక్స్ నినాదాలు చేశారు. ఒకరినొకరు హత్తుకొని తమ సంతోషాన్ని పంచుకున్నారు. పోప్ ఎన్నికపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తంచేశారు. తమ దేశానికి చెందిన రాబర్ట్ ప్రివోస్ట్ పోప్‌గా ఎన్నిక కావడం గర్వకారణమన్నారు.షికాగోకు చెందిన రాబర్ట్ ప్రివోస్ట్ మతగురువుగా దీర్ఘకాలం దక్షిణ అమెరికాలో పనిచేశారు. ఇటీవల బిషప్ నియామక బాధ్యతలు నిర్వహించారు. దశాబ్దం పాటు పెరూలోని ట్రుజిల్లోలో పని చేశారు. అనంతరం పెరూ దేశంలోని చిక్లాయో నగర బిషప్‌గా నియమితులయ్యారు. 201423 వరకు బిషప్‌గా ఉన్నారు.

## చైనాపై సుంకాలు 80 శాతం సరిపోతుందేమో

**వాషింగ్టన్ :** చైనాతో సుంకాల యుద్ధాన్ని చల్లబర్చేందుకు ఆ దేశంపై విధించిన సుంకాలను 145 శాతం నుంచి 80 శాతానికి తగ్గిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం నాడు ప్రతిపాదించారు. స్విట్జర్లాండ్‌లోని జెనివాలో ఇరు దేశాల మధ్య శనివారం చర్చలు జరగున్న నేపథ్యంలో ఆయన తన సోషల్ మీడియాలో ఈ మేరకు పోస్ట్ చేశారు. ''చైనాపై 80 శాతం టారిఫ్ సరైందని అనిపిస్తోంది! ఆ తరువాత (చైనాతో చర్చలు జరపనున్న అమెరికా ట్రెజరీ సెక్రటరీ) స్కాట్ బి ఇష్టం,'' అని అందులో పేర్కొన్నారు. అంతే కాకుండా చైనా కూడా తన మార్కెట్‌లను తెరవాలని అన్నారు. ''అది వారికి చాలా మంచిది!!! మూసివేసిన మార్కెట్‌లు ఏ మాత్రం పనిచేయవు'' అని కూడా రాసుకొచ్చారు.

# భారత్, పాక్ పోరు ఆందోళనకరం

## పరిస్థితులు జఠిలం చేసుకోవద్దు : చైనా

**బీజింగ్/వాషింగ్టన్ :** భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధ పరిస్థితులు నెలకొనడం, సైనిక ఘర్షణ తీవ్ర రూపం దాల్చడంతో అగ్రరాజ్యాలైన చైనా, అమెరికా ఆందోళన వ్యక్తం చేశాయి. ఏ రూపంలోనూ ఉగ్రవాదాన్ని సహించేది లేదని రెండు దేశాలు స్పష్టంచేశాయి. అయితే ఇరుగు, పొరుగు దేశాలైన భారత్, పాకిస్థాన్ అంతర్జాతీయ చట్టాలకు లోబడి, శాంతి, సుస్థిరతకు కట్టుబడాలని పిలుపునిచ్చాయి. తాజా పరిణామాలపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని మరింత జఠిలం చేసుకోవద్దని, సంయమం పాటించాలని భారత్, పాకిస్థాన్‌కు సూచించారు. ఉద్రిక్తతలు తగ్గించడానికి నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి చైనా సిద్ధమన్నారు. పాకిస్థాన్‌పై దాడి అనంతరం చైనా విదేశాంగ శాఖ మంత్రితో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మాట్లాడుతూ పరిస్థితులను తీవ్రతరం చేస్తున్నది పాకిస్థాన్ అని, ఉద్రిక్తతలు పెంచే ఉద్దేశం భారత్‌కు లేదని చెప్పారు. పాక్ చర్యలకు దీటుగా బదులిస్తామని చైనా సహా అమెరికా, బ్రిటన్, సౌదీ, జపాన్, రష్యా, ఫ్రాన్స్ దేశాల ప్రతినిధులకు దోవల్ స్పష్టం చేశారు. అమెరికా కూడా భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణపై స్పందించింది. ఈ రెండు దేశాల మధ్య ఘర్షణలో తలదూర్చమని తేల్చిచెప్పింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్ స్పందిస్తూ 'భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణలు కొత్తేమీ కాదు. దశాబ్దాలుగా సాగుతున్నాయి. ఇవి పెరగకుండా చూసుకోవడమే ప్రస్తుతం ముఖ్యం' అని అన్నారు. చర్చలతో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఉగ్రదాడికి పాల్పడిన వారిని చట్టప్రకారం శిక్షించాలని బ్రూస్ అన్నారు.

## పాకిస్తాన్ ఉద్రిక్తతలు తగ్గించుకోవడమే సులువైన పరిష్కారం

లండన్‌లో భారత హైకమిషనర్

**లండన్ :** ప్రస్తుత పరిణామాలకు సులువైన పరిష్కారం కావాలంటే పాకిస్తాన్ ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని అంతర్జాతీయ సమాజం చెప్పాలని లండన్‌లో భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి అన్నారు. స్కై న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ '' గడిచిన 30 ఏళ్ళుగా దీనిని (ఉగ్రవాదాన్ని) భారతపై అప్రకటిత యుద్ధం చేస్తుందని అందరికీ తెలిసిందే. అంతర్జాతీయ సమాజం నిజంగా ఈ అంశంలో ఆందోళన చెందితే, దీనికి సులువైన పరిష్కారం పాకిస్తాన్ తనకు ఉన్న ఉద్రిక్తతలను తగ్గించుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పడమే'' అని అన్నారు.

## చర్యలు తీసుకోవాలి(మొదటి పేజీ తరువాయి)

తప్పుదోవ పట్టించే కంటెంట్‌ను ప్రసారం చేయడం పట్ల నేను కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) తరపున ఈ విషయమై తీవ్ర ఆందోళన చెందుతున్నాను' అని డి.రాజా పేర్కొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా యావత్ దేశం ఏకతాటిపై నిలబడ్డ తరుణంలో కొన్ని న్యూస్ చానళ్లు సమస్యకు మతపరమైన రంగు ను పులుముతూ ధృవీకరించని వాదనలను వ్యాప్తి చేస్తున్నాయని, ప్రభుత్వం లేదా సైనికబలగాల నుంచి 'వార్ హిస్టీరియా'ను ప్రోత్సహించడం తరహా ప్రమాదకరమైన ధోరణులను చూడాల్సిరావడం బాధాకరమన్నారు. అలాంటి న్యూస్ కవరేజీ బాధ్యతాయుత జర్నలిజాన్ని అణగదొక్కడం, జాతీయ సమైక్యతకు ప్రత్యక్ష ముప్పును కూడా కలిగిస్తున్నదని డి.రాజా ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధోన్మాదం, సమాజాలను లక్ష్యంగా చేసుకోవడంవల్ల విశ్వసనీయ వార్తల పట్ల విశ్వాసం క్షీణిస్తుందని, తద్వారా పౌరులలో భయాన్ని సృష్టిస్తుందని దేశాన్ని అస్థిరపరచాలని కోరుకునే శక్తులు వీటిద్వారా ప్రజలను రెచ్చగొట్టి ఆందోళన జ్వాలలను రగులుస్తున్నారు కానీ సమస్య పరిష్కారాన్ని కోరుకోవడంలేదని సిపిఐ ప్రధానకార్యదర్శి రాజా కేంద్ర మంత్రికి తెలియజేశారు. సెక్యులరిజం, ప్రజాస్వామ్య సూత్రాలు, రాజ్యాంగ విలువలు మార్గనిర్దేశం చేయబడిని టెర్రరిజానికి వ్యతిరేకంగా ఐక్యత, దృఢ నిశ్చయంతో కూడిన వైఖరికి సిపిఐ నిరంతర మద్దతు నిచ్చిందని రాజా చెప్పారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌పాకిస్థాన్ సైనిక ఘర్షణలకు సంబంధించి న్యూస్ చానెళ్లు, ప్లాట్‌ఫారాలు ప్రసారం చేస్తున్న కంటెంట్ జాతి ఐక్యతను ప్రతింబింబించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకు తగదిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ, హోం మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాల శాఖ సమన్వయంతో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వివరించిన వాస్తవ ఆధారిత వార్తలు ప్రసారం అయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని, విశ్వసనీయ వార్తలు అందించాలని మంత్రి అశ్వీణివైష్ణవ్‌ను డి.రాజా కోరారు.

**'ది వైర్' వెబ్‌సైట్‌ను నిలిపివేయడం అప్రజాస్వామికం : సిపిఐ**

భారత ప్రభుత్వం ఏకపక్షంగా 'ది వైర్' వెబ్‌సైట్‌ను నిలిపివేయడం అప్రజాస్వామికమని సిపిఐ ఖండించింది. పత్రికా స్వేచ్ఛ తప్పనిసరిగా గౌరవించబడాలని ప్రభుత్వాన్ని కోరింది.ఈ మేరకు శుక్రవారం సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఈ చర్య పత్రికా స్వేచ్ఛ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, సమాచార హక్కును ఉల్లంఘించడమేనని సిపిఐ విమర్శించింది.ప్రభుత్వం ఈ ఏకపక్షంగా చర్య వలన కాలంనాటి ప్రెస్ సెన్సార్‌షిప్ చేయడాన్ని తలపిస్తోందని ఆందోళన వ్యక్తంచేసింది. పహెల్గామ్ ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో కొన్ని మెయిన్‌స్ట్రీమ్ న్యూస్ చానెళ్లు, ప్లాట్‌ఫారాలు మతపర విద్వేషాలను నిస్సిగ్గుగా రెచ్చగొట్టేందుకు ప్రయత్నించడం శోచనీయమని, దూరదర్శన్ వంటి పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్స్ కూడా ఈ తరహా విభజనలు సృష్టిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని ఆక్షేపించింది.ఇది రాజకీయ పక్షపాతాన్ని ప్రతిబింబిస్తోందని, స్వతంత్ర గళాలను సహించలేని దిశగా తీసుకువెళ్తున్నదని విమర్శించింది. కేంద్ర ప్రభుత్వం 'ది వైర్' వెబ్‌సైట్‌ను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రజాస్వామిక శక్తులు ఈ తరహా సెన్సార్‌షిప్‌ను వ్యతిరేకించాలని సిపిఐ జాతీయకార్యదర్శి వర్గం పిలుపునిచ్చింది.

## సంఘీభావ ర్యాలీలు
(మొదటి పేజీ తరువాయి)

సిఎంఒ స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్,డిజిపి జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, కమిషనర్లు సిపి సివి ఆనంద్, అవినాష్ మహంతి, సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ప్రజల్లో జాతీయవాదాన్ని పెంపొందించడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో అన్ని వర్గాల ప్రజలతో సంఘీభావ ర్యాలీని నిర్వహించాలని అందుకు అనుగుణంగా కార్యక్రమాలు రూపొందించుకోవాలని సిఎస్ రామకృష్ణారావును ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లో నిన్న నిర్వహించిన సంఘీభావ ర్యాలీ సమాజానికి మంచి సంకేతాన్ని ఇచ్చిందని అభిప్రాయపడ్డారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి అన్నారు. 24 గంటల ముందే ప్రజలను అప్రమత్తం చేసి మాక్ డ్రిల్ ట్రయల్ నిర్వహించాలని అధికారులకు డిప్యూటీ సిఎం సూచించారు. అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సెలవులను రద్దుచేసి వారి హెడ్ క్వార్టర్ లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి, వార్తా ప్రచారాల్లో తగు జాగ్రత్తల కోసం మీడియా అధిపతులతో సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాదులో సైరన్ అలర్ట్ ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని అందుకు సంబంధించిన పరికరాలు ఎక్కడున్నా కొనుగోలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. దేశ రక్షణలో కీలక పాత్ర వహిస్తున్న రక్షణ శాఖకు సంబంధించిన పరికరాల తయారీకి సంబంధించిన పరిశ్రమల వద్ద కట్టుదిత్తమైన భద్రతను ఏర్పాటు చేశామని మాక్ డ్రిల్ లో వీళ్ళందర్నీ కూడా భాగస్వాములు చేశామని తెలిపారు.ఆసుపత్రి భవనాల స్లాబు పైన ఎరుపు రంగుతో ప్లస్ గుర్తును ఏర్పాటు చేసుకోవాలని అన్ని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర డిజిపి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని, రైల్వే స్టేషన్స్ బస్టాండ్లు వద్ద భద్రత పెంచినట్లు చెప్పారు. హైదరాబాదులో ఉన్న డిఆర్డిఏ, డి ఆర్ డి ఓ, ఎన్ ఎఫ్ సి తదితర జాతీయ స్థాయి పరిశ్రమల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 24/7 పెట్రోలింగ్ నిర్వహిస్తూ సిసిటీవీల ద్వారా మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో ఫేక్ వార్తలు ప్రచారం కాకుండా సైబర్ టీంలను ఏర్పాటు చేసి ఎప్పటి కప్పుడు తప్పుడు వార్తలను కట్టడి చేయడం తో పాటు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు డిజిపి వివరించారు. కెవైసి లేకుండా సిమ్ కార్డులు జారీ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నమని. సున్నితమైన ప్రాంతాల్లో భద్రతను పెంచామని వివరించారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేసి పర్యవేక్షణ చేయడానికి హైదరాబాద్ కేంద్రంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాము, గతంలో కేసులు నమోదయి జైలు జీవితం అనుభవించి విడుదలైన వారి కదలికల పట్ల నిఘా పెంచామని వారి ప్రతి కదలికను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఉక్రెయిన్ దేశంలో యుద్ధం నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడానికి ప్రత్యేకంగా యాప్ రూపొందించారని, అలాంటి యాప్ రాష్ట్రంలో తీసుకురావడం కోసం ఆలోచన చేస్తున్నట్లు సమావేశంలో డిజిపి వివరించారు.

## మళ్లీ కవ్వింపు చర్యలు
(మొదటి పేజీ తరువాయి)

పలు నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడుతోంది. ఫిరోజ్‌పూర్‌లో జరిపిన డ్రోన్ దాడిలో పలువురికి గాయాలైనట్లు తెలుస్తోంది. దీంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

## ఇందిరమ్మ ఇళ్లు
(మొదటి పేజీ తరువాయి)

ఖమ్మం ఎంపి రామసహాయం రఘురామ రెడ్డి , సమాచార, పౌర సంబంధాల కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్‌లోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో జర్నలిస్టు కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేశారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా 'తెలంగాణ మీడియా అకాడమీ వెబ్‌సైట్‌ను మంత్రి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించి, ఆ వెబ్‌సైట్‌లో ఉన్న పాత వార్తాపత్రికలను ఆసక్తిగా తిలకించారు. వివిధ కోర్సులకు సంబంధించిన బుక్‌లెట్‌ను కూడా ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈనెలాఖరులోపు సిఎం ప్రత్యేక నిధి నుంచి రూ.10 కోట్ల నిధులు మంజురయ్యేలా చూస్తానని హామీనిచ్చారు. మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణను వెల్లడిస్తామని హామీనిచ్చారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనానికి చిన్న చిన్న మరమత్తులు పూర్తి చేసి ఈ నెల చివరిలోగా అధికారికంగా ప్రారంభిస్తామన్నారు. మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజనికి తెలియజేసే విషయంలో ఎంతో మంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని తన జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితమైన వాళ్లు ఎంతోమంది ఉన్నారన్నారు. విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42.00 కోట్లను ఫీక్సడ్ డిపాజిట్ చేసి, దీని పైన వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమీ ఖర్చు పెడుతున్నదని, ఇప్పటి వరకు రూ.22 కోట్లు ఖర్చు చేసినట్టు వివరించారు. జర్నలిస్టులకు ఏదో చేయాలనే తపన ఉన్నప్పటికీ అనుకున్నది చేయలేకపోయామని, జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసానిచ్చారు.

మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.ఒక లక్షల చొప్పున 5 సంవత్సరాల వరకు, నెలకు రూ.3వేల చొప్పున పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల కింద 1 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు ఒక వెయ్యి రూపాయాల గరిష్టంగా ఇద్దరికి అందిస్తామని, ఇప్పటి వరకు ఈ ఖాతాలలో మొత్తం రూ.8,98,39,000/లు ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. మీడియా అకాడమీ ప్రారంభోత్సవ సమయం నాటికి నాంపల్లిలోని స్టేట్ ఇన్‌ఫార్మేషన్ సెంటర్‌ను మీడియా అకాడమీకి తరలించాలని సమాచార శాఖ కమిషనర్‌ను మంత్రి పొంగులేటి ఆదేశించారు. రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని, తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారన్నారు. గడిచిన రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రజలకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా జర్నలిస్టులు సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని కొనియాడారు. సమాచార, పౌర సంబంధాల కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా తెలంగాణ మీడియా వెబ్‌సైట్ అందుబాటులో లేదని, ఇప్పుడు అందుబాటులోనికి వచ్చిందన్నారు. జర్నలిస్టు సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కాగా అకాల మరణానికి గురైన 38 మంది జర్నలిస్టుల కుటుంబాలకు,ప్రమాదాలకు, అనారోగ్యలకు గురై న 8మంది జర్నలిస్టులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యూజె)రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ,ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఎ. మాజీద్, రాష్ట్ర కార్యదర్శులు కె.శ్రీకాంత్ రెడ్డి, జి.మధుగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని కిరణ్‌కుమార్, ఎ.రాజేష్, గౌస్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, హెచ్‌యుజె అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తగిన మూల్యం తప్పదు
(మొదటి పేజీ తరువాయి)

కడారి ప్రభాకర్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్, తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులు ఆర్.శంకర్ నాయక్ హాజరవ్వగా, సదస్సుకు ఆర్.గోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ హిజ్బుల్ ముజాహిద్దీన్, లాష్కరేతోయిబా తదితర ఉగ్రవాద ముష్కరమూకలకు పాకిస్థాన్ శిక్షణ ఇచ్చి భారత్‌లోకి పంపిస్తుందని మండిపడ్డారు. పల్గాహంలో అమాయక భారత ప్రజలపై విచాక్షణ రహితంగా టెర్రరిస్టులు దాడులకు పాల్పడడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. లాహోర్, రవాల్పిండి సమీప నగరాల్లో ఉగ్రవాదులకు పాకిస్థాన్ శిక్షణ ఇస్తుందని విమర్శించారు. లాష్కర్ ఉగ్రవాది మసూద్ సయిద్ తన కుటుంబంలో 10 మంది చనిపోయారని తెలిపారని,ఆయన ఎంతమంది అమాయక ప్రజల ప్రాణాలు తీశారని ప్రశ్నించారు. పాకిస్థాన్‌తో వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి అజీజ్ పాషా రెడ్ సెల్యూట్ చేశారు. ప్రపంప దేశాలన్ని భారత్‌కు మద్దతు ఇస్తున్నాయన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇంకా ఫ్రాన్స్, యుకె లాంటి దేశాలు భారత్‌కు మద్దతు ఇస్తున్నాయన్నారు. చైనా తమకు సంబంధం లేదంటునే పాకిస్థాన్‌కు పరోక్షంగా సహకారం అందిస్తుందని విమర్శించారు. రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యా ఫాసిజంపై విజయం సాధించిందని, సుమారు 4 కోట్ల మంది రష్యా సైనికులు ప్రాణత్యాగం చేశారన్నారు. హిట్లర్‌ను, జర్మన్‌ను రష్యా ఓడించి, ప్రపంచ విముక్తి పోరాటాలకు భాసటగా నిలిచిందని చెప్పారు. ఇటీవల రష్యాలో జరిగిన 80వ విజయోత్సవ కార్యక్రమానికి తాను వెళ్లినట్లు వివరించారు.

**ఫాసిజంపై విజయంతో ఉపందుకున్న విముక్తి పోరాటాలు : బొమ్మగాని ప్రభాకర్**

ఫాసిజంపై రష్యా సాధించిన విజయ స్ఫూర్తితో భారత స్వాతంత్ర్య పోరాటం మరింత ముందుకు పోవడంతో స్వాతంత్ర్యం వచ్చిందని బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ఆ స్ఫూర్తితో అనేక విముక్తి పోరాటాలు విజయవంతమయ్యాయన్నారు. రష్యాలో జరిగిన 80వ వార్షికోత్సవానికి భారత ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి వెళ్లాల్సి ఉండేదని, ప్రస్తుత యుద్ధ వాతవరణంలో వెళ్లలేకపోయారని తెలిపారు. ప్రస్తుతం పాకిస్థాన్‌పై యుద్ధాన్ని యావత్ ప్రపంచ దేశాలు భారత్‌కు మద్దతు ఇస్తున్నాయని, భారత సైన్యానికి ప్రతి ఒక్క పౌరుడు మద్దతుగా ఉన్నారన్నారు. ఐఎల్‌ఎ తరపున భారత సైన్యానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు.

**దాడి వేనుక సామ్రాజ్య వాద కుట్ర : కె.ప్రభాకర్**

పహల్గాం ఉగ్రదాడి వెనుకు సామ్రాజ్య వాద కుట్ర దాగి ఉందని కె.ప్రభాకర్ అన్నారు. భారత్, పాకిస్థాన్‌లతో అమెరికా దేశం స్నేహంగా ఉంటునే, ఇరు దేశాలకు అమెరికా ఆయుధాలను విక్రయిస్తుందన్నారు. క్యూబాపై అనేక ఆర్థిక ఆంక్షలు విధిస్తున్న అమెరికా, ఉగ్రవాదులకు స్వర్గసీమగా మారిన పాకిస్థాన్‌పై ఎందుకు ఆంక్షలు విధించడం లేదని నిలదీశారు. ఫాసిజంపై రష్యా కమ్యూనిజం సాధించిన విజయంతోనే అనేక విముక్తి పోరాటాలు వచ్చాయన్నారు.

**ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి : కెవిఎల్**

కులాలకు, మతాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని కెవిఎల్ అన్నారు. కులాలు, మతాలకన్నా ముందు అందరం భారతీయులమన్నారు. ఫాసిజంపై పోరాటానికి శపథం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కఫ్ సభ్యులు విజయలక్ష్మి , కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బలవంతం చేయలేం
(మొదటి పేజీ తరువాయి)

ప్రాథమిక హక్కని.. కేంద్రం రూపొందించిన ఆ విధానం అమలును నిరాకరించడం ద్వారా.. రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల పిల్లలకు ఆ హక్కును దూరం చేస్తున్నాయని పేర్కొన్నారు. కాబట్టి పిల్లలు ప్రభావవంతమైన విద్యను పొందేలా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కేసుతో తనకేం సంబంధం ఉందని అత్యున్నత న్యాయస్థానం పిటిషనర్‌ను ప్రశ్నించగా.. తాను తమిళనాడుకు చెందిన వ్యక్తినని.. ప్రస్తుతం ఢిల్లీలో స్థిరపడ్డానని తెలిపారు. దేశ రాజధానిలో స్థిరపడినప్పుడు వివిధ రాష్ట్రాల్లో జాతీయ విద్యావిధానం అమలు గురించి పిటిషన్ దాఖలు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తూ.. అత్యున్నత న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టేసింది. తన పిల్లలు ఢిల్లీలో హిందీ నేర్చుకోవడం కొనసాగించవచ్చని పిటిషనర్‌కు తెలిపింది. జాతీయ విద్యావిధానం(ఎన్ఇపి)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లిషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డిఎంకె ప్రభుత్వం స్పష్టంచేస్తోంది. ఎన్ఇపి విషయంలో తమిళనాడు కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతోంది. రాజకీయ అభిప్రాయ భేదాలకు అతీతంగా దీన్ని అమలుచేయాలని స్టాలిన్‌కు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల ఓ లేఖలో సూచించారు. అయితే.. తమిళ భాషకు, ప్రజలకు, రాష్ట్రానికి నష్టం కలిగించే చర్యలను అనుమతించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి పలు మార్లు స్పష్టంచేశారు. మరోవైపు.. జాతీయ విద్యావిధానాన్ని ఆమోదిస్తేనే తమిళనాడుకు నిధులు విడుదలవుతాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

## పౌర విమానాలే కవచం
(మొదటి పేజీ తరువాయి)

ఈ వివరాలు వెల్లడించారు. భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచార సేకరణే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం టర్కీకి చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిసిందన్నారు. ''గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగిన పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంట ఉల్లంఘనకు పాల్పడుతూ దాడులకు తెగబడింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. పాకిస్థాన్ నుంచి 300 నుంచి 400 డ్రోన్ల వరకు వచ్చాయి. వీటిలో అనేక డ్రోన్లను కూల్చేశాం. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం. ఈ దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుంది. ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా పాక్ దాడులు చేస్తోంది. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాక్ ప్రయత్నిస్తోంది. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి పౌర విమానాలకు గగనతలాన్ని మూసివేయలేదు. కరాచీ, లాహోర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తూనే ఉన్నాయి. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని తెలిసీ.. పౌర విమానాలను పాకిస్థాన్ రక్షణ కవచంగా వాడుకుంటోంది. ఇది భారత్‌పాక్ మధ్య అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో వెళ్లే విమానాలతోపాటు అక్కడి పౌర విమానాలకు సురక్షితం కాదు. అంతర్జాతీయ విమానాలను దష్టిలో ఉంచుకొని భారత వాయుసేన పూర్తి సంయమనంగా వ్యవహరించింది'' అని రక్షణశాఖ ప్రతినిధులు కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు వెల్లడించారు. భారత్. భారత సైన్యం దేశ సార్వభౌమత్వాన్ని, దేశ ప్రాదేశిక సమగ్రతను కాపాడటానికి కట్టుబడి ఉందని.. అన్ని దుర్మార్గపు కుట్రలకు తుత్తునియలు చేస్తామని స్పష్టం చేశారు.

## 'రూ. 10 కోట్ల' నిధులు
(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని శ్రీనివాస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మీడియా అకాడమీకి రూ.100 కోట్ల నిధిలో భాగంగా ప్రస్తుతం రూ.44 కోట్లు ఉన్నాయని, దీని పైన వచ్చే వడ్డీ ఆధారంగానే చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలను పెన్షన్ లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం వడ్డీ తగ్గిన నేపథ్యంలో ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇటీవల జర్నలిస్టు నిధికి సిఎం రేవంత్ రెడ్డి తన ప్రత్యేక నిధి నుంచి ప్రకటించిన రూ.10కోట్ల నిధులను మంజూరు చేయించాలని, అలాగే నాంపల్లిలోని గృహకల్పలో ఉన్న స్టేట్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌ను మీడియా అకాడమీ భవనానికి తరలించేందుకు అనుమతివ్వాలని మంత్రి పొంగులేటిని కోరారు.

## నెలవేతనం విరాళం (మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. విరాళ యజ్ఞంలో దేశభక్తి కలిగిన ప్రతి పౌరుడూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ కోసం నిలబడిన మన సైనికులతో ప్రతి భారతీయుడు కలిసికట్టుగా ఉండాల్సిన సమయమిదని అన్నారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి తన ఎక్స్‌లో (ట్విట్టర్) పోస్ట్ చేశారు. అంతకు ముందు ' నేషనల్ డిఫెన్స్ ఫండ్' కు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు తమ ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇచ్చే విషయమై సిఎం ఎ.రేవంత్‌రెడ్డి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో చర్చించారు. సిఎం సూచన మేరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిల ఒక నెల వేతనాన్ని విరళాంగ ఇవ్వనున్నట్టు ప్రకటించనున్నారు. కాగా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు కూడా తమ ఒక నెల వేతనాన్ని ఇవ్వాలని సిఎం విజ్ఞప్తి చేశారు. సైన్యం సేవా నిరతికి ఉడతా భక్తిగా ' తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్' ప్రతినిధులు తమ ఒక రోజు వేతనాన్ని ఇవ్వనున్నట్టు ప్రకటించింది, సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తమ ఒక రోజు వేతనాన్ని 'నేషనల్ డిఫెన్స్ ఫండ్'కు విరాళంగా ఇవ్వనున్నామని, దేశభక్తిని ప్రేరణగా చేసుకుని, సైనికుల పట్ల గౌరవ భావంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ఎ. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖను అందించనున్నట్లు వారు తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిఐసిగా డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి పదవి ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తరువాత ఆయన మధ్యాహ్నం 12.05 గంటలకు పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు,శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, డిజిపి జితేందర్, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుమిదిని, విజిలెన్స్ కమీషనర్ ఏం.జి.గోపాల్, సిఎంఒ అధికారులు శేషాద్రి, శ్రీనివాస రాజు, మాణిక్ రాజ్, శ్రీనివాసులు, రాజ్‌భవన్ కార్యదర్శి దానకిషోర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మహేష్ దత్ ఎక్కా, సీనియర్ ఐఏఎస్ అధికారులు రఘునందన్ రావు, బుద్దప్రకాష్, వినయ్ కృష్ణారెడ్డి, అడిషనల్ ద మహేష్ భగవత్ తదితరులు హాజరయ్యారు.

# ఈ ఏడాదే సీతారామ నీళ్లు

నాలుగు నెలల్లో టన్నెల్ పనులు పూర్తి చేయాలి

సీతారామ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల... అధికారులతో సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం :** సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ఏడాది ఐదు నియోజక వర్గాలకు సాగునీటిని అందించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. శుక్రవారం ముల్కలపల్లి, అన్నపురెడ్డిపల్లి, సత్తుపల్లి మండలాల్లో పలు చోట్ల పనులను పరిశీలించిన ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాజీవ్ లింక్ కెనాల్ ఏర్పాటు చేసుకుని రాబోయే వర్షాకాలం దుమ్ముగూడెం ఆనకట్టకు గోదావరి నీరు చేరగానే వైరా ప్రాజెక్టుకు పినపాక నియోజక వర్గం తుమ్మలపల్లి వద్ద మారేడుపాక ఎత్తిపోతల పథకం ప్రారంభించి 25వేల ఎకరాల ఆయకట్టుతో పాటు కొత్తగూడెం నియోజక వర్గంలోని అన్ని చెరువులకు నీళ్లు వదలనున్నామని ఆయన తెలిపారు. సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ నుండి 1.8 కిలో మీటర్లకుగాను 1.2 కిలో మీటర్లు పూర్తయిందని పెండింగ్ ఉన్న 600 మీటర్ల పనులు నాలుగు నెలల్లో పూర్తి చేయాలని అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. శాసన సభ్యులతో సమన్వయం చేసుకుని భూసేకరణ చేపట్టాలన్నారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు సస్యశ్యామలం కావాలనే ఆకాంక్షతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు తుమ్మల తెలిపారు. సత్తుపల్లి, పినపాక, వైరా, మధిర, అశ్వారావుపేట నియోజక వర్గాలకు ఈ ఏడాదే సాగునీటిని అందించాలని వైరా ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు స్థిరీకరణ చేయాలని ఆయన తెలిపారు. నాగార్జున సాగర్ నీరు రాకపోయినా గోదావరి జలాలతో పంటలు పండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తుమ్మల వెంట ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి పాటిల్, శాసన సభ్యులు జారె ఆదినారాయణ, మట్టా రాగమయి, అధికారులు శ్రీనివాస రెడ్డి, శ్రీనివాసా చారి, రాజేశ్వరి, కల్లూరు ఆర్డీవో రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భూములకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో భూములకు సంబంధించి అనేక పంచాయితీలకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలనే లక్ష్యంతో సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రతి మండలం, పట్టణంలో భూ విస్తరణ, భూ లావాదేవీలను ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 వేల మంది లైసెన్సులు కలిగిన సర్వేయర్లను తీసుకోబోతున్నామని వెల్లడించారు. అర్హులైన లైసెన్సు కలిగిన సర్వేయర్ల నుంచి ఈ నెల 17 వ తేది వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు.

సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ శాఖపై మంత్రి పొంగులేటి శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో, సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుందని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతం ఉన్న 402 మంది సర్వేయర్లు సరిపోరని, మరి కొంత మంది సర్వేయర్లు అవసరమని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఒకవైపు లైసెన్సులు కలిగిన సర్వేయర్లను తీసుకోవడం, మరోవైపు సర్వే విభాగంలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులు భర్తీ చేయడం, ఇంకోవైపు భూముల సర్వేకు అవసరమైన అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



అభ్యర్థులు ఇంటర్మీడియట్ (గణిత శాస్త్రం) ఒక అంశంగా, కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాలని వివరించారు. ఐటిఐ నుంచి డ్రాఫ్ట్స్‌మన్ (సివిల్), డిప్లొమా (సివిల్), బి.టెక్ (సివిల్) లేదా ఇతర సమానమైన విద్యార్హత కలిగి ఉండాలని అన్నారు. శిక్షణ ఫీజు ఒసి అభ్యర్థులకు రూ.10 వేలు, బిసి అభ్యర్థులకు రూ.5 వేలు, ఎస్‌సి,ఎస్‌టి అభ్యర్థులకు రూ.2500 చెల్లించాల్సి ఉంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో 50 పని దినాలలో తెలంగాణ అకాడమీ (ల్యాండ్ ఇన్ఫర్మేషన్, మేనేజ్‌మెంట్) ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారన్నారు. ఈ మొత్తం ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి వీలైనంత త్వరగా లైసెన్స్ కలిగిన సర్వేయర్ల సేవలను అం దుబాటులోకి తీసుకురావాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, కమిషనర్ ఆఫ్ సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ శాఖ జ్యోతి బుద్ధ ప్రకాష్, సిసిఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.మకరందు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

త్వరలో అక్రిడిటేషన్లు, ప్రొఫెషనల్ కమిటీల ఏర్పాటు

టియుడబ్ల్యూజె ప్రతినిధి బృందానికి మంత్రి పొంగులేటి హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఒక్కొక్కటిగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విరాహత్ అలీ, కె. రాంనారాయణల నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం మంత్రి శ్రీనివాస్ రెడ్డితో సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో సమావేశమై జర్నలిస్టుల సమస్యలపై చర్చించింది. ఎన్నికల సమయంలో, కాంగ్రెస్ మేనిఫెస్టోలో జర్నలిస్టుల సంక్షేమాన్ని పొందుపర్చడంతో జర్నలిస్టులు ఎంతో హర్షించారని, అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా ఇంకా ఏ ఒక్క సమస్యకు పరిష్కారం దక్కకపోవడంతో జర్నలిస్టుల్లో నిరాశ చోటుచేసుకుందని విరాహత్, రాంనారాయణలు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ల నియమావళి రూపకల్పనా కోసం ప్రభుత్వం కమిటీ వేసిందని, ఆ కమిటీ నివేదిక సమర్పించి నెల రోజులు గడుస్తున్నా ఇంకా జిఓ జారీ కాలేదన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన అక్రెడిటేషన్‌లను ఏడాదిన్నర కాలంగా జర్నలిస్టులు రెన్యూవల్ చేసుకుంటున్న పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే కొత్త అక్రెడిటేషన్‌లను జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు వ్యతిరేకంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కేవలం అర్బన్ ప్రాంతాల్లో సొసైటీల వరకే వర్తిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కాదని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వర్తించేందుకుగాను వారికి రక్షణ కల్పించేందుకు, సామాజిక సేవలో నిమగ్నమైన జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు అనేక జి.ఓలు జారీ చేసి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాయని, గత పదేళ్లుగా వాటిని నిర్వీర్యం చేశారని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులపై దాడుల నిరోధక హైపవర్ కమిటీ, వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ ఫండ్ కమిటీ, వేజ్ బోర్డు సిఫారసులను పర్యవేక్షించే త్రైపాక్షిక కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. చిన్న, మధ్యతరగతి పత్రికల బిల్లులు పెండింగులో ఉండటం, అప్‌గ్రేడేషన్ ప్రక్రియ జరగక పోవడంతో వాటి నిర్వాహకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునగనూరు గ్రామ శివారులో ఎల్‌బి నగర్ జర్నలిస్టులకు ఏడాదిన్నర క్రితం ఇంటి స్థలాలు కేటాయించగా, వారు ఇండ్లను సైతం నిర్మించుకున్నారని, అయితే ఆ స్థలాలను ఖాళీ చేయాలని గత కొన్ని రోజుల నుండి రెవెన్యూ అధికారులు లబ్దిదారులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారని, వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రిని కోరారు. టియుడబ్ల్యూజె విన్నవించిన సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి, త్వరలోనే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు కె.శ్రీకాంత్ రెడ్డి, జి. మధు గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ. రాజేష్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, రాష్ట్ర నాయకులు మాతంగి దాస్, హెచ్‌యుజె అధ్యక్షులు శిగా శంకర్ గౌడ్‌లు పాల్గొన్నారు.

## హైకోర్టులో 'ఆపరేషన్ అభ్యాస్'



మాక్‌డ్రిల్ నిర్వహించిన అగ్నిమాపక శాఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ అభ్యాస్ కార్యక్రమంలో భాగంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితిలో సందర్శకులను ఎలా రక్షించాలో అగ్నిమాపక సిబ్బంది కళ్లకు కట్టినట్లు చూపించారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలోమంటలను ఎలా ఆర్పాలో కూడా హైకోర్టు ఉద్యోగులకు స్వయంగా చేసి చూపించారు. పై అంతస్తులో చిక్కుకున్న బాధితలను రక్షించడం, వారిని చికిత్స నిమిత్తం హుటాహుటినా ఆసుపత్రులకు తరలించడం తదితర కార్యక్రమాలు చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమైన మాక్ డ్రిల్ మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. ఈ మాక్ డ్రిల్‌లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఎస్‌పిఎఫ్, పోలీసులు, వైద్య శాఖ, విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు రిజిస్ట్రార్ నిర్వహణ వి. రమేష్, హైకోర్టు ఎస్‌పిఎఫ్ కమాండెంట్ అన్వర్ పాషా, హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక అధికారి టి. వెంకన్న, అసిస్టెంట్ కమాండెంట్లు బాబు రెడ్డి, శ్రీనివాస్, హైకోర్టు అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక అధికారి, .వి.భాను ప్రతాప్ పాల్గొన్నారు. మాక్ డ్రిల్ నిర్వహించిన అధికారులు సిబ్బందిని ఫైర్ డిజి వై.నాగి రెడ్డి అభినందించారు.

## న్యూఢిల్లీ తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ సరిహద్దులో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, సరిహద్దు రాష్ట్రాలలో ప్రస్తుతం నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ వాసులకు సకాలంలో సహాయం, సమాచారం, సేవలను అందించే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. నిరంతరాయంగా సేవలను నిర్ధారించడానికి ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుంది. ఈ క్రింది నెంబర్లలో బాధితులు సంప్రదించాలని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ తెలిపారు.

ల్యాండ్‌లైన్: 01123380556
రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ లైజన్ హెడ్ వందన 9871999044
రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకుడు హైదర్ అలీ నఖ్వీ 9971387500
లైజన్ ఆఫీసర్ జి.రక్షిత్ నాయక్ 9643723157
పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సిహెచ్.చక్రవర్తి 9949351270.

**పుకార్లను నమ్మొద్దు .. డిజిపి జితేందర్**

భద్రతా సంబంధిత సమాచారం కోసం అధికారిక ప్రభుత్వ ప్రకటనలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని, ఇతర సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు కథనాలు, వీడియోలను నమ్మవద్దని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే అపోహలను విశ్వసించకుండా, అధికారిక వర్గాల సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. సందేహాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించినట్లయితే, సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

# యువజవాన్ వీరమరణం

ఐదుగురిని మట్టుబెట్టి నేలకొరిగిన సీమ సింహం



**అమరావతి :** కశ్మీర్ అంతర్జాతీయ సరిహద్దు రేఖలో కాల్పులకు తెగబడిన పాక్ సైనికులను భారత ఆర్మీ తిప్పికొడుతున్న తరుణంలో.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ యువజవాన్ వీరమరణం పొందాడు. ఐదుగురు శత్రువులను హతమార్చి మరీ ప్రాణం వదిలాడు. ఈ సమాచారంతో దేశవ్యాప్తంగా భారతీయులు విషాదంలో మునిగిపోయారు. జై జవాన్ అంటూ నినదించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రమూకల స్థావరాలను భారత సైన్యం మట్టుబెట్టిన స్థితిలో పాక్ సైన్యం ఉక్రోశంతో పూంచ్ జిల్లాలోని ఎల్‌ఓసీలో కాల్పులకు తెగబడింది. సుమారు 15 మంది పౌరులను పొట్టన పెట్టుకుంది. ఇక పాక్ సైనికులకు తగిన బుద్ది చెప్పటానికి భారత ఆర్మీ కూడా కాల్పులు చేపట్టింది. ఈ కాల్పుల్లో ఎఫ్టీ రెజిమెంట్ లాన్స్ నాయక్ దినేష్ కుమార్ నేలకొరిగారు. శుక్రవారం ఈ కాల్పులు కొనసాగాయి. ఈ కాల్పుల్లో శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజక వర్గం గోరంట్ల మండలానికి చెందిన కల్లి తండాకు చెందిన మురళి నాయక్ (25) వీరమరణం పొందారు. ఈ పరస్పర కాల్పుల్లో ఐదుగురు పాక్ ముష్కరులను చంపి మరీ మురళి నాయక్ వీరమరణం పొందినట్లు సమాచారం. సీనా నాయక్, జ్యోతిబాయ్‌లకు మురళి నాయక్ ఏకైక సంతానం. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు సోమందే పల్లె మండలం కేంద్రంలోని విజ్ఞాన్ స్కూల్లో చదువుకున్నాడు. 2022 అగ్నివీర్ ద్వారా ఆర్మీకి ఎంపికయ్యాడు. నాసిక్, పంజాబ్‌ల్లో పని చేశాడు. యుద్ధం కారణంగా జమ్మూ కశ్మీర్ కు బదిలీపై వెళ్లాడు. గురువారం భారత్‌పై పాక్ సైనికులు కాల్పులకు తెగబడ్డారు. పాక్ సైనికులను తిప్పికొట్టే ప్రయత్నంలో మురళి నాయక్ ప్రాణాలు కోల్పోయారు. యుద్ధంలో మురళి నాయక్ వీరమరణంతో గోరంట్ల లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రధానంగా గోరంట్ల మండల పరిధిలోని చుట్టుపక్కల తండావాసులు భారీగా మురళి నాయక్ తండ్రి శ్రీనివాస్ నాయక్, తల్లి జ్యోతి బాయ్‌లను పరామర్శించారు. ఈ సందర్భంగా తమ సొంత కుటుంబ సభ్యుడిని కోల్పోయినట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆయన మృతదేహాన్ని ఢిల్లీకి పంపించారు. శనివారం ఉదయం కల్లి తండాలో అంతిమ సంస్కారాలు నిర్వహించి .. అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలుకుతారు.

**మురళీనాయక్ మృతికి తెలంగాణ సిఎం సంతాపం**

జమ్మూకాశ్మీర్‌లో పాకిస్తాన్ కాల్పుల్లో తెలుగువాడు జవాన్ మురళీ నాయక్ వీరమరణం దిగ్భ్రాంతి కలిగించిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలియజేస్తూ.. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**ఎపి సిఎం.. మాజీ సిఎం సంతాపం**

భారత్ పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంలో భాగంగా గురువారం మురళి నాయక్ అనే ఆర్మీ జవాన్ (25) మృతి చెందడం పట్ల ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అదే విధంగా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం ఎపి రాష్ట్ర మంత్రి ఎస్.సవిత వీర జవాన్ స్వగ్రామం మురళి నాయక్ ఇంటిని సందర్శించి, చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అంతేకాకుండా తక్షణ సాయం కింద ఐదు లక్షలు చెక్కును అందజేశారు. ఇదే సందర్భంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో వీర జవాన్ తల్లిదండ్రులను ఫోన్లో మాట్లాడించారు. దీనికి ముందే మురళి నాయక్ స్వగృహాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉషశ్రీ చరణ్ సందర్శించి తల్లిదండ్రులు జ్యోతివాయి శ్రీనివాస్ నాయకులను పరామర్శించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో ఫోన్లో మాట్లాడించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ మీకు అండగా వైసీపీ ఉంటుందని త్వరలోనే మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని పరామర్శిస్తానని అన్నారు.

**రాష్ట్రానికే గర్వకారణం : మంత్రి లోకేష్**

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ కాశ్మీర్ యుద్ధ భూమిలో పోరాడుతూ మన రాష్ట్రానికి చెందిన మురళి నాయక్ వీరమరణం పొందడం నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. మురళీ నాయక్ పార్థివ దేహానికి రాష్ట్రప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తాం. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

## సైనికుల క్షేమాన్ని కోరుతూ.. ప్రత్యేక పూజలు

మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత గడ్డ మీద పర్యాటకులను చంపిన తీవ్రవాదులను ఏరివేత లక్ష్యంగా దేశ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ టార్గెట్ విజయవంతం అయ్యేందుకు మంత్రి కొండా సురేఖ దేవాదాయ శాఖకి కీలక ఆదేశాలు జారీ చేశారు. భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి దేవాలయంలో పూజలు చేయాలని మంత్రి కొండా సురేఖ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇంతటి సంక్లిష్టమైన సమయంలో భారత ఆర్మీకి మనమంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' రెండో దాడి విజయవంతం అవడం హర్షించదగ్గ విషయం అని కొండా సురేఖ తెలిపారు. భారతదేశం క్షేమంగా ఉండాలని కోరుకుంటూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించామని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్ తెలిపారు.

# హామీలు ఇచ్చి మాట తప్పారు




ముగ్గురు మంత్రులున్నా ఒరిగిందేమి లేదు

భద్రాచలానికి ఉప ఎన్నికలు... మిట్టపల్లి సభలో కెటిఆర్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి మాట తప్పిందని ప్రజలను మోసం చేసిందని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) కార్యనిర్వహక అధ్యక్షులు, మాజీ మంత్రి కేటి రామారావు ఆరోపించారు. 100 రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని ఊదరగొట్టే ఉపన్యాసాలు ఇచ్చారని ఇప్పుడు ధాన్యం కొనే పరిస్థితిలో కూడా ఈ ప్రభుత్వం లేదన్నారు. శుక్రవారం ఖమ్మంజిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ రాయల వెంకట శేషగిరి రావు కాంస్య విగ్రహాన్ని కెటిఆర్ ఆవిష్కరించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలతో కలిసి ప్రత్యేక హెలికాప్టర్‌లో మిట్టపల్లి చేరుకున్న కేటిఆర్‌కు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధు, మాజీ ఎంఎల్‌ఎలు సండ్ర వెంకటవీరయ్య, ఉపేందర్‌రెడ్డి, రేగా కాంతారావు, హరిప్రియా నాయక్, మెచ్చా నాగేశ్వరరావు తదితరులు ఘన స్వాగతం పలికారు. విగ్రహ అనంతరం జరిగిన బహిరంగ సభలో కెటిఆర్ మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో యుద్ధ వాతావరణ నేపథ్యంలో సభ జరుగుతుందన్నారు. రాయల వెంకటశేషగిరిరావు జీవితాంతం రైతుల సంక్షేమం కోసం కృషి చేశారని ఆయన తెలిపారు. ఖమ్మంజిల్లాకు ముగ్గురు మంత్రులున్న ఒరిగిందేమి లేదన్నారు. డిప్యూటీ సిఎంగా ఉన్న మల్లు భట్టివిక్రమార్క దేవుని వద్ద అఫిడవిట్ పెట్టి పూజలు చేసి మాట తప్పారని కెటిఆర్ ఆరోపించారు. కేసిఆర్ కిట్ లేకుండా చేశారు. రుణ మాఫీ, తులం బంగారం ఇస్తామని ఇవ్వలేదు. అనేక ఇబ్బందులకోర్చి బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ జెండాను గుండెల్లో పెట్టుకుని గెలిపించాలన్నారు. భద్రాచలానికి ఉప ఎన్నిక తప్పదని ఉప ఎన్నికల్లో పార్టీని గెలిపించి తీరాలన్నారు. ఢిల్లీ వెళితే దొంగల్లా చూస్తున్నారని సిఎం అంటున్నారని మరి దొంగను దొంగలా చూడకపోతే ఎలా చూస్తారని ఆయన ప్రశ్నించారు. సభలో బిఆర్ఎస్ నాయకులు పువ్వాడ అజయ్‌కుమార్, వద్దిరాజు రవిచంద్ర, తాతా మధుసూదన్, సండ్ర వెంకటవీరయ్య తదితరులు ప్రసంగించగా మాజీ ఎంఎల్‌ఎలు కొండబాల కోటేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, బానోత్ మదన్‌లాల్, తాటి వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, హరిప్రియా నాయక్, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం నాయకులు పాల్గొన్నారు.

# 38 మంది మావోయిస్టుల లొంగుబాటు



జనజీవనస్రవంతిలోకి రండి... పునరావాసం కల్పిస్తాం: ఎస్పి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన 8 మంది మహిళలతో సహా 38 మంది మావోయిస్టులు శుక్రవారం ఎస్పి రోహిత్‌రాజ్ ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు ఆయన వారిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఎస్పి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 81,141 బెటాలియన్ అధికారులు నిర్వహిస్తున్న ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా లొంగిపోయినట్లు ఆయన చెప్పారు. వీరంతా మావోయిస్టు పార్టీలో వివిధ క్యాడర్లలో పని చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టులకు కల్పిస్తున్న సౌకర్యాలను తెలుసుకుని ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోయారన్నారు. జనజీవన స్రవంతిలో కలిసే వారికి ప్రభుత్వం తరుపు అందాల్సిన అన్ని రకాలు సదుపాయాలు, సౌకర్యాలు అందిస్తామని అన్నారు. మావోయిస్టు పార్టీపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని, అమాయక ఆదివాసీలను అడ్డుపెట్టుకుని మావోయిస్టులు అరాచకాలకు పాల్పడుతున్నారని, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. మావోయిస్టు పార్టీ దుశ్చర్యలతో కొందరు ఆదివాసీలు భయభ్రాంతులకు గురవుతున్నారని, అమాయకులను ఇన్‌ఫార్మర్ల పేరుతో అతి కిరాతకంగా హతమారుస్తున్నారని ఎస్పి చెప్పారు. దీనిని గమనించిన వారు ప్రశాంత జీవనం కోసం లొంగిపోయేందుకు మొగ్గు చూపుతున్నట్లు ఎస్పి తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 265 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు చెప్పారు. కుటుంబ సభ్యుల సూచనలు, సలహాల మేరకు లొంగిపోతే పునరావాసం కల్పించి ప్రభుత్వం తరపున ఆదుకుంటామని ఎస్పి స్పష్టం చేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-20, ఎస్ఎల్‌పి జోన్, జిహెచ్ఎంసి.

NIT No.08/EE/CIR-20/SLPZ/GHMC/1/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ తేది: 09.05.2025

**పని రకం:** ఇతర పని. **అంచనా విలువ :** రూ.15.20లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ మరియు సమయం :** 09.05.2025న సా.04.30గం.ల నుండి, 12.05.2025న ఉ.11.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఇఇ, సిఐఆర్-20, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9154834248.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-20, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 1667-PP/CL/ADVT/1/2025-26, Date: 09-05-2025

hmda **హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్

బహిరంగ ప్రకటన U/s 15 (4) హెచ్ఎండిఎ చట్టం 2008
(G.O.Ms.No. 96 MA & UD విభాగం, తేదీ 06.05.2025)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్ 2008 (యాక్ట్ నెం.8 ఆఫ్ 2008) లోని సెక్షన్ 15 లోని సబ్-సెక్షన్ (1) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, ప్రభుత్వం G.O.Ms.No. 538 MA&UD, తేది: 29.10.2001 ద్వారా ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ CDA మాస్టర్ ప్లాన్ ప్రకారం ఊహించిన భూ వినియోగానికి ప్రభుత్వం ఇందుమూలంగా ఈ క్రింది మార్పును చేస్తున్నది, ఆ సెక్షన్ యొక్క సబ్-సెక్షన్ (1) ప్రకారం అవసరం.
రంగారెడ్డి (D), శేరిలింగంపల్లి (M), ఖాజాగూడ(V) వద్ద ఉన్న సర్వే నెం.28/P లోని సైట్. ఎ.3-00 వరకు, మేడ్చల్ GST కమిషనరేట్, సెంట్రల్ ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ & సర్వీస్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా ప్రాతినిధ్యం వహించే భారత రాష్ట్రపతికి చెందినది, ఇది ప్రస్తుతం G.O.Ms.No. 538 MA&UD, తేది: 29.10.2001 ద్వారా ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ CDA మాస్టర్ ప్లాన్ ప్రకారం నివాస వినియోగ జోన్‌గా గుర్తించబడింది, ఇప్పుడు వాణిజ్య ఉపయోగంగా గుర్తించబడింది.
పైన పేర్కొన్న వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (ఆర్ఆర్) హెచ్ఎండిఎ.

DIPR R.O. No. : 1662-PP/CL/ADVT/1/2025-26, Date: 09-05-2025

ప్రజాపక్షం
శనివారం, మే 10

# సంయమనం — సంఘీభావం

మన దేశం ప్రస్తుతం పాకిస్థాన్‌తో అప్రకటిత యుద్ధంలో ఉంది. ఈ అనూహ్య పరిణామాన్ని పాకిస్థాన్ తాను పెంచిపోషిస్తున్న టెర్రరిస్టుల ద్వారా మన దేశంపై విధించింది. పహల్గాంలో అమాయక టూరిస్టులపై టెర్రరిస్టు ముష్కరులు పాశవిక హత్యాకాండకు పాల్పడి ఉండకపోతే భారత్ 'ప్రతిస్పందన చర్య' ఉత్పన్నమై ఉండేది కాదు. పాకిస్థాన్ నాయకులు తమ దేశం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పుడల్లా భారత్‌తో ఘర్షణను పురికొల్పి దాన్ని బూచిగా చూపి తన మిత్ర దేశాలనుంచి ద్రవ్యసహాయం, రుణాలు పొందటానికి అలవాటుపడ్డారు. ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్‌లు పలుమార్లు బెయిలౌట్ ప్రకటించాయి. ప్రస్తుతం పాకిస్థాన్‌లో రాజకీయ అస్థిరత నెలకొని ఉంది; ఆర్థిక వనరుల కొరతలో చిక్కుకుంది. ప్రపంచబ్యాంక్ రుణంకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ఈ స్థితిలో భారత్‌తో సంఘర్షణకు దిగటం వ్యూహాత్మకం కావచ్చు; భారత సైన్యం ఇంత తీవ్రంగా ప్రతీకారానికి దిగుతుందని ఊహించి ఉండకపోవచ్చు. ఈ స్థితికి మూలం పాకిస్థాన్ భూభాగంలో ప్రభుత్వం, సైన్యం అండదండలతో కొనసాగుతున్న విషపూరిత మతోన్మాద టెర్రరిస్టు స్థావరాలు. టెర్రరిస్టులు మన జమ్ము—కశ్మీర్‌లో దొంగచాటుగా చొరబడి సాగిస్తున్న హింసాకాండ, మిలిటెంట్‌ల రిక్రూట్‌మెంట్. పాకిస్థాన్ టెర్రరిజానికి అడ్డా అని యావత్ ప్రపంచానికీ తెలుసు. అమెరికా వారి కోసం, వారి ఆర్థిక, ఆయుధ సహాయంతో దశాబ్దాలపాటు టెర్రరిస్టు శిక్షణా కేంద్రాలు నిర్వహించింది. అమెరికా డబ్బును దుర్వినియోగం చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌నుండి అమెరికా సైన్యాలు మూడేళ్లనాడు నిష్క్రమించిన తర్వాత కూడా తాలిబాన్‌లపై పైచేయికి పాకిస్థాన్ టెర్రరిస్టులను ఉపయోగించి గట్టి ఎదురుదెబ్బలు తిన్నది. ఇరవై ఏళ్లకుపైగా సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ భారత్‌లో దఫదఫాలుగా దారుణమైన హింసకు అది హేతువైంది. టెర్రరిస్టులు తమ భూభాగాన్ని ఉపయోగించుకునేందుకు అనుమతించబోమని పాకిస్థాన్ అంతర్జాతీయ సమాజానికిచ్చిన హామీని ఎందుకు నెరవేర్చలేదని అమెరికా సహా దాన్ని మిత్రరాజ్యాలు ఇవాళ నిలదీయాలి. ఆ దేశాల నేతలు టెర్రరిజాన్ని ఖండిస్తూ, భారత్—పాకిస్థాన్‌ల మధ్య సమరం కూడదని, ఇరుదేశాలు సంయమనం పాటించాలని, చర్చల ద్వారా శాంతియుత వాతావరణం నెలకొల్పుకోవాలని హితవు చెబుతున్నాయి.

పహల్గాం ఘోరావమానానికి భారత ప్రభుత్వ ప్రతిస్పందన పాకిస్థాన్ భూభాగంలోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని టెర్రరిస్టు స్థావరాలపై క్షిపణి దాడులకే పరిమితం కావటం గమనార్హం. పాకిస్థాన్ సైనిక, పౌర వసతులపై గురిపెట్టలేదు. కాగా గురువారం రాత్రి పాకిస్థాన్ సైన్యం భారత్ భూభాగంలోని సైనిక స్థావరాలను, ఒక గురుద్వారాను లక్ష్యం చేసుకోవటం సిగ్గుచేటు. ఇది యుద్ధాన్ని విస్తరించే దుర్మార్గపు ఎత్తుగడ. భారత్ నౌకాదళం, వాయుసేన ఆ దాడిని తిప్పికొట్టింది. 300—400 డ్రోన్‌లను గగనతలంలోనే ధ్వంసం చేసి బుద్ధి చెప్పాయి. ఇదే సమయంలో పాక్ రేంజర్లు కశ్మీర్‌లోని వాస్తవాధీనరేఖ వెంట, అంతర్జాతీయ సరిహద్దు వెంట ఉన్న రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో పౌరుల నివాస ప్రాంతాలపై విచ్చలవిడిగా మందుగుండ్లు ప్రయోగిస్తూ ఆస్తుల నష్టానికి, ప్రాణహానికి కారణమవుతున్నారు. భారత భద్రతాదళాలు విజయవంతంగా తిప్పికొడుతున్నాయి. భారత్ డ్రోన్‌లు పాకిస్థాన్ లోపలికల్లా వెళ్లి బాంబులతో ప్రతీకార దాడులు చేశాయి.

రెండు ఇరుగుపొరుగు దేశాల మధ్య యుద్ధ మేఘాలు అలముకుని పరస్పర దాడులు జరుగుతున్నప్పుడు ఆయా ప్రభుత్వ ఏజన్సీలు అధికారికంగా వెల్లడించే సమాచారాన్నే సంబంధిత దేశంలోని మీడియా సంస్థలు ప్రసారం చేసి తీరాలి. అది వాటి దేశభక్తికి, నిబద్ధతకు, రక్షణ నిబంధనల పాటింపునకు నిదర్శనం. అయితే పోటీ ప్రపంచంలో అసత్యాల ప్రచారంలో పోటీపడుతున్న ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో కొన్ని టివి తెరలపై యుద్ధ విమానాలు పరుగెత్తిస్తున్నాయి. కొన్ని కొద్దిరోజుల్లో పాకిస్థాన్ తుడిచిపెట్టుకపోతుందంటూ మన సైనిక కదలికల గూర్చి గొంతెత్తి అరుస్తున్నాయి. ఇక సోషల్ మీడియా హద్దులేనితనం సరేసరి. ఈ విషయాల్లో మీడియా సంస్థలు సంయమనం పాటించాలని, అధికారిక బ్రీఫింగ్‌లకే, ఆ ప్రతినిధులు విడుదల చేసే చిత్రాలకే పరిమితం కావాలని రక్షణశాఖ సున్నితంగా హెచ్చరించింది. మీడియా అత్యుత్సాహ ప్రసారాలు సైన్యానికి హాని చేస్తాయని మందలించింది. దేశంలో భిన్న రాజకీయ భావాలకు చెందిన అన్ని పార్టీలు, సంస్థలు, ప్రభుత్వాలు మన సైన్యానికి సంఘీభావం తెలియజేస్తూ కొండంత అండగా ఉన్నాయి. ఈ సంఘీభావంలో మినహాయింపులు, అనవసరపు ప్రేలాపనలకు తావులేదు.

కొసమెరుపు : భారతసైన్యం ఎదురుదాడిలో ఎస్.400 రక్షణ వ్యవస్థ కొనియాడబడుతున్నది. రష్యానుంచి దీని కొనుగోలుకు అమెరికా అభ్యంతరం చెప్పింది, ఆంక్షలు విధిస్తామని హెచ్చరించింది. అయినా భారత రక్షణాధికారుల ముందుచూపు నిర్ణయం నేడు మేలు చేస్తున్నది.

# వైజ్ఞానిక పరిశోధనలకు దారిచూపిన బుద్ధుడు


డాక్టర్ దేవరాజు మహారాజు

బుద్ధుడు చెప్పిన విషయాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందికి, ఎన్నో రకాలుగా స్ఫూర్తి నిచ్చాయి. బుద్ధుడి స్ఫూర్తితోనే ఎంతోమంది తాత్త్వికులయ్యారు. కవులు, రచయితలయ్యారు. రాజకీయ నాయకులయ్యారు. విప్లవ వీరులయ్యారు. సిద్ధాంత కర్తలయ్యారు. మేధావులయ్యారు. వీరు మాత్రమే కాకుండా బుద్ధుడు చెప్పిన ఒక సిద్ధాంతంతో చాలామంది శాస్త్రవేత్తలయ్యారు. పరిశోధకులయ్యారు. ఆయన చెప్పిన అనేక విషయాలలో ఈ ఒక్క సిద్ధాంతం విశ్వవ్యాప్తంగా ప్రభావం చూపింది. అదేమంటే – 'కార్య కారణ సిద్ధాంతం!' ఆ ఒక్క మాటతో ఆయన వైజ్ఞానికులకే వైజ్ఞానికుడయ్యాడు. ఏ కార్యం జరిగినా, దాని వెనక ఒక కారణం ఉంటుంది. ఆ కారణాన్ని అన్వేషించి, అర్థం చేసుకుంటే దాన్ని నివారించడానికి మార్గాలు వెతుక్కోవచ్చు అన్నది బుద్ధుడి కార్యకారణ సిద్ధాంతం! ఎక్కడ ఏ ప్రగతీ లేని రోజుల్లో, మానవ మేధస్సు వికసించని దశలో, బుద్ధుడు సుమారు రెండున్నర వేల ఏళ్ళ క్రితం ఆ విషయం చెప్పడం మామూలు విషయం కాదు. ఈ రోజు వైజ్ఞానిక ప్రపంచమంతా ఈ సూత్రం చుట్టే తిరుగుతూ ఉండడం మనం గమనించొచ్చు.

బుద్ధుడు ఏం చెప్పాడు? ప్రపంచంలో దుఃఖం ఉంది. దానికి కారణముంది. కారణముంది కాబట్టి, నివారణ ఉంది. నివారణ ఉంది కాబట్టి అందుకు మార్గాలున్నాయి అన్నాడు. దీనిమీద ఆధారపడి కారల్ మార్క్స్ మరో సిద్ధాంతం చెప్పాడు. ఆయన ప్రపంచంలోని పేదరికాన్ని, అణచివేతను, అసమానతను గుర్తించాడు. ఆ విషయాన్నే తన సిద్ధాంతంగా చెప్పాడు. ప్రపంచంలో పేదరికం ఉంది. పేదరికం ఉంది కాబట్టి అసమానత, అణచివేత ఉన్నాయి. పేదరికానికి కారణాలు తెలుసుకుంటేనే, ఆ కారణాలకు నివారణలు తెలుసుకోవచ్చు. ఆ నివారణకు దారులే సమసమాజ స్థాపన— క్రాంతి—విప్లవం అని వివరించాడు మార్క్స్! లోతుగా తరచి చూస్తే, మార్క్సిజం, బుద్ధిజం పునాదులపైనే నిర్మాణమైందని అనిపిస్తుంది.

నేటి ఆధునిక వైద్యశాస్త్రమైనా ఏం చెబుతుంది? ప్రపంచంలో రోగాలున్నాయి. రోగాలున్నాయి కాబట్టి ఆరోగ్య సమస్యలున్నాయి. అవి ఉండడానికి కారణాలున్నాయి. ఆ కారణాలు బాక్టీరియా, వైరస్‌లే కావచ్చు. వారసత్వ లక్షణాలే కావొచ్చు. మరింకేదైనా కావచ్చు. కారణాలేవైనా అందుకు నివారణలున్నాయి. ఆ నివారణలకు వేర్వేరు దారులున్నాయి. ఆ దారులేమిటీ? చికిత్స, థెరపీ, ఆపరేషన్ వగైరా ఏదైనా కావొచ్చు. ఒక్క వైద్య శాస్త్రమే కాదు, ఇతర అన్ని శాస్త్రాలు ఆ ఒక్క 'కార్య కారణ సిద్ధాంతం'లోంచి వెలువడ్డవే. ఉదాహరణకు తొలిరోజుల్లో మనిషి చేపను చూశాడు. చేప నీటిలో ఈదడం చూశాడు. అది ఎలా తేలగలుగుతోందో, ఎలా ఈద గలుగుతోందో వాటికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకున్నాడు. కాలక్రమంలో నీటిపై తేలుతూ ప్రయాణించగల పడవకు, ఓడకు, స్టీమర్‌కు రూపకల్పన చేసుకున్నాడు. అలాగే మనిషి పక్షిని గమనించాడు. అది రెక్కలాడిస్తూ, గాలి ఒత్తిడితో పైకి లేవగలగడం అధ్యయనం చేశాడు. దాని వెనకగల కార్యకారణ సంబంధాన్ని అర్థం చేసుకుని విమానాల్ని తయారు చేసుకున్నాడు. గద్ద ఆకాశంలో ఎగురుతూ కింద భూమిమీద గల చిన్న కోడి పిల్లను ఎలా చూడగలుగుతోందో పరిశీలించి, లెన్స్‌ల్ని ఆవిష్కరించుకున్నాడు. దూరపు చూపు దగ్గరి చూపుకు తగిన కటకాల్ని తయారు చేసుకున్నాడు. ఆవిరి ఎంత బలమైందో జేమ్స్ వ్యాట్ గ్రహించగలిగాడు కాబట్టి — ఆవిరియంత్రానికీ ఇంజన్‌కు, రైలుకు ఆవిష్కరణలు జరిగాయి. ప్రతి కార్యానికీ కారణ ముంటుందన్న విషయం గ్రహించిన శాస్త్రవేత్తలంతా తమ తమ రంగాలలో పరిశోధనలు కొనసాగించారు. నూతన ఆవిష్కరణలతో విశ్వమానవాళికి మేలు చేస్తూ వచ్చారు. ఈ విషయంలో శాస్త్రవేత్తలంతా బుద్ధుని అనుచరులే!

కార్యకారణ సిద్ధాంతం 16వ శతాబ్దంలో యూరోప్‌కు చేరినప్పుడు, అక్కడ బేకన్, న్యూటన్, కెప్లర్, గెలీలియో వంటి మహా శాస్త్రవేత్తలంతా తయారయ్యారు. ఈ రకంగా చెప్పాలంటే భారతదేశం 'విశ్వ గురువు' ఎప్పుడో అయిపోయింది. కాస్త, చదువూ, జ్ఞానం, విజ్ఞత ఉన్న వారికి ఈ విషయం తెలుస్తుంది. అది లేనివారే ఇప్పుడీ దేశాన్ని కొత్తగా 'విశ్వగురువు'గా నిలబెడతామని బయలుదేరుతున్నారు. అది వారి అజ్ఞానాన్ని బయటపెడుతుంది. భారతదేశం ప్రపంచానికి ఏమిచ్చిందీ అంటే బుద్ధుణ్ణి ఇచ్చింది. బుద్ధుడు ప్రపంచానికి ఏమిచ్చాడంటే కార్యకారణ సిద్ధాంతాన్నిచ్చాడు. ఎక్కడ ఏ ఆధారాలూ లేని రోజుల్లో ఏ పరిశీలనలు, ఏ పరిశోధనలూ జరగని రోజుల్లో బుద్ధుడు ఆ సిద్ధాంతాన్ని ఇచ్చాడంటే మాటలా? ఆయనకు జ్ఞానోదయమైందంటే ఇదే ప్రపంచానికి ఆయన జ్ఞానాన్నిచ్చాడంటే ఇదే! ఆ ఒక్క సిద్ధాంతం మీదే అన్నీ ఆధారపడి ఉన్నప్పుడు, వైజ్ఞానిక పరిశోధనలన్నీ ఇప్పటికీ ఒక్క సిద్ధాంతంమీదే ఆధారపడి జరుగుతున్నప్పుడు ఇన్ని శతాబ్దాల తర్వాత మనం ఆయనను ఏ స్థాయిలో నిలుపుకోవాలీ? అందుకే ప్రజలు ఆయనను 'భగవాన్' అన్నారు. భగవా అని అంటే పరిపూర్ణుడు అని అర్థం!



బుద్ధుడు చెప్పిన విషయాలేవీ మిగలకపోయినా, ఈ ఏక వాక్య సిద్ధాంతం మిగిలినా, ఆయన బుద్ధుడిగానే మిగిలి ఉండేవాడు. ఎందుకంటే ఈ ఒక్క ఆలోచనే ప్రపంచ గతిని మార్చింది. ఎన్నో వైజ్ఞానిక సిద్ధాంతాలకు ఇది మూలం అయ్యింది. బీజమైంది. మాతృక అయ్యింది. జీవితానికి సంబంధించి బుద్ధుడు ఎన్నో విలువైన విషయాలు చెప్పాడు. అవన్నీ మానవ ప్రవృత్తికి, సమాజగతికి సంబంధించినవి. ఈ కార్యకారణ సిద్ధాంతం మాత్రం ప్రగతికి, పురోగతికి, అభ్యున్నతికి, విప్లవానికి సంబంధించింది. శతాబ్దాలు గడుస్తున్నా ఆ సిద్ధాంతం ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ అన్వయించుకునే విధంగా ఉంటూనే ఉంది. తరం తర్వాత తరంలో ఇది మనిషిని ఆధునికుణ్ణి చేస్తూనే ఉంది. అది నిత్యనూతనం! బుద్ధుణ్ణి ఒక సామాజిక కార్యకర్తగా, సంఘసంస్కర్తగా, తాత్వికుడిగా ముఖ్యంగా మార్గదర్శిగా చూడకుండా ఆయనను దేవుళ్ళలో కలపడం, ఆయనకు మతాన్ని పులమడం — ఆలోచనలేని కొందరు చేసిన పిచ్చి పని. పరిపూర్ణుడు గనకనే శతాబ్దాలకు ముందే ఆనాటి ప్రజలు ఆయనను భగవాన్‌గా పూజించారు. శతాబ్దాల తర్వాత ఈనాడు కూడా అధునిక ఆలోచనాపరులు ఆయన మేధోశక్తికి అబ్బురపడి ఆరాధిస్తున్నారు. ఆ స్ఫూర్తిని నిలుపుకుని, వచ్చే తరాలకు అందించాలనుకుంటున్నారు. పూజ — అంటే అదే. పూలు, కుంకుమ జల్లి, గంటలు మోగించి, అర్థంలేని, అర్థం కాని సంస్కృత శ్లోకాలు అరవడం పూజకాదు. అది దారితప్పిన మనువాదుల పైత్యం! వారి దృష్టిలో భగవాన్ అంటే అస్థిత్వం లేనివాడు. కేవలం విశ్వాసంలో తిష్టవేసిన వాడు మాత్రమే! వీరి దేవుడు మనిషి బుర్రలో పుట్టి, మనిషినే బానిసగా లేదా మూర్ఖుడిగా చేసిన వారు మాత్రమే!

పదిహేడవ శతాబ్దంలో బుద్ధుడి కార్యకారణ సిద్ధాంతం అందుబాటులోకి వచ్చిన తర్వాతనే యూరోప్‌లో వైజ్ఞానిక విప్లవం వచ్చింది. అంతకుముందు అక్కడ ఏదైనా జరిగిందంటే దానికి కారణం ధార్మిక, ఆధ్యాత్మిక, దైవ కారణాల్ని వెతుక్కునే వారు. ఇది అప్పటి వారి రచనల్లో దొరికిన అంశమే. బుద్ధుడు తన బోధనల్ని నాటి ప్రజల భాష అయిన పాలిభాషలో బోధించాడు. అందువల్ల అతడి బోధనలతో పాటు ఆ పాలి భాష ప్రభావం ఇతర దేశాలమీద కూడా పడింది. ఉదాహరణకు కొన్ని ముఖ్యమైన పదాలు చూద్దాం. ధ్యానాన్ని పాలి భాషలో 'ఝాన్' అంటారు. దాన్ని మన భారతదేశంలో వైదిక మతస్థులు ధ్యానంగా మార్చారు. ఇదే పదం చైనాకు పోయి 'చాన్' అయ్యింది. అక్కడ 'చాన్' సంప్రదాయం ఏర్పడింది. అలాగే పాలి భాషలోని ఝాన్ పదం జపాన్‌లో జేన్ అయ్యింది. అది పాటించే 'జేన్' సంప్రదాయం అక్కడ వర్ధిల్లింది. ఇదే ఝాన్ కొరియాలో 'సార్ జాన్' అయ్యింది. వియత్నాంలో 'థియాన్' అయ్యింది. ఇలా వేరు వేరు దేశాల్లో ఆ పదం వేరువేరుగా వ్యాపించింది. ఇంతెందుకూ? మనం మన ఊళ్ళ పేర్లలో సామాన్యంగా 'పల్లి' అని ఉండడం చూస్తుంటాం. అది పాలి భాషలోంచి వచ్చిందే. ఇరాండ్ పల్లి అనే ఊరు అశోకుడి శాసనాలలో కూడా కనిపించింది. పల్లి అంటే పాలి భాషలో నగరం అని అర్థం. పర్షియా రాజధాని పర్సిపోలస్‌లో పోలిస్ అంటే నగరం అనే అర్థం ఉంది. ఇవన్నీ బుద్ధుడి బోధనలతో పాటు వేర్వేరు భాషల్లోకి ప్రవేశించిన పదాలు. అందుకే మూలాల్లోకి వెళ్ళాలి.

డాక్టర్ రామ్ విలాస్ శర్మ వృత్తిరీత్యా ఇంగ్లీషు ప్రొఫెసర్. భాషా శాస్త్రజ్ఞుడు కూడా. బౌద్ధమతాభిమాని అయినందువల్ల ఆ విషయాలలో విస్తృతంగా పరిశోధనలు చేశారు. పాలి భాషా పదాలు వివిధ దేశాలకు ఎలా ప్రయాణించాయన్న విషయం ఆయన చాలా వివరంగా రాశారు. థెరపీ/థియరీ వంటి పదాల గురించి కూడా ఆయన వివరణ ఇచ్చారు. తార్కిక విశ్లేషణలతో లభించేది 'థేర్' అని పాలి భాషలో బౌద్ధం చెపుతుంది. ఆస్థా (నమ్మకం—విశ్వాసం) నుండి వేదాలు వచ్చినట్లుగా తార్కిక దృక్పథంతో 'థేర్' వచ్చింది. థేర అంటే పెద్దవారు. అన్నీ తెలిసిన విజ్ఞుడు అని అర్థం. (థేరవాదం బౌద్ధంలో ముఖ్యమైన శాఖ) వైజ్ఞానికరంగంలో ఏ సాంకేతిక పదం కనిపించినా దాని మూలం ఇటాలియన్, లాటిన్, గ్రీకు అని చెపుతుంటారు కదా? చాలాకాలానికి ముందు ఈ 'థేర్' అనుయాయులే ఈజిప్టులో 'థేరాపుటి' అని పిలవబడేవారు. వీరు చికిత్సకులు. వీరి వల్లనే థెరపీ/థియరీ వంటి పదాలు విశ్వవ్యాప్తమయ్యాయి.

వైదిక మతస్థులు సృష్టించుకున్న ముప్పయి మూడు కోట్ల దేవీ దేవతల్లో ఏ ఒక్కరూ సజీవంగా పుట్టి మనిషికి దిశా నిర్దేశం చేసిన వారు లేరు. ఇతర మతాలలో కూడా అదే పరిస్థితి అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మత గురువులు ఉన్నారే గానీ, అసలు 'దైవం' వంటి వారు ఎవరూ లేరు. కనీసం ఏదో ఓ కాలంలో ఉండి అంతరించి పోయారన్న ఆధారాలు కూడా లేవు. ఈ తేడాను గమనించి అర్థం చేసుకోగల స్థోమత గల వారికి మాత్రమే విషయం అర్థమవుతుంది. ఏదో ఒక మత విశ్వాసంలో బలంగా పాతుకుపోయిన వారికి బహుశా ఈ విషయాలు నచ్చకపోవచ్చు. అబద్ధాల్లో సుఖాల్ని వెతుక్కునే వారికి నిజాలు ఇబ్బందిగానే ఉంటాయి.

సుప్రసిద్ధ సాహితీ వేత్త, జీవ శాస్త్రవేత్త


# జన్యు సవరణాధారిత వరి వంగడాల అభివృద్ధి

ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఒక చారిత్రాత్మక ప్రకటన చేస్తూ మొట్టమొదటిసారిగా జన్యు సవరణ ద్వారా వరి వంగడాలైన 'కమల' (డిఆర్‌ఆర్ ధాన్ 100), 'పూసా డీఎస్టీ రైస్ 1' లను మన దేశం విజయవంతంగా అభివృద్ధి చేసిందని ప్రకటించారు. జన్యు సవరణ మొక్క సొంత జన్యువులను 'ఎడిట్' చేసే పద్ధతిగా భవిష్యత్ వ్యవసాయ సవాళ్లను ఎదుర్కోవడంలో ఒక కొత్త ఆశ ఇచ్చే మార్గంగా కనిపిస్తోంది. ఈ సాంకేతికత సరైన నియంత్రణలు, పారదర్శకతతో ఉపయోగించడం ద్వారా భారతీయ వరి సాగులో గణనీయ పురోగతి సాధ్యమవుతుంది. ఈ వంగడాలను మే 2025లో అధికారికంగా విడుదల చేశారు. ఇవి పరిశోధనా దశ నుండి క్షేత్రస్థాయి సాగుకు రావడానికి కొంత సమయం పడుతుంది. రైతుల కోసం నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, విస్తృత పంపిణీ ప్రక్రియలు పూర్తి కావాల్సి ఉంది. దీనికి సుమారు రెండు నుండి నాలుగు సంవత్సరాలు పట్టవచ్చని అంచనా.

ఈ నూతన వంగడాల అభివృద్ధిలో భారతీయ వ్యవసా య పరిశోధనా మండలి (ఐసిఎఆర్) ఆధ్వర్యంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్, హైదరాబాద్; ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, న్యూఢిల్లీ శాస్త్రవేత్తలు కీలక పాత్ర పోషించారు. ఆధునిక జన్యు సవరణ పద్ధతులైన క్రిస్పర్‌కాస్ ఆధారిత టెక్నాలజీని ఉపయోగించి వీటిని రూపొందించారు. ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన అంశం ఏమిటంటే ఇవి గతంలో చర్చకు వచ్చిన జన్యుమార్పిడి (జియం)పంటల కోవలోకి రావు. జన్యుమార్పిడి లో బయటి జీవుల నుండి జన్యువులను చేర్చడం జరుగుతుంది. కానీ జన్యు సవరణలో వరి మొక్క సొంత జన్యువుల లోనే నిర్దిష్ట, ఖచ్చితమైన మార్పులు చేస్తారు. బయటి నుండి అదనపు డిఎన్ఎను చేర్చరు. ఈ తేడా సాంకేతికంగానే కాకుండా, నియంత్రణపరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సాంకేతికతలో రెండు ముఖ్య పద్ధతులున్నాయి. అవి 'జన్యుమార్పిడి (జన్యుపరంగా మార్పు చెందినది)', 'జన్యు సవరణ'. ఈ రెండు పద్ధతుల మధ్య ప్రాథమిక తేడాలను చూద్దాం.

**జన్యుమార్పిడి వరి:** జన్యుమార్పిడి ప్రక్రియలో ఒక జీవి (వరి మొక్క అనుకుందాం) లోపలి జన్యువులలోకి మరొక పూర్తిగా భిన్న జీవి నుండి తీసుకున్న జన్యువులను ప్రవేశపెడతారు. బ్యాక్టీరియా, వైరస్ లేదా వేరే మొక్కల నుండి వేరుచేసిన జన్యువులను వరి మొక్క లోపలి జన్యు పదార్థం లోపలికి శాశ్వతంగా కలిసిపోయేలా చేస్తారు. ఈ బయటి నుండి చేర్చబడిన జన్యువుల ద్వారా వరి లోపల కొత్త లక్షణాలు పుడతాయి. లేదా ఉన్న లక్షణాలు బాగా మారతాయి. ఉదాహరణకు, పురుగులకు నిరోధకత కలిగించడానికి, లేదా పోషక విలువలు పెంచడానికి బయటి జన్యువులను చేర్చవచ్చు. ఈ ప్రక్రియలో వరి మొక్క లోపలి జన్యు పదార్థంలోకి 'అన్యజీ జన్యు పదార్థం' చేరుతుంది.

**జన్యు సవరణ వరి:** జన్యు సవరణ అనేది జన్యు సాంకేతికత లోపలి ఒక కొత్త విధానం. ఇది ఒక మొక్క సొంత జన్యువుల లోనే అత్యంత ఖచ్చితమైన, నిర్దిష్టమైన మార్పులు చేసే పద్ధతి. క్రిస్పర్‌కాస్9 వంటి అధునాతన జన్యు సవరణ సాధనాలను ఉపయోగించి డీఎన్ఏ లోని కావలసిన నిర్దిష్ట భాగాలను కత్తిరించడం, తొలగించడం లేదా స్వల్ప మార్పులు చేయడం జరుగుతుంది. ఇది ప్రకృతిలో సహజంగా జరిగే ఉత్పరివర్తనాల మాదిరిగానే ఉంటుంది. కానీ ప్రయోగశాలలో అత్యంత నియంత్రిత, ఖచ్చితమైన పద్ధతిలో జరుగుతుంది. ఈ పద్ధతిలో బయటి నుండి ఎలాంటి అదనపు జన్యువులను వరి మొక్క లోపలికి పంపరు. బదులుగా, ఆధునిక జన్యు సవరణ సాధనాలను ఉపయోగించి వరి మొక్క సొంత జన్యు పదార్థం లోపలి నిర్దిష్ట, ఖచ్చిత భాగాలను కత్తిరించడం, తీసివేయడం, లేదా స్వల్ప మార్పు లు చేయడం చేస్తారు. ఈ మార్పులు ప్రకృతిలో సహజంగా జరిగే ఉత్పరివర్తనాల మాదిరిగానే ఉంటాయి. కానీ అవి చాలా నిర్దిష్టంగా, నియంత్రిత పద్ధతిలో జరుగుతాయి. లక్ష్యం ఏటంటే, బయటి జన్యువులను చేర్చకుండానే వరి లోపలి కావలసిన లక్షణాలు (ఉదాహరణకు, ఎక్కువ దిగుబడి, కరువును తట్టుకునే శక్తి, తెగుళ్ళ నిరోధకత) తీసుకురావడం.




**వీటిని అభివృద్ధి చేసింది వీరే ! :** 'కమల (డిఆర్‌ఆర్ ధాన్ 100)' వంగడాన్ని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) ఆధ్వర్యంలోని భారతీయ వరి పరిశోధ నా సంస్థ (ఐఐఆర్‌ఆర్), హైదరాబాద్‌లోని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది తెలుగు రాష్ట్రాలతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో రైతులు, వినియోగదారులు బాగా ఇష్టపడే సాంబ మసూరి (బిపిటి 5204) వరి రకం నుండి జన్యు సవరణ ద్వారా మెరుగుపరచబడింది. ఇక 'పూసా డిఎస్‌టి రైస్ 1 వంగడాన్ని 'ఐకార్ ఆధ్వర్యంలోని భారతీ య వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఎఆర్ఐ), న్యూఢిల్లీ లోని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీనికి మూలం ఎంటియు 1010 (కాటన్ దొరా సన్నాలు) అనే మరో ప్రసి ద్ధ సన్న గింజల వరి రకం. ఈ రెండు వంగడాలను క్రిస్పర్‌కాస్ ఆధారిత ఎస్‌డిఎన్1 అనే నిర్దిష్ట జన్యుసవరణ పద్ధతిని ఉపయోగించి అభివృద్ధి చేశారు.

**కమల, పూసా డిఎస్‌టి రైస్ 1 ప్రత్యేకతలు:** విడుదలైన రెండు వంగడాల్లో 'కమల' వంగడాన్ని రైతులు బాగా ఇష్టపడే సాంబ మసూరి రకం నుండి అభివృద్ధి చేశారు. కమల వంగడం దాని మూలరకం సాంబ మసూరి కంటే దాదాపు 19% అధిక దిగుబడినిచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీని ప్రధాన ప్రయోజనం ఏమిటంటే, సాధారణంగా 145—150 రోజులు పట్టే సాంబమసూరితో పోలిస్తే, కమల కేవలం సుమారు 130 రోజుల్లోనే అంటే 15—20 రోజులు ముందుగానే కోతకు వస్తుంది (పక్వానికి రావడం). ఈ తక్కువ కాలవ్యవధి వల్ల సాగునీటి వినియోగం గణనీయంగా తగ్గి నీటిని ఆదా చేయవచ్చు. ఇది కరువు పరిస్థితులను కూడా తట్టుకునే శక్తిని కలిగి ఉంది. అధిక నత్రజని వినియోగ సామర్థ్యం కలిగి ఉండటం వల్ల ఎరువుల వాడకం తగ్గించవచ్చు. దీని కాండం గట్టిగా ఉండి పంట పడిపోకుండా (పడిపోవడం) తట్టుకుంటుంది. తక్కువ కాల వ్యవధి పర్యావరణానికి మేలు చేస్తూ మీథేన్ వంటి హరితగృహ వాయువుల ఉద్గారాలను తగ్గిస్తుంది. వరి నాణ్యత విషయంలో, ఇది సాంబ మసూరి యొక్క మంచి గింజ, వంట నాణ్యతను నిలుపుకుంది. ఇక పూసా డిఎస్‌టి రైస్ 1 వంగడం కరువుతో పాటు నేలలోని అధిక లవణీయతను (ఉప్పదనం) సమర్థవంతంగా తట్టుకోగల లక్షణాన్ని కలిగి ఉంది. డిఎస్‌టి జన్యువును సవరించడం ద్వారా ఈ లక్షణా న్ని సాధించారు. దీనిని కరువు ప్రభావిత ప్రాంతాలు, లవణీయత కలిగిన నేలలు లేదా తీర ప్రాంతాలకు అనుకూలం గా అభివృద్ధి చేశారు. ఒత్తిడితో కూడిన (లవణీయత, కరువు) పరిస్థితుల్లో సాగు చేసినప్పుడు ఇది మూల వంగడం ఎంటియు 1010 కంటే గణనీయంగా ఎక్కువ దిగుబడినిచ్చింది (దాదాపు9.66% నుండి30.4%వరకు). ఈ వంగడం కూడా ఎంటియు 1010 యొక్క సన్న గింజల నాణ్యతను కలిగిఉంది.

ఈ రెండు వంగడాలు తక్కువ ఎరువులతో పెరిగే సామర్థ్యం, తక్కువ కాలవ్యవధి వల్ల మీథేన్ వంటి హరితగృహ వాయువుల ఉద్గారాల తగ్గింపు వంటి పర్యావరణ ప్రయోజనాలను కలిగి ఉన్నాయి.

అధిక దిగుబడి రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. కరువు, లవణీయత వంటి వాతావరణ సవాళ్లను తట్టుకునే వంగడాలు పంట నష్టాన్ని తగ్గించి, రైతాంగానికి భరోసాను ఇస్తాయి. నీటి వినియోగం తగ్గడం, పర్యావరణ హితమైన సాగు పద్ధతులు భవిష్యత్ తరాలకు వనరులను సంరక్షించడంలో సహాయపడతాయి. పెరుగుతున్న జనాభాకు ఆహారం అందించడానికి, దిగుబడిని పెంచడం తప్పనిసరి. కేంద్రమంత్రి పేర్కొన్నట్లుగా, ఇది భారత్‌లో 'రెండవ హరిత విప్లవానికి' నాంది పలకవచ్చు.

**సవాళ్లు – పరిష్కారాలు:** జన్యు సవరణ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు, సాధారణ ప్రజలలో పూర్తి అవగాహన లేకపోవడం, జన్యుమార్పిడి పంటలపై ఉన్న అపోహలు దీనిపై కూడా ప్రభావం చూపవచ్చు. వీటి భద్రతపై శాస్త్రీయ ఆధారాలతో కూడిన సమాచారాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత. ప్రయోగశాల, పరిశోధనా క్షేత్రాల్లో చూపి న అద్భుతమైన ఫలితాలు రైతుల పొలాల్లో కూడా అదే స్థాయిలో రావాలంటే సరైన సాగు పద్ధతులను అనుసరించాలి. దీనిపై రైతులకు శిక్షణ అవసరం. నాణ్యమైన, ప్రమాణీకరించిన విత్తనాలను సకాలంలో సరైన ధరలకు రైతులందరికీ అందుబాటులో ఉంచడం మరో సవాలు. ఈ కొత్త వంగడాల విస్తృత సాగు వల్ల స్థానిక, సంప్రదాయ వరి రకాల జీవ వైవిధ్యం ప్రభావితం కావచ్చనే ఆందోళనలు ఉన్నాయి. ఈ సవాళ్లను అధిగమించడానికి, ఈ కొత్త శాస్త్రీయ ఆధారిత సమాచారాన్ని సరళమైన భాషలో రైతులకు, ప్రజా సంఘాలకు, వినియోగదారులకు అందించి అవగాహన కల్పించాలి.

జనక మోహన రావు దుంగ
8247045230

# ఇంటర్ ఆర్ట్స్ విభాగంలో హెచ్‌సిఇసి కోర్సు ప్రవేశ పెట్టాలి

తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్మీడియట్ విద్యను సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా చేయడంతోపాటు ఇంటర్ విద్యా వ్యవస్థను పర్యవేక్షిస్తుంది. ఈ బోర్డు ఆధ్వర్యంలో దాదాపు 436 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 1500 ప్రైవేటు జూనియర్ కళాశాలలతోపాటు వందలా ది బిసి, సోషల్, మైనార్టీ వెల్ఫేర్ కళాశాలలు, కెజివిబి కళాశాల లు, మోడల్ జూనియర్ కళాశాలలు నడుస్తున్నవి. ఈ కళాశాల ల్లో సైన్స్, ఆర్ట్స్, ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులలో ప్రవేశాలపరంగా చూసినట్లయితే సైన్స్ (ఎంపిసి, బైపిసి) గ్రూపులలో, ఒకేషనల్ గ్రూపులలో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరుతున్నారు. కానీ ఆర్ట్స్ (హెచ్.ఇ.సి, సి.ఇ.సి.) గ్రూపులలో గత కొంతకాలంగా విద్యార్థులు తక్కువ సంఖ్యలో చేరుతున్నారు. వీటిలో ముఖ్యంగా ప్రభుత్వ జూనియ ర్ కళాశాలల్లో మాత్రమే అందించే హెచ్‌ఇసి గ్రూపులో రోజు రోజుకు ప్రవేశాలు తగ్గడం వలన చరిత్ర సబ్జెక్టు పూర్తిగా నిర్లక్ష్యానికి గురై కనుమరుగయ్యే అవకాశం లేకపోలేదు. ఈ క్రమం లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆర్ట్స్ గ్రూపులను బలోపే తం చేయాలంటే ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు పలు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించేలా కొత్త కోర్సులు ప్రవేశపెట్టవలసిన అవసరం ఉందని ఆర్ట్స్ అధ్యాపకులు, విద్యావేత్తలు, మేధావులు సూచిస్తున్నారు. దీనికి పరిష్కారంగా చరిత్ర, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ అనే సబ్జెక్టులతో కూడిన హెచ్‌సిఇసి అనే నూతన సమీకృత కోర్సును ప్రవేశపెట్టవలసిన అవసరం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు ప్రజా ప్రభుత్వం ను వేడుకుంటున్నారు.

**ఆర్ట్స్ గ్రూపులకు తగ్గిన ప్రాధాన్యత**


ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో సైన్స్ గ్రూపులకు అధిక డిమాండ్ ఉండడం వలన ఆర్ట్స్ గ్రూపులలో ప్రవేశాలు తగ్గిపోతున్నవి. కొన్ని దశాబ్దాలుగా ఆర్ట్స్ కోర్సులు మూస ధోరణిలోనే కొనసాగడం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు కార్పొరేట్ కళాశాలల మాయలో పడడం, గత ప్రభుత్వం ప్రారంభించిన పలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ల్లో, అప్‌గ్రేడ్ చేసిన జూనియర్ కళాశాలలో ఆర్ట్స్ గ్రూపులను ప్రవేశక పెట్టకపోవడం, గత ప్రభుత్వం ఆర్ట్స్ గ్రూపుల పట్ల, సామాజిక శాస్త్రాల పట్ల చిన్నచూపు చూపడం వంటి పలు కారణాల వలన ఆర్ట్స్ గ్రూపులలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్ట్స్ గ్రూపుకు ప్రాధాన్యత తగ్గుతుంది అని చెప్పవచ్చు.

వైద్య, ఇంజనీరింగ్, ఐటి రంగాల్లో అధిక ఉద్యోగ అవకాశాలు వలన విద్యార్థులు ఎక్కువగా సైన్స్ గ్రూపుల పట్ల ఆసక్తి చూపుతున్నారు. అలాగే పారిశ్రామికరంగంతో పాటు వివిధ ఉపాధి రంగాలలో తక్షణ ఉద్యోగ అవకాశాలు లభించడం వలన ఒకేషనల్ కోర్సులతోపాటు సైన్సు గ్రూపులకు ఆదరణ పెరుగుతుంది.

**ఆర్ట్స్ గ్రూపులపై ఆసక్తి పెంచాలి**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న హెచ్‌ఈసి, సిఈసి. వంటి ఆర్ట్స్ గ్రూపులు ఉద్యోగ అవకాశాలపరంగా పరిమిత అవకాశా లు కల్పించడం, కొన్ని దశాబ్దాల నుండి ఈ ఆర్ట్స్ గ్రూపులలో ఎలాంటి మార్పులు చేయకపోవడం, ఈ గ్రూపులోని అంశాలు పోటీ పరీక్షలకు సరిగ్గా సరిపోవడం లేదని భావన ఉండడం వంటి పలు కారణాల వల్ల ఆర్ట్స్ గ్రూపులపై విద్యార్థులకు ఆసక్తి తగ్గుతుందని పలువురు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విడుదల అయిన ఇంటర్ వార్షిక ఫలితాలను గమనిస్తే ఆర్ట్స్ విభాగంలో విద్యార్థుల ఫలితాలు కూడ నిరాశపరిచాయి. దీన్నిబట్టి విద్యార్థులు ప్రస్తుత ఆర్ట్స్ గ్రూపులపై సరైన ఆసక్తి చూపడం లేదని భావించవచ్చు.

ఇంటర్ విద్యలో ఆర్ట్స్ గ్రూపుల పట్ల విద్యార్థులకు ఆసక్తి పెంచుటకు, ఆర్ట్స్ విద్యను బలోపేతం చేయుటకు హెచ్ సిఇసి (హిస్టరీ, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులతో) అనే నూత న సమీకృత గ్రూపు ప్రవేశపెట్టవలిసిన అవసరం ఉంది. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో



అడ్మిషన్ సంఖ్య విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. సైన్స్ గ్రూపులో ఆరు సబ్జెక్టులు ఉన్నట్లే ఆర్ట్స్ గ్రూపులో కూడా ఆరు సబ్జెక్టులు ఉండడం వలన విద్యార్థులకు సమాన న్యాయం జరుగుతుంది. అలాగే సైన్స్ విద్యార్థుల మాదిరిగానే ఆర్ట్స్ విద్యార్థులకు కూడా పరీక్ష విధానంలో, పరీక్ష సమయంలో సమాన న్యాయం జరుగుతుంది. నూతన కోర్సు వలన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉపా ధి అవకాశాలు మెండుగా ఉంటాయి. ప్రభుత్వం నిర్వహించే సివిల్స్, గ్రూప్1, గ్రూప్2 వంటి ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ వంటి సబ్జెక్టు లు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటాయి. ప్రైవేట్ రంగాలలో బ్యాంకింగ్, ఫైనాన్స్, అకౌంటింగ్ వంటి ఉద్యోగ అవకాశాలు పొందుటకు కామర్స్, ఎకనామిక్స్ వంటి పాఠ్యాంశాలు ఉపకరిస్తాయి. ఈ కొత్త కోర్సు ప్రవేశ పెట్టడం వలన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ సంఖ్య పెరగడంతో పాటు ఆర్ట్స్ గ్రూపులకు పునర్ వైభవం తప్పకుండ వస్తుంది. ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి భారం పడకుండా ఈ నూతన కోర్సు అమలు చేయవచ్చు.

ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో చరిత్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యలో చరిత్ర సబ్జెక్టు ఆవశ్యకతను ఒకవైపు ప్రచారం చేస్తూ విద్యార్థుల, తల్లిదండ్రుల దృక్పథాన్ని మార్చుటకు కృషి చేస్తున్నారు. మరోవైపు ఇంటర్ విద్యలో నూతనంగా హెచ్‌సిఈసి. అనే గ్రూపు ఏర్పాటు చేయాలని ఉన్నత అధికారులకు విన్నపాలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులతో పాటు ప్రముఖ చరిత్రకారులు, వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు భాగస్వామ్యం కావడం వలన నూతన హెచ్‌సిఇసి. కోర్స్ ఏర్పాటుకు డిమాండ్ పెంచడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు.

డా. పోతరవేణి తిరుపతి
9963117456




# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## చొరబాటు యత్నం భగ్నం

### ఏడుగురు ఉగ్రవాదులను హతమార్చిన బిఎస్ఎఫ్

**న్యూఢిల్లీ/జమ్ము:** జమ్ముకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను బిఎస్ఎఫ్ తిప్పికొట్టింది. ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకొంటున్న నేపథ్యంలో ఈ పరిణామాలు జరగడం గమనార్హం. మే 8వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో సాంబ జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దుల వద్ద ఈ పరిణామాలు చోటుచేసుకొన్నట్లు బిఎస్ఎఫ్ ఎక్స్ పోస్టులో వెల్లడించింది. కనీసం ఏడుగురు ఉగ్రవాదులు మృతి చెందినట్లు బిఎస్ఎఫ్ వర్గాలు వెల్లడించాయి. దీంతోపాటు పాక్‌కు చెందిన ధన్‌బార్‌లోని పోస్టును మన దళాలు ధ్వంసం చేశాయి. చాలామంది ప్రజలు ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఇళ్లు ఖాళీ చేసి వెళుతున్నారు పాక్‌తో సరిహద్దు పంచుకొంటున్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉన్నాయి. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్ల మేరకు ఉన్న పాక్ సరిహద్దును సీల్ చేశారు. ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే.. కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక భారత వాయుసేన కూడా పూర్తి అప్రమత్తంగా ఉంది.



## త్రివిధ దళాలతో రాజ్‌నాథ్ భేటీ

**న్యూఢిల్లీ :** భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునే పాకిస్థాన్ దాడి నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం జాతీయ భద్రతా పరిస్థితిపై అత్యున్నత సైనిక నాయకత్వంతో సమగ్రంగా సమీక్షించారు. భద్రతకు సంబంధించిన పతి అంశాన్ని చర్చించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి, రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. జమ్ము, పఠాన్‌కోట్, ఉధంపూర్, కొన్ని ఇతర ప్రదేశాలలోని సైనిక స్థావరాలను క్షిపణులు, డ్రోన్లతో ధ్వంసం చేసేందుకు పాకిస్థాన్ సైన్యం చేసిన ప్రయత్నాన్ని భారత్ తిప్పికొట్టింది. పశ్చిమ సరిహద్దులో భద్రతా పరిస్థితి, భారత సాయుధ దళాల కార్యాచరణ సంసిద్ధతను సమీక్షించడానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. పాకిస్థాన్ ప్రయత్నాలు గురువారం రాత్రి విఫలమైన తర్వాత, భారత్ తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి, ప్రజలకు భద్రతను కల్పించేందుకు పూర్తిగా సిద్ధంగా ఉందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులను భారత సాయుధ దళాలు సమర్థవంతంగా ఎదుర్కొన్నాయని, శత్రువుల ప్రయత్నాలను తిప్పికొట్టాయని భారత సైనిక అధికారులు తెలిపారు.

## భద్రతపై అమిత్ షా సమీక్ష



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌తో భారత్–పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. పాక్ రెచ్చగొట్టే చర్యలకు దీటుగా బదులిచ్చేందుకు కేంద్రం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అన్ని అత్యవసర వ్యవస్థల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఈ క్రమంలో వరుస భేటీలు జరుగుతున్నాయి. తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ బిఎస్ఎఫ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సిఐఎస్ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లో, విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ కూడా హాజరయ్యారు. కేంద్రమంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది.

# పాక్ చర్యకు భారత్ దీటైన స్పందన

## డ్రోన్‌ల కూల్చివేత

**న్యూఢిల్లీ :** పశ్చిమ సరిహద్దు వెంబడి గురువారం–శుక్రవారం మధ్య రాత్రి పాకిస్థాన్ సాయుధ దళాలు డ్రోన్లు ఇతర మందుగుండు సామగ్రిని ఉపయోగించి దాడులకు దిగాయి. అయితే వీటిని 'సమర్థవంతంగా తిప్పికొట్టినట్లు భారత సైన్యం తెలిపింది. జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ దళాలు అనేకసార్లు కాల్పుల విరమణ ఉల్లంఘనలకు పాల్పడ్డాయని భారత సైన్యం శుక్రవారం తెల్లవారుజామున ఎక్స్‌లో పోస్ట్ చేసింది. పాక్ దుర్మార్గపు కుట్రలకు దీటుగా ప్రతిస్పందిస్తామని పేర్కొంటూ ఒక చిన్న వీడియో క్లిప్‌ను కూడా భారత సైన్యం షేర్ చేసిం ది. భారత సైన్యం దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడటానికి కట్టుబడి ఉందని, అన్ని దుష్ట కుట్రలకు దీటుగా బదులిస్తున్నామని తెలిపింది. శుక్రవారం తెల్లవారుజామున కూడా జమ్ముకశ్మీర్‌లోని పూంచ్, రాజౌరి జిల్లాల్లోని ఫార్వార్డ్ ప్రాంతాల్లో పాకిస్థాన్ షెల్లింగ్‌లతో దాడులు చేసింది. ఈ దాడులు ఆర్మీ బలగాలు తిప్పికొట్టాయి. పాక్ జరిపిన దాడుల్లో ఓ గ్రామస్థుడు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. తెల్లవారు జామున 3:50 నుండి 4:45 గంటల మధ్య జరిగిన భారీ పేలుళ్ల కారణంగా వెంటనే బ్లాక్ అవుట్, సైరన్‌ల మోత మోగించినట్లు అధికారులు తెలిపారు. జమ్ము ప్రాంతంలోని డ్రోన్‌లు, ఇతర ఎగిరే వస్తువులను వైమానిక రక్షణ వ్యవస్థ ద్వారా తటస్థీకరించబడిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. రాత్రిపూట కశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా జిల్లాలతో పాటు రాజౌరి, పూంచ్, జమ్ము జిల్లాల్లోని పలు ప్రాంతాలపై కాల్పులు, షెల్లింగ్‌లతో దాడులు జరిగాయి. పూంచ్ జిల్లాలోని లోరాన్, మెంధార్ సెక్టార్‌లలోని వివిధ ప్రాంతాలలో పాకిస్తాన్ జరిపిన కాల్పు ల్లో ఒకరు మరణించగా, అతని భార్యతో సహా ముగ్గురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో గణనీయంగా ఆస్తి నష్టం వాటిల్లిందని, అనేక ఇళ్ళు, వందలాది వాహనాలు దెబ్బతిన్నాయన్నారు. గాయపడిన వారిలో మెంధార్‌లోని చలేరీ ప్రాంతానికి చెందిన లయాకత్ హుస్సేన్ కూడా ఉన్నారు. జమ్ము ప్రాంతంలో పాకిస్థాన్ దాడుల ఫలితంగా తలెత్తిన పరిస్థితి నేపథ్యంలో ఈ ప్రాంతంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు మూసివేశారు. జమ్ముతో పాటు పూంచ్, రాజౌరి జిల్లాల్లోని ఎల్ఓసి వెంబడి ఉన్న ప్రాంతాల నుండి అనేక మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, వారిలో చాలా మందిని శిబిరాల్లో ఉంచామని అధికారులు తెలిపారు.



### 138 విమానాలు రద్దు

ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చే, వెళ్లే 138 విమానాలను వివిధ విమానయాన సంస్థలు రద్దు చేశాయని శుక్రవారం వర్గాలు తె లిపాయి. భారత్–పాకిస్థాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నే పథ్యంలో విమానాశ్రయాలలో భద్రతా చర్యలు పెంచారు. గ త నెలలో కనీసం 26 మందిని బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా బుధవారం పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద లక్ష్యాలపై సాయుధ దళాలు దాడులు చే సిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశంలోని వివిధ ప్రాం తాలలోని దాదాపు 27 విమానాశ్రయాలను మూసివేశారు. దీంతో అనేక విమానాలు రద్దయ్యాయి. శుక్రవారం ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల మధ్య మొత్తం దేశంలో వివిధ ప్రాంతాలకు వెళ్లే 66 విమానాలు, వచ్చేవి అలాగే 5 అంతర్జాతీయంగా వెళ్లే 5, వచ్చే 4 వి మానాలు రద్దు చేశారు. అయితే ఢిల్లీ విమానాశ్రయం కార్యకలాపాలను యధావిధంగా కొనసాగించింది. అయితే, మారుతున్న గగనతల పరిస్థితులు, పెరిగిన భద్రతా చర్యల కారణం గా, కొన్ని విమాన షెడ్యూల్‌లు, భద్రతా ప్రాసెసింగ్ సమయా లు ప్రభావితం కావచ్చు అని డిఐఎఎల్ శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

### భారత్–నేపాల్ సరిహద్దుల్లో ముమ్మరంగా పెట్రోలింగ్

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్–పాకిస్తాన్ మధ్య సైనిక దాడి నేపథ్యంలో ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌గఢ్, చంపావత్ జిల్లాల్లోని భారత–నేపాల్ సరిహద్దులో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు. ఎస్ఎస్‌బి సహకారంతో పెట్రోలింగ్ బృందాల సంఖ్యను పెంచామని, జిల్లాలోని భారత్–నేపాల్ సరిహద్దులోని ప్రధాన వంతెనలపై ప్రవేశ పాయింట్ల వద్ద తనిఖీలను ముమ్మరం చేయాలని ఖోరినట్లు పిథోప్‌గఢ్ ఎస్‌పి రేఖ యాదవ్ శుక్రవారం తెలిపారు. పోలీసులు, సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి) బృందాలు ధార్చుల, జౌల్జిబి, బలువాకోట్, ఝూలాఘాట్, అస్కోట్ సరిహద్దు ప్రాంతాలలో క్రమం తప్పకుండా గస్తీ తిరుగుతున్నాయని ఆమె చెప్పారు. నైని సైని విమానాశ్రయంలో కూడా మేము నిఘాను పెంచామని, ఎక్కువ మంది భద్రతా సిబ్బందిని మోహరించి, ప్రాంగణంలోకి ప్రవేశించే వ్యక్తులను కఠినంగా తనిఖీ చేస్తున్నామని యాదవ్ చెప్పారు. నేపాల్ సరిహద్దులో ఉన్న మరొక ఉత్తరాఖండ్ జిల్లా చంపావత్ నుండి అందిన సమాచారం ప్రకారం అన్ని పోలీసు పోస్టులను అప్రమత్తంగా ఉంచారు. నేపాల్‌కు లేదా నేపాల్ నుండి భారతదేశానికి ప్రయాణించడానికి ఎటువంటి పరిమితి లేనప్పటికీ, సరిహద్దులోని ఎంట్రీ పాయింట్ల వద్ద తనిఖీలను ముమ్మరం చేశారు అని చంపావత్ ఎస్‌పి అజయ్ గణపతి అన్నారు. నేపాల్ సరిహద్దు దాటి నుండి అనుమానిత వ్యక్తులు ప్రవేశించకుండా నిరోధించడానికి సరిహద్దు పోస్టులపై తీవ్రమైన తనిఖీ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే సరిహద్దు నుండి ఎలాంటి ప్రవేశం ఇండో నేపాల్ సరిహద్దు మేలాఘాట్ పోస్ట్‌లోని ఎస్ఎస్‌బి కమాండింగ్ ఆఫీసర్ మనోజ్ కుమార్ అన్నారు.

### పొలంలో క్షిపణి భాగాలు

భారత్–పాకిస్థాన్ మధ్య సైనిక ఘర్షణల నేపథ్యంలో పంజాబ్ హోషియార్‌పూర్‌లోని ఒక పొలంలో క్షిపణి భాగాలను పోలిన శిథిలాలను గుర్తించారు. బతిందాలోని రెండు ప్రదేశాలలో కొన్ని గుర్తుతెలియని లోహపు వస్తువుల భాగాలు కూడా కొనుగొన్నట్లు అధికారులు తెలిపారు. బతిండాలోని కొంతమంది గ్రామస్తులు గురువారం రాత్రి ఆకాశంలో పెద్ద పేలుళ్ల శబ్దాలు రావడం విన్నారని, లైట్లు మెరుస్తున్నట్లు చూశారని కూడా పేర్కొన్నారు. అయితే ఈ దృశ్యాలు ఆ ప్రాంతంలో భయాందోళనలను రేకెత్తించింది. హోషియార్‌పూర్‌లో గురువారం సాయంత్రం క్షిపణి భాగాలను పోలిన లోహ శిథిలాలు కనుగొనట్లు ఎస్‌పి (దర్యాప్తు) ముఖేష్ కుమార్ తెలిపారు. బతిండాలో శుక్రవారం తుంగ్వాలి గ్రామంలోని ఒక పొలంలో గుర్తుతెలియని వస్తువు శిథిలాలు గుర్తించారు. 'కొన్ని వస్తువులు (గురువారం రాత్రి) మైదానంలో పడ్డాయి. తరువాత పెద్ద పేలుడు సంభవించింది. ఇది సమీపంలోని ఇంటి కిటికీలు, తలుపులు, పశువుల కొట్టాన్ని ధ్వంసం చేసింది' అని ఒక గ్రామస్తుడు చెప్పాడు. లోహపు వస్తువులు మైదానంలో పడిన తర్వాత మూడు అడుగుల లోతైన గొయ్యి ఏర్పడిందని మరొక గ్రామస్తుడు చెప్పాడు. ఈ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నామని, ఘటనలో ఎవరూ గాయపడలేదని ఒక పోలీసు అధికారి తెలిపారు. నేలపై పడి ఉన్న లోహపు శిథిలాలను తాకవద్దని స్థానిక ప్రజలను పోలీసులు హెచ్చరించారు. బతిండాలోని బుర్జ్ మహిమా గ్రామంలోని ఒక పొలంలో కూడా లోహపు భాగాలను కనుగొన్నారు. పఠాన్‌కోట్ జిల్లాలో షెల్‌ను పోలిన లోహపు వస్తువును కూడా గుర్తించిట్లు అధికారులు తెలిపారు.

### అంబాలాలోని వైమానిక దళ స్థావరం బ్లాక్ అవుట్

భారత్–పాకిస్తాన్ మధ్య సైనిక వివాదం నేపథ్యంలో హర్యానాలోని అంబాలాలో కీలక వైమానిక దళ స్థావరాన్ని రాత్రి వేళల్లో బ్లాక్‌అవుట్ చేయనున్నట్లు జిల్లా యంత్రాంగం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, ప్రజా భద్రత, వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడటానికి రాత్రి వేళల్లో పూర్తిగా బ్లాక్‌అవుట్ చేయడం అత్యవసరం' అని డిప్యూటీ కమిషనర్ అజయ్ సింగ్ టోమర్ జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇన్వర్టర్, జనరేటర్, బహిరంగ లైట్లు, బిల్‌బోర్డ్‌లు, వీధి దీపాలు మొదలైన వాటికి ఉపయోగించే ఏదైనా ఇతర పవర్ బ్యాకప్‌ను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అంబాలా జిల్లాలో రాత్రి 8 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు నిషేధించినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. అన్ని తలుపులు, కిటికీలు పూర్తిగా మందపాటి కర్టెన్లతో కప్పబడి, లైట్లు బయటకు రాకుండా చూసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితి, సమయాభావం దృష్ట్యా, ఈ ఉత్తర్వును ఏకపక్షంగా జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వును ఉల్లంఘించినందుకు దోషిగా తేలిన ఏ వ్యక్తినైనా బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 223 కింద చట్టం ప్రకారం విచారించి శిక్షించబడతారన్నారు.

# పాకిస్థాన్‌పై ఉరిమిన 'ఆకాశ్' క్షిపణి



**న్యూఢిల్లీ :** ఎల్ఓసీ వెంబడి కొద్ది రోజులుగా క వ్వింపు చర్యలకు పాల్పడుతున్న దాయాది దేశం పాకిస్థాన్‌కు భారత్ చుక్కలు చూపిస్తోంది. తమ అమ్ములపొదిలోని ఆయుధాలతో చెక్ పెడుతోం ది. డ్రోన్స్‌తో చేస్తున్న దాడులను సమర్థవంతంగా తిప్పికొడుతోంది. అయితే వాటిలో ఆకాశ్ క్షిపణి వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. పాక్ డ్రోన్లను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తా గించినంత పని చేస్తుంది మన మేడ్ ఇన్ ఇండియా ఆకాశ్ క్షిపణి వ్యవస్థ.

#### ఆకాశ్‌ను సమర్థవంతంగా ఉపయోగించిన భారత్

ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణి వాయు రక్షణ వ్యవస్థ ఆకాశ్ పాక్ డ్రోన్ దాడులను అడ్డుకోవడంలో కీలకంగా నిలిచిందని రక్షణ శాఖ అధికారులు తాజాగా తెలిపారు. 'భారత లక్ష్యాలపై పాకిస్థాన్ చేసే డ్రోన్స్ దాడులను తిప్పికొట్టడంలో ఆకాశ్ గగనతల క్షిపణి వ్యవస్థను భారత సాయుధ దళాలు సమర్థవంతంగా ఉపయోగిస్తున్నాయి. భారత సైన్యం, వాయుసేన రెండు కూడా పాక్ సరిహద్దు వెంబడి ఆ క్షిపణి వ్యవస్థను కలిగి ఉన్నాయి' అని రక్షణ శాఖ అధికారులు చెప్పారు.

#### పెద్ద ఎత్తున ఆకాశ్ మిసైల్స్ మోహరింపు

దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించి, శత్రువుల ప్రయత్నాలను విఫలం చేసేందుకు ఆకాశ్ క్షిపణి వ్యవస్థ నిరంతరం సన్నద్ధంగా ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఆకాశ్ మిస్సైల్స్‌ను సమస్యాత్మక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మోహరించినట్లు చెప్పాయి. వాటితో భారత సైన్యం 50కి పైగా పాకిస్థాన్ డ్రోన్‌లను కూల్చివేసిందని వెల్లడించాయి. అయితే ఆకాశ్ క్షిపణి ఒకేసారి ఒకటికి మించి దూసుకొచ్చే మిస్సైళ్లు గానీ, డ్రోన్లను గానీ నేలకూల్చగలుగుతుంది. రియల్ టైమ్ మల్టీ సెన్సార్డ్ డేటా ప్రాసెసింగ్, దాడి తీవ్రతను అంచనా వేయగలదు. ఏ దిశ నుంచి దాడులు సంభవించినా ఒకేసారి ఛేదించగలదు. డ్రోన్లను చిత్తుచేయడంలో ఆకాశ్ వందశాతం స్ట్రైక్ రేట్ అందుకునే అవకాశాలు ఉన్నాయి.

#### ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఒక మైలురాయి

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, భూమి మీద నుంచి నేరుగా బహుళ లక్ష్యాలను మీడియం రేంజ్‌లో ఛేదించగలదు. రియల్ టైమ్ దాడులను కూడా వెంటనే గుర్తించి ప్రత్యర్థి ఎత్తులను ఆకాశ్ మిస్సైల్ సమర్థవంతంగా తిప్పికొట్టే సత్తా కలిగి ఉంది. అయితే ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే కాకుండా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఒక మైలురాయిగా నిలుస్తోంది.

## దేశంలో ఇంధన కొరత లేదు

### ఆందోళన వద్దు: చమురు కంపెనీలు



**న్యూఢిల్లీ :** దేశంలో ఎలాంటి ఇంధన కొరత లేదని భారతీయ చమురు కంపెనీలు తెలిపాయి. దీని గురించి జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చాయి. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ఎల్‌పిజి నిల్వలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నాయి. ప్రజలు భయపడి ముందుగా కొనుగోలు చేయడం లేదా నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని చమురు కంపెనీలు స్పష్టం చేశాయి. శుక్రవారం ఈ మేరకు ప్రజలకు హామీ ఇచ్చాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) వేర్వేరు ప్రకటనలు జారీ చేశాయి. తగినంత స్టాక్ లభ్యతపై హామీ ఇచ్చాయి. కాగా, భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో ఇంధనం కొరత ఏర్పడుతుందన్న ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద క్యూలు పెరుగుతున్నాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో భారతీయ చమురు కంపెనీలైన ఐఒసి, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ స్పందించాయి. భయాందోళన చెందాల్సిన అవసరం లేదని దేశ ప్రజలకు భరోసా ఇచ్చాయి. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ నిల్వలు దేశంలో పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నాయి. పెట్రోల్ బంకుల వద్ద అనవసరమైన రద్దీని నివారించాలని, మెరుగైన సేవలందించడంలో సహకరించాలని చమురు సంస్థలు కోరాయి.

## అత్యవసర పరికరాలు పూర్తి కొనుగోలు అధికారం

### 1968 సివిల్ డిఫెన్స్ చట్టంలోని రూల్ 11 వినియోగించుకోండి

### అన్ని రాష్ట్రాల సిఎస్‌లకు కేంద్ర హోం శాఖ లేఖలు



**న్యూఢిల్లీ :** భారత్ – పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర హోం శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్రం హోం శాఖ లేఖలు రాసింది. 1968 సివిల్ డిఫెన్స్ చట్టంలోని రూల్ 11 వినియోగించుకోవాలని లేఖలో పేర్కొంది. అయితే రూల్ 11 ప్రకారం సైరన్ వంటి అత్యవసర పరికరాలు కొనేందుకు పూర్తి అధికారం ఇస్తున్నట్లు ప్రకటించింది. ఇక అవసరమైతే అత్యవసర అధికారులు ఉపయోగించుకోవాలని కేంద్ర హోం శాఖ వెల్లడించింది. అయితే భారత్‌లోని సరిహద్దు నగరాల్లో పాకిస్తాన్ దాడి చేస్తుందనే ముందస్తు సమాచారంతో ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో ప్రజలను అలర్ట్ చేయడానికి సైరన్‌లను ఉపయోగిస్తుంది భారత సైన్యం. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వాలు అలర్ట్‌గా ఉండి పౌరుల భద్రతకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉండాలని కేంద్రం సూచనలు చేసింది.


## సజావుగా బ్యాంక్ సేవలు




న్యూఢిల్లీ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు ఇంకా అనేక ఇతర ప్రముఖ బ్యాంకులు..తమ ఎటిఎంలు పూర్తి నగదు నిల్వలతో సంపూర్ణంగా పనిచేస్తున్నాయని, డిజిటల్ సేవలు సజావుగా పనిచేస్తున్నాయని తెలిపాయి. భారత్, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య రానున్న రోజుల్లో ఎటిఎంలు మూతపడే అవకాశం ఉందని సోషల్ మీడియాలో వచ్చిన అసంబద్ధ వార్తల నేపథ్యంలో బ్యాంకులు పై ప్రకటనను తెలిపాయి. బ్యాంకులకు సంబంధించి అన్ని ఎటిఎంలు, సిడిఎంలు/ఎడిడబ్ల్యుఎంలు, అన్ని డిజిటల్ సేవలు సంపూర్ణంగా పనిచేస్తున్నాయని; ఇవన్నీ వినియోగదారులకు పూర్తి అందుబాటులో ఉన్నాయని దేశీయ అతిపెద్ద బ్యాంకు ఎస్‌బిఐ.. మీడియా పోస్ట్‌లో పేర్కొంది. ధ్రువీకరించని సమాచారంపై ఆధారపడవద్దని వినియోగదారులకు బ్యాంకు సూచించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ సింధ్ బ్యాంకు, కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఇలాంటి సందేశాలను పోస్ట్ చేశాయి. అన్ని డిజిటల్ సేవలు కూడా సజావుగా పనిచేస్తున్నాయని, ఇంటి నుంచి ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను పొందొచ్చని పంజాబ్ నేషనల్ బ్యాంకు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో ఒక పోస్ట్‌లో తెలిపింది.

## దేశ ఆత్మగౌరవాన్ని సవాల్ చేసిన వారికి... చరిత్ర సాక్షిగా తగిన సమాధానం

### కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ వెల్లడి



**న్యూఢిల్లీ :** భారతదేశం ఆత్మగౌరవాన్ని ఎవరైనా సవాల్ చేసినప్పుడల్లా వారికి తగిన సమాధానం లభించిందనడానికి చరిత్ర సాక్ష్యంగా నిలిచిందని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తెలిపింది. భారతదేశ ధైర్య సైనికులకు మద్దతుగా దేశవ్యాప్తంగా తమ 'జై హిందూ యాత్ర'ను నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి, ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జై రామ్ రమేష్ మాట్లాడుతూ ఉగ్రవాదులు అమాయక ప్రజలను నిర్దాక్షిణ్యంగా హతమార్చి మరోసారి సవాల్ విసిరారని, సహనాన్ని, ఓపికను పరీక్షించారని జైరామ్ రమేష్ తన హిందీ 'ఎక్స్' పోస్ట్‌లో తెలియజేశారు. వారు దీనికి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన నొక్కిచెప్పారు. 'భారతదేశం గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని సవాల్‌చేసినప్పుడల్లా చరిత్ర దీనికి సాక్ష్యంగా నిలిచింది. మేం వారికి తగిన తిరుగు సమాధానం ఇచ్చింది' అని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ స్పష్టం చేశారు. 'ఈ భూమిని రక్షించడానికి, ప్రతీ రక్తపు బొట్టునూ త్యాగం చేస్తూ మన సైనికులు ఉద్వేగంతో గర్జిస్తే మన శతృవుల గుండెలు వణికిపోతాయి. ఉగ్రవాదులు మరొకసారి సవాల్‌చేశారు. మా సహనం, ఓపికను పరీక్షించారు. ఉగ్రవాదులు మా అమాయక ప్రజలను నిర్దాక్షిణ్యంగా చంపేశారు.వారు దానికితగినమూల్యంకూడాచెల్లించుకోవాల్సివచ్చింది'అని జైరామ్ రమేష్ తెలిపారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తా కష్టకాలంలో దేశ సైన్యానికి అండగా నిలబడ్డారు' అని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ వివరించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ మద్దతు తప్పకుండా ఉంటుందన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాగిణి నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇరువురూ పలుసార్లు మాట్లాడుతూ 'మనం భారత ప్రభుత్వం ఆలోచన, ప్రతీ మాటా చేతకు అనుకూలంగా వారి నిర్ణయానికి మద్దతుగానే నిలుస్తాం' అని స్పష్టంచేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒకవేళ భారత ప్రభుత్వం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏదైనా పెద్ద నిర్ణయం తీసుకున్నట్లయితే మేం ప్రభుత్వానికి తప్పకుండా గట్టి మద్దతు ఇస్తామని, ఈ విషయాన్ని జై హిందూయాత్ర ద్వారా వెల్లడిస్తున్నామని న్యూఢిల్లీలోని కాంగ్రెస్‌పార్టీ కేంద్ర కార్యాలయం 24, అక్బర్ రోడ్‌లోని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.భారతపాకిస్థాన్ సరిహద్దులోని అన్ని సమీప పట్టణాలు, గ్రామాలలో ప్రజల సురక్షిత చర్యలకు ప్రాధాన్యతను ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదేనని రాగిణినాయక్ పేర్కొన్నారు.3

## పెరిగిన బాస్మతి బియ్యం ధరలు

**న్యూఢిల్లీ :** ఇటీవల బాస్మతి బియ్యం ధరలు పెరిగినట్లు ఆల్ ఇండియా రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సతీశ్ గోయల్ ఓ ప్రకటన చేశారు. బాస్మతి బియ్యానికి అధిక డిమాండ్ ఉందని, దాని వల్లే ఆ బియ్యం రేటు పెరిగినట్లు వెల్లడించారు. ఇండో–పాక్ ఉద్రిక్తతల వల్ల ఆ బియ్యానికి ధర పెరగలేదన్నారు. బాస్మతి రైస్‌కి చెందిన 1509, 1718 వెరైటీల ధరలు ఇటీవల మార్చి నెలలో పెరిగాయన్నారు. ఆ బియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. ఇండోపాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో జరుగుతున్న రవాణా జాప్యం వల్ల బియ్యం ధర పెరగలేదన్నారు. సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్ దేశాల్లో బాస్మతి బియ్యానికి ఎక్కువ డిమాండ్ ఉందని, దాని వల్ల ఆ రేట్లు పెరిగినట్లు చెప్పారు. ఇప్పటి వరకు బాస్మతి బియ్యం వాణిజ్యం ఎటువంటి ప్రభావం పడలేదన్నారు. ఆర్డర్‌లను చాలా స్మూత్‌గా డీల్ చేస్తున్నట్లు చెప్పారు. గత ఏడాది సెప్టెంబర్ 1509 బాస్మతి వెరైటీ బియ్యాన్ని కిలో రూ.62 కు అమ్మారని, ఆ తర్వాత వాటి ధరలు తగ్గాయని, పంట దిగుబడి పెరగడంవల్ల ధరలు తగ్గాయని ఎఐఆర్ఇఎ మాజీ అధ్యక్షుడు విజయ్ సేథియా తెలిపారు. ఫిబ్రవరి వరకు ఆ వెరైటీ ధర కిలో 52గా ఉందన్నారు. మార్చి నుంచి మాత్రం బియ్యం ధరలు పెరినట్లు చెప్పారు. ఇండో, పాక్ ఉద్రిక్తతలతో సంబంధం లేదన్నారు. 2024–25 సీజన్‌లో ఇండియా 60 లక్షల టన్నుల బాస్మతి బియ్యాన్ని ఎగుమతి చేశారని, ఇక పాకిస్థాన్ పది లక్షల టన్నుల బియ్యాన్ని షిప్పింగ్ చేసిందన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం సహించం



ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండలం వెలివర్తి వద్ద కొనుగోలు కేంద్రాన్ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వడ్ల కొనుగోలు పై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు జరగకుండా వడ్ల కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. లారీల కొరత లేకుండా చూడాలని, వెంట వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డియం సివిల్ సప్లై కార్పోరేషన్ హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి రోజారాణి, డిపీఆర్డి సునీల్ రెడ్డి, సివిల్ సప్లై అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎన్ఎఫ్ఐడబ్ల్యు దేవరకొండ నియోజకవర్గ నూతన కమిటీ




ప్రజాపక్షం/ దేవరకొండ : ఈనెల 6న,దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్ రెడ్డి భవన్‌లో జరిగిన భారత జాతీయ మహిళా సమా(ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ) దేవరకొండ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశంలో దేవరకొండ నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నియోజకవర్గం నూతన కమిటీ అధ్యక్షురాలుగా డిండి మండలంలోని గోనకొల్ గ్రామానికి చెందిన బొల్లె మంజుల,ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ కు చెందిన లింగపల్లి అనిత ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో మహిళల ప్రాతినిధ్యం ఉండేలా నియోజకవర్గంలో మహిళల సమయాత్తం చేయనున్నట్లు తెలిపారు.

## బావిలోపడి ఇద్దరు యువకులు మృతి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన శుక్రవారం హుజూర్‌నగర్‌లో జరిగింది. హుజూర్‌నగర్ ఎస్.ఐ జి.ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కన్మనూర్ తిరుపతయ్య,మేదిపురం లక్ష్మణ్(21)మరో ఆరుగురు వ్యక్తులతో కలిసి వారి స్వగ్రామం నుండి గొర్రెలను మేపుకుంటూ హుజూర్‌నగర్‌కు రావడం జరిగింది. గత 10 రోజులుగా పట్టణానికి చెందిన జక్కుల లింగయ్య పొలంలో గొర్రెలను ఆపి ఆ పొలంలోనే ఉంటున్నారు. సుమారు నాలుగు రోజుల క్రితం తిరుపతయ్య ఇద్దరు కుమారులు శేఖర్(14)చరణ్‌లు వేసవి సెలవులు కావడంతోతండ్రి వద్దకు వచ్చినారు. శుక్రవారం ఉదయం సమయంలో తిరుపతయ్య పెద్దకుమారుడు శేఖర్,లక్ష్మ ణ్‌లు సమీపంలోని బావిలో నీళ్ళ కోసం వెళ్ళారు. లక్ష్మ ణ్ నీళ్ళు పట్టడానికి ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ బావిలోపడి మునుగుతుండగా,శేఖర్ లక్ష్మ ణ్‌ను కాపాడేందుకు ప్రయత్నించగా అతని కాలుకూడా జారడంతో బావిలో పడి ఇద్దరు యువకులు మృతి చెందడం జరిగిందని ఎస్.ఐ వివరించారు. శేఖర్ తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని తెలిపారు.

## రోడ్డు మార్గం లేక ప్రజల ఇబ్బందులు



ప్రజాపక్షం/మునుగోడు: మండలంలోని సోలిపురం గ్రామానికి చెందిన హై లెవెల్ బ్రిడ్జి టెండర్లు పూర్తి చేసి వేసవికాలంలోపు నిర్మాణం పూర్తి చేయాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి ప్రభుత్వాన్ని కోరారు. సోలి పురంలో జరిగిన సిపిఐ గ్రామశాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సోలిపురం గ్రామానికి గత 40 సంవత్సరాలుగా సరైన రోడ్డు మార్గం లేక ఆ గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రభుత్వ కార్యాలయంలో పనులు వ్యక్తిగత పనులను నిమిత్తం మండల కేంద్రం మునుగోడుకు రావడానికి పోవడానికి రోడ్డు మార్గం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ మండల కార్యదర్శి చాపల శీను మాట్లాడుతూ గ్రామంలో సిపిఐ పార్టీనిర్మాణం కోసం ప్రతి కార్యకర్త తమవంతు కృషి చేయాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించి సత్తా చాటాలన్నారు.మహాసభకు ముందు పార్టీ పతాకాన్ని ఎగరవేసి అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా నకరేకంటి సత్యనారాయణ, సహాయ కా ర్యదర్శిగా లింగ స్వామి,కార్యవర్గ సభ్యులుగా నకరేకంటి కాసిం,మరిపెల్లి రాజయ్య, లింగయ్య,యాదయ్య, స్వామి,అజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు.

## యువత హక్కుల కోసం పోరాటాలు

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు




ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: ఈనెల 15 నుండి 18వతేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి నగరంలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్ లో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎడెల్లి శ్రీకాంత్, పట్టణ కమిటి సభ్యులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనదేశ స్వాతంత్ర్య పోరాటానికి మహోత్తర చరిత్ర ఉందని, బ్రిటిష్ సామ్రాజ్యావాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో మనదేశ యువత అపారత్యాగాలు చేసిందని, దేశం కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ అజాద్, అల్లూరి సీతరామరాజు లాంటి అమరుల వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని, దేశానికి ఉజ్వల భవిష్యత్ యువత హక్కుల కోసం అవిశ్రాంత పోరాటాలు నిర్వహిస్తున్న సంఘ ఏఐవైఎఫ్ అని అన్నారు. 15వ తేదీన మహాసభ ప్రారంభం రోజు జరగనున్న యువజన ప్రదర్శన, బహిరంగసభకు జిల్లా నుండి యువకులు వేలాదిగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాధవరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం మిల్లులకు త్వరగా తరలించాలి

ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్: కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం త్వరగా మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శుక్రవారం సూర్యాపేట మండలంలోని రాయినిగూడెం, మోప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రాయినిగూడెం నుండి 4743.20 క్వింటాళ్ల ధాన్యం, కొనుగోలు కేంద్రం నుండి 6948.8 క్వింటాళ్ల ధాన్యం తరలించడం జరిగిందని తెలిపారు. రైతులు తాలు లేకుండా శుభ్రమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకరావాలని, తేమ శాత 17 రాగానే సీరియల్ ప్రకారం కాంటావేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. గాలి దుమ్ము ఆకాల వర్షాలు పడుతున్నందున వడ్లు తడవకుండా టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట కేంద్రాల ఇన్‌ఛార్జిలు గౌతమి, పణిమా, సరిత తదితరులు పాల్గొన్నారు.



## జూలూరు పిఎసిఎస్ సిఇఒని సస్పెన్షన్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి మండలం జూలూరు గ్రామం పరిధిలోని అలీనగర్ పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు విధుల్లో నిర్లక్ష్యంగా వహించిన సీఈఓ పై ఆగ్రహం వ్యక్తం చేసి సస్పెండ్ చేశారు. ధాన్యం తేమ శాతం వచ్చిన తరువాత కూడా ధాన్యాన్ని కాంటా వేసి లోడింగ్ చేసి రైస్ మిల్లులకు వెంటనే తరలించాలని సూచించారు. సీఈఓ ఇటీవల అలీనగర్ సెంటర్‌ని ఇప్పటి వరకు వచ్చి చూడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హమాలీలను కూడా ఏర్పాటు చేయలేదని జిల్లాలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎక్కడ ఇబ్బంది రాని వ్వమని హామీ ఇచ్చారు. డీసీవోని జిల్లాలోని అన్ని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలలో సరిపడా హమాలీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి సెంటర్‌లో రైతులకు త్రాగునీరు , రైతులు ఉండడానికి టెంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల సిబ్బంది అధికారులు రైతులు ఆయన వెంట ఉన్నారు.



## ప్రపంచ దేశాలకే తలమానికం చేనేత ఇక్కత్ వస్త్రాలు

విభిన్న ఇక్కత్ చేనేత వస్త్రాలతో మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ ర్యాంప్ వాక్

అన్ని శాఖల ఉన్నతాధికారుల సమీక్షలో యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు దిశా నిర్దేశం



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ పర్యటనతో మగువల మనసు దోచే పోచంపల్లి అందమైన కళాకృతుల ఇక్కత్ చేనేత వస్త్రాలు ప్రపంచ దేశాలకే తలమానికంగా నిలవనున్నట్లు యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఈవెంట్ ఇంచార్జ్, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మిలు అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 72వ మిస్ వరల్ 2025 పోటీలలో పాల్గొంటున్న సుందరీమణుల పర్యాటక ప్రదేశాల పర్యటనలో భాగంగా ఈనెల 15న యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లి పర్యాటక కేంద్రాన్ని ఇక్కత్ చేనేత పరిశ్రమను సందర్శించనున్న నేపథ్యంలో టూరిజం పార్క్ లో జరుగుతున్న ఏర్పాట్లపై శుక్రవారం ఆయన అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి యుద్ధ ప్రాతిపదికన అన్ని పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ సుందరీమణులు రెండు గంటల పాటు పోచంపల్లి టూరిజం, ఇక్కత్ చేనేత హస్తకళ సౌరభ వస్త్ర ప్రపంచాలను వీక్షించి ప్రదర్శించనున్న కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సహకారం అందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.చేనేత హస్తకళలతో తయారు చేసిన వస్త్రాలతో ప్రపంచవ్యాప్తంగా విశిష్ట ఆదరణ ఉన్నందున క్షేత్రస్థాయిలో వస్త్రాల తయారీని తెలుసుకునేందుకు అందమైన వస్త్రాల అద్భుతాలను ప్రపంచానికి తెలియజెప్పేందుకు ప్రపంచ అందాల భామలు రానున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వారికి చేనేత చీరలు వస్త్రాలు తయారయ్యే ప్రాసెస్ ను పట్టు కాయల నుండి దారాన్ని తీయడం నుంచి దశల వారీగా కార్మికులు మగ్గంపై చీర తయారయ్యే వరకు క్రమాన్ని వివరించి క్షేత్రస్థాయిలో కార్మికుల యొక్క కళా సృష్టిని చేస్తున్న కృషిని పొందుతున్న జీవనోపాధిని లభిస్తున్న శ్రమ ఫలాన్ని కళ్ళకు కట్టినట్టుగా మ్యూజియంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక యూనిట్ల ద్వారా ఒక నైపుణ్యమున్న గైడ్ తో వివరించనున్నట్లు తెలిపారు. ఓపెన్ హంపి థియేటర్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంపు పై చేనేత అందమైన విశిష్టత కలిగిన కళాకృతుల చేనేత వస్త్రాలు ధరించి కంటెస్టెంట్స్ ర్యాంప్ వాక్ చేయనున్నట్లు తద్వారా ప్రపంచ మార్కెట్ను ఆకర్షించనున్నట్లు తెలిపారు. ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి డిసిపి అక్షాంష్ యాదవ్ అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ క్రైమ్ డిసిపి అరవింద్ బాబు చౌటుప్పల్ ఏసిపి మధుసూదన్ రెడ్డి ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డిలతో కలిసి ఆయన కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను సెక్యూరిటీ పాయింట్స్ లను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. 25 మంది సౌందర్యరాణుల పర్యటించే దారి, టూరిజం పార్క్, పార్కు, హంపి థియేటర్, పోచంపల్లి పరిసరాలలో నిఘా యంత్రాంగం భద్రతా కారణాలను మ్యాప్ తో ఆయన వివరించినట్లు పేర్కొన్నారు. ఈవెంట్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులకు తెలంగాణ బతుకమ్మ, గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా ఎద్దుల బండి, కులవృత్తుల కళాకృతులు చేనేత స్టాల్స్ ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో సూచించారు. చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, టూరిజం మేనేజర్ ఉపేందర్ రెడ్డి, జడ్పీ సీఈవో శోభారాణి, తహసిల్దారు నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి, సీఐ రాములు, ట్రాఫిక్ సిఐ విజయ మోహన్, ఏఈ శ్రీనివాస్, ఇతర అన్ని శాఖల ఉన్నతాధికారులు ఆయన వెంట ఉన్నారు.

## ఉపాధిహామీ పనిప్రదేశాలలో కనీస సౌకర్యాలు కరువు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్లుగొరి నరసింహ



ప్రజాపక్షం/మర్రిగూడ: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు లేక ఉపాధి హామీ కూలీలు నానా అవస్థలు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లుగొరి నరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. మర్రిగూడ మండలం రాంరెడ్డి పల్లిగ్రామంలో కూలీల ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తు ప్రదేశాలలో మంచినీరు టెంట్ సౌకర్యం ఓఆర్ఎస్ ప్యాకెట్లు మెడికల్ కిట్టు తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ కూలీలకు పార,గడ్డపార,తట్ట ఆ పనిముట్లు పథకం ద్వార ఇవ్వాలని అదేవిధంగా పని దినాలు 200 రోజులు కల్పించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారి వేతనం రూ.700 లు ఇవ్వాలన్నారు.పని ప్రదేశాలలో ఫోటోస్ స్కానింగ్ విధానాన్ని ఎత్తివేయాలన్నారు. నాలుగు నెలలుగా ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు రావడంలేదని వారి పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని అదేవిధంగా కూలీల కూడా పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు ఎండి జాన్మియా,మండల అధ్యక్ష,కార్యదర్శులు జక్కర్తి అంజయ్య,జిల్లా బాలకృష్ణ,ఉపాధి హామీ కూలీలు ఎడ్ల యాదయ్య,లపంగి పెద్ద రాములు,మాధగోరి యాదయ్య,బేత చిన్న రాములు,సిరిపంగి సరిత బెత లక్ష్మమ్మ,యాదమ్మ,లపంగి ముత్తమ్మ,వడ్డే లలిత,ఎడ్ల లక్ష్మమ్మ,గురుకుల జంగయ్య,సుశీల తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలనలో విద్యకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే బాలు నాయక్

ప్రజాపక్షం/ దేవరకొండ : దేవరకొండ పట్టణ పరిధిలోని ప్రభుత్వ గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించినందున శుక్రవారం దేవరకొండ లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శాలువాతో సత్కరించి,శుభాకాంక్షలు తెలిపారు దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులు,ప్రైవేటు సంస్థల కంటే మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల సిబ్బందిని,అధ్యాపకులను, తల్లిదండ్రులకు విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బుజ్జి లచ్చిరామ్ నాయక్, సీనియర్ నాయకులు పాప నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్, మాజీ ఎంపీటీసీ సీత్యా నాయక్,నాయకులు నాగేశ్వర్ రావు,కళాశాల ప్రిన్సిపాల్ కళ్యాణి, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణానికి భూమి కేటాయించాలి

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

ప్రజాపక్షం/మునుగోడు: ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణానికి సరిపోయే విధంగా ఇక్కడే భూమి కేటాయించాలని రెవెన్యూ అధికారులకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశించారు.మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని శుక్రవారం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల సేకరణకు సంబంధించి ఎంత ప్రభుత్వ భూమి ఉందో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను గతంలో కోరారు. ఎమ్మెల్యే సూచన మేరకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న సర్వే నెంబర్ 78 లో మర్రివాగును ఆనుకుని ఉన్న పల్లె ప్రకృతి వనం నుండి దుబ్బ కాలువ రోడ్డు వరకు వున్న భూమిని ఆయన పరిశీలించారు. స్థల పరిశీలన అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కావలసిన స్థల సేకరణ పై సమీక్ష చేశారు. చండూర్ ఆర్‌డిఓ శ్రీదేవి, ఇంచార్జ్ తహసిల్దార్ నరేష్, సర్వేయర్ నాగేశ్వర రావు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



ప్రజాపక్షం/చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో కందాల రంగారెడ్డి స్మారక విజ్ఞాన కేంద్రంలో కావలి యాదయ్య అధ్యక్షతన జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో పలువురు పార్టీల ప్రజా సంఘాల నాయకులు సామాజికవేత్తలు పాల్గొని ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కురిమిద్దె శ్రీనివాస్, సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, టిఆర్ఎస్ జిల్లా నాయకులు పిఎసిఎస్ చింతల దామోదర్ రెడ్డి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బట్టుపల్లి అనురాధ, ఐలు జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ తడక మోహన్, సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి పాషా, తెలంగాణ ఉద్యమకారులు ఉప్పు కృష్ణ, కట్టెల లింగస్వామి తదితరులు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మధ్యభారతంలో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీల హననం జరుగుతుంది. ముఖ్యంగా దండకారణ్యంలో ఆదివాసుల కాళ్ళ కింద ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం కొన్ని దశాబ్దాలుగా ఉవ్విళ్లూరుతుంది. అందుకోసమే ఆదివాసులను అడవి నుండి మాయం చేయాలనుకుంటుంది. ఆదివాసులకు అండగా నిలబడిన మావోయిస్టులను ఏరివేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం కూడా జరిగింది. అందుకోసం దేశ సరిహద్దుల్లో ఉండవలసిన లక్షల మిలటరీ సైన్యాన్ని మధ్యభారతంలో దింపి ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను హత్య చేస్తూ ఎన్కౌంటర్ పేరుతో కట్టుకథలు అల్లుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శంకర్, సిపిఎం మండల కార్యదర్శి జి సైదులు, బిఆర్‌యస్ మండల నాయకుడు ఉడుగు మల్లేశ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధు, ఎస్ఎఫ్ఐ మండల జిల్లా కార్యదర్శి శ్రీను, సిపిఐ నాయకులు టంగుటూరి రాములు, టిజెఎస్ జిల్లా నాయకులు ఆంజనేయులు చారి, బీఎస్పీ మండల నాయకులు మాద రమేష్, బోయ యాదయ్య పాల్గొన్నారు.



## ఆహార పదార్థాలలో నాణ్యత లేకపోతే సీజ్ చేస్తాం...

మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హోటళ్ళల్లో,దాబాల్లో,రెస్టారెంట్లల్లో ,బేకరిలలో ప్రజలకు విక్రయించే ఆహారపదార్థాలలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా విక్రయిస్తే సీజ్ చేస్తామని హుజూర్‌నగర్ మున్సిపల్ కమీషనర్ కె. శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ,హైదరాబాద్ వారి ఆదేశానుసారం హుజూర్‌నగర్ పురపాలక సంఘం పరిధిలో ఉన్నటువంటి పలు దాబాలు,హోటళ్ళు,రెస్టారెంట్లు,బేకరిలలో ప్రజలకు విక్రయిస్తున్న ఆహారపదార్థాలను పరిశీలించారు. దుర్గాభవాని ఫ్యామిలీ రెస్టారెంట్(చౌదరిదాబా)తెలుగింటి రుచులు,ఫాంటసీ బేకరిలలోని ఆహార పదార్థాలను పరిశీలించడం జరిగింది. ఫ్రిడ్జ్‌లలో నిల్వ ఉంచిన చికెన్,ఇతరత్రా ఆహారపదార్థాలను గుర్తించి వాటిని డంపింగ్ యార్డుకు తరలించడం జరిగింది. అలాగే దుర్గా భవాని రెస్టారెంట్ (చౌదరి దాబా)రూ. 2 వేలు,తెలుగింటి రుచులకు రూ.1000,ఫాంటసీ బేకరికి రూ.500లులను జరిమానాలు విధించడం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నాణ్యత కలిగిన పదార్థాలను మాత్రమే ప్రజలకు విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఎమ్.అశోక్,జవాన్లు,వార్డు అధికారులు,ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు లేని ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి



ప్రజాపక్షం/చండూరు: మండలంలో సొంత ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ చండూరు మండల సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య , బొడ్డు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. గ్రామ కూడలిలో మండల పార్టీ సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య పార్టీ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం నిర్వహించచన శాఖ మహాసభలో వారు మాట్లాడుతూ గొల్లగూడెం గ్రామంలో ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్నికోరారు. అర్హులైన వారందరికి నూత రేషన్ కార్డులు , ఆసరా పెన్షన్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామశాఖ నూతన కార్యదర్శిగా నరాముల వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికైయారు. నాగలగాని సత్తయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ కార్యవర్గ సభ్యులు కర్నాటి వెంకటేశం , సిహెచ్ ఊషయ్య , గీత పనివారల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె శంకరయ్య , బంగారిగడ్డ సిపిఐ శాఖ కార్యదర్శి పల్లె నర్సింహ్మా, దూదిమెట్ల చంద్రయ్య , బోయిని సత్తయ్య , దూదిమెట్ల ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ప్రజాపక్షం/ డిండి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ,మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కార్మికులకు పిలుపునిచ్చారు.శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిండి ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శివానందం కు సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 39 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా సమూనంగా కుదించి కార్మిక హక్కులను కాలరాస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిలో కొనసాగించి, కనీస వేతనం 26000 ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం (ఎఐటియుసి )మండల అధ్యక్షులు రామావత్ జవహర్ లాల్, పరమేష్ అంజి,భారతి, సుజాత, చెన్నమ్మ, నీలమ్మ, సైదమ్మ ,లక్ష్మమ్మ, కే లక్ష్మమ్మ, మాన్య, బాలమ్మ ,లక్ష్మమ్మ ,సాలమ్మ, నీలమ్మ పాల్గొన్నారు.



## దుర్గామాతను దర్శించుకున్న ప్రభుత్వ విప్



ప్రజాపక్షం/చందుర్తి: మండల కేంద్రం లోని నవరత్నాల దుర్గామాత బోనాల ఉత్సవాలో భాగంగా ప్రభుత్వ విప్ , స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గురువారం గ్రామస్తులు ఇంటికొక బోనం వండి డప్పు చప్పుల్లు , బైండ్ల పూజారుల ఆట పాటల మధ్య ఏరేగింపుగా వెళ్ళి అమ్మవారికి బోనాలు సమర్పించారు.అంగరంగ వైభవంగా జరిగిన బోనాల ఉత్సవాల్లో చుట్టు పక్కల గ్రామాల నుండి ప్రజలు , భక్తులు, వివిధ పార్టీల నాయకులు,గ్రామ ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్, పోలీస్ కమిషనర్

ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి: కరీంనగర్‌లోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుజయ్ పాల్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంలు మర్యాదపూర్వకంగా కలిసారు. పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.



## ప్రభుత్వ భూమి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలి

కలెక్టర్ మనుచౌదరి

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప రెవెన్యూ పరిధిలోని మాందాపూర్‌లో గల ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రక్షణ చర్యలు చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మాందాపూర్‌లో సర్వే నెంబరు 445లో గల 425ఎకరాల టిజిఐఐసి భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒకు సూచించారు. కాగా పరిశ్రమలకు కేటాయించిన భూమి రహదారికి దూరంగా ఉండటంతో పాటు రొడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో ల్యాండ్ మ్యాఫ్‌లో భూమి వివరాలు అందించాలని సర్వే అధికారులను అదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డిఒ చంద్రకళ,తహాశీల్దార్ నిర్మల, డిప్యూటీ తహాశీల్దార్ రఘువీర్‌రెడ్డి, జిల్లా సర్వే అధికారులు, టిజిఐఐసి అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి



ప్రజాపక్షం/కొండపాక: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. కొండపాక మండలం జప్తి నాచారం గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు.అలాగే వెలికట్టలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడారు.అనంతరం కొండపాక ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాస దరఖాస్తులను పరిశీలించి, అందుకోసం తీసుకోవాల్సిన చర్యలను ఎంపీడీవో, ఎంపీవోలకు ఆదేశించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులతో ముచ్చటించారు.కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో కరెంటు సదుపాయం లేకపోవడాన్ని అడిషనల్ కలెక్టర్ దృష్టికి హమ్మాలీలు తీసుకపోగా వెంటనే ఐకెపి సిబ్బందికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రం వద్ద ఐకెపి అధికారుల రిజిస్టర్‌లను పరిశీలించి ఆన్లైన్ విధానాన్ని వడ్లు విక్రయించే పద్ధతులను అడిగి తెలుసుకున్నారు.వెలికట్ట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు సర్వే కాబడిన లబ్ధిదారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ దిలీప్ నాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపిఓ మల్లిఖార్జున్, ఐకెపి ఎపిఎం ముగ్దం అలీ, పంచాయతీ కార్యదర్శి రాణి, ఏఈఓ మౌనిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వినతిపత్రంతో నిరసన



ప్రజాపక్షం/బీర్‌పూర్: జగిత్యాల జిల్లాలోని బీర్‌పూర్ గ్రామానికి చెందిన సలికె మురళి జగిత్యాల జిల్లా అటవి శాఖ కార్యాలయం ముందు వినతి పత్రం పట్టుకొని నిరసన వ్యక్తం చేశాడు. బీర్‌పూర్ గ్రామానికి చెందిన కొంతమంది ఫారెస్టు అధికారులతో మమేకంతో ఉండి సుమారు 30 ఎకరాల భూమి సాగు చేస్తున్నారని ప్రతి నిత్యం అటవి అధికారులు వచ్చి చూస్తు వెళ్తున్నారే తప్ప వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లేదన్నారు. ఫారెస్టు అధికారులకు అనుకూలం ఉంటే ఏమైనా చేయవచ్చని బీర్‌పూర్ మండల ఫారెస్టు అధికారుల తీరు వెల్లడవుతుంది. గతంలో మురళి రెండు సార్లు జగిత్యాల జిల్లా ఫారెస్టు అధికారులకు ధరఖాస్తు ఇచ్చిన ఎలాంటి చర్యలు లేవని ఇకనైనా స్పందిస్తారా అంటూ మండల ప్రజలు మాటలు కోరారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికీ గాయాలు



ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతి పరిధిలోని రంగయ్యపల్లి గ్రామశివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అయ్యాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని లోని తిలక్ నగర్ కు చెందిన చేతుర్వేవేదుల శ్రావణ్ తో పాటు శశిధర్ అనే వ్యక్తులు ములుగు జిల్లా నుండి గోదావరిఖని కి వెళ్తుండగ ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదం లో గాయాలు అయినా వారిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

## హ్యాండ్లూమ్ టెక్నాలజీ ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : తెలంగాణ రాష్ట్రము నందు నూతనముగా మంజూరు కాబడిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజి (IHT) హైదరాబాదు నందు మొదటి సంవత్సరము (202526) నకు (60) సీట్లకు చేనేత మరియు టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్స్ లో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానించబడుచున్నవి.ఈ సంధర్భంగా 202526 విద్య సవంత్సరానికి గాను కొండ లక్ష్మ ణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజి (IIHT) హైదరాబాదు ద్వార మూడు సవంత్సరాల హాండ్లూమ్ టెక్స్ టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సు కు యువత నుంచి దరఖాస్తులు కొరబడుతాయి. దీని మీద ఒక అవగాహన సదస్సు మే 16, 2025 రోజున ఉ: 11:30 గంటలకు సహాయ సంచాలకులు చేనేత మరియు జౌళి శాఖ, కరీంనగర్ కార్యాలయములో ఒక అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. హైదరాబాద్ నుంచి జనరల్ మేనేజర్, TGSCO ముఖ్య అతిధిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సంధర్భంగా జిల్లా లోని చేనేత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రోగ్రాంను వియజేయవంతం చేయాలని కోరారు. దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని, ఇతర వివరాల కోసం సహాయ సందాలకులు చేనేత మరియు జౌళి శాఖ, కరీంనగర్ కార్యాలయము, మంకమ్మ తోట, కరీంనగర్ సంప్రదించవచ్చని, తగిన సమాచారం ఈ ఫోన్ నెంబర్ లలో సంప్రదించాలని కోరారు.(9849391548/8520079865.

# ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి



బడిబాట, అంగన్‌వాడీ బాట నిర్వహించాలి

పది ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: రానున్న విద్యా సంవత్సరంలో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపు, పదోతరగతి సప్లమెంటరీ పరీక్షలు, తదితర అంశాలపై ఐసిడిఎస్, విద్యాశాఖ సమన్వయ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ బాట నిర్వహించి ఆరు సంవత్సరాలలోపు పిల్లలందరినీ చేర్పించాలని ఆదేశించారు. అంగన్ వాడి సేవలను, నూతన సిలబస్ ద్వారా ఇస్తున్న ప్రత్యేక బోధనను గురించి తల్లి దండ్రులకు తెలియజేస్తూ నమోదును పెంచాలన్నారు. అంగన్‌వాడీలో ప్రీస్కూల్ పూర్తి చేసిన పిల్లందరి జాబితా మండల విద్యాధికారులకు సమర్పించాలని సూచించారు. ఈ జాబితాలో ఉన్న పిల్లందరూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేరేలా ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ప్రైవేట్ భవనాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలన్నీ స్థానిక ప్రభుత్వ పాఠశాలలకు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలకు మార్చాలని ఆదేశించారు. ఇప్పటికే మార్చాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించామని, ప్రభుత్వ భవనాల్లో ఈ కేంద్రాలకు కావాల్సిన వసతులు సమకూరుస్తామని పేర్కొన్నారు. 2015 నుంచి 2023 వరకు పదో తరగతి ఫెయిల్ అయి చదువు ఆపేసిన విద్యార్థులందరినీ గుర్తించి వచ్చే సంవత్సరం వారు పదో తరగతిలో ఉత్తీర్ణులయ్యేలా అవగాహన కల్పించాలని మండల విద్యాధికారులను ఆదేశించారు. ఈ ఏడాది పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులందరూ వచ్చే జూన్ నెలలో సప్లిమెంటరీ రాసి ఉత్తీర్ణులు అయ్యేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిటిడివో పవన్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, కో ఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్, ఆంజనేయులు, సిడిపివోలు సబిత, శ్రీమతి, నర్సింగారాణి, సుగుణ, మండల విద్యాధికారులు, సూపర్‌వైజర్లు తదితరులున్నారు.

## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: మే 17 లోపు లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుండి తెలంగాణ అకాడెమి ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని, మే 5 నుండి మీ సేవా కేంద్రాలలో 100 రూపాయలు చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందవచ్చని, మే 17 లోపు ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మీ సేవా కేంద్రాలలో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఇంటర్‌లో గణితంలో 60 శాతం మార్కులు సాధించిన వారు, ఐటిఐ డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్), డిప్లమా (సివిల్), బీటెక్(సివిల్) లేదా సమానమైన అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు 50 పని దినాలలో ( మే 26 నుండి జూలై 26) శిక్షణ ఇస్తామని, శిక్షణ కోసం ఓసి అభ్యర్థులు పదివేల రూపాయలు, బిసి అభ్యర్థులు రూ.5000లు చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 9849081489, 7032634404, 9441947339 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో 9మంది ఎంపిక



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ,పీజీ కళాశాలలో గత నెలలో నిర్వహించిన మెడికో హెల్త్ కేర్ సొల్యూషన్స్ కంపెనీకి 9 మంది విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ సంధర్భంగా విద్యార్థినులు నాగలక్ష్మి, వైశిత, గౌతమి, సాయి కీర్తన, హరిణి, సిందూజ, శ్రీ లాస్య, అస్రామహవీష్, షేకి షిరీన్‌లను అభినందించారు. కరెస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించిన వివిధ రకాల నైపుణ్య కార్యక్రమాలను తమ విద్యార్థినులు ట్రైనీ ఇన్ రెవెన్యూ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ అసోసియేట్స్‌గా ఎంపిక అవడానికి ఉపయోగపడ్డాయని, హెల్త్ కేర్ సొల్యూషన్స్‌లో ఉద్యోగం రావాలంటే కమ్యూనికేషన్స్ స్కిల్స్ మీద పట్టు చాలా అవసరమన్నారు. దాంతో పాటుగా అకౌంటింగ్ నాలెడ్జ్ అవసరమని, కళాశాలలో అన్ని రకాల ఉద్యోగాలకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు ఉద్యోగ సాధనకు తోడ్పడిందని తెలిపారు.

## డిఇఒను సస్పెండ్ చేయాలి




ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు విద్యావ్యాపారం చేస్తున్నాయని, అక్షరాలతో లక్షల రూపాయలు చేస్తూ ఇష్టానుసారంగా ప్రకటనలు చేస్తున్నా విద్యాశాఖ పట్టించుకోవడం లేదని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ఆరోపించారు. ప్రైవేట్ కార్పోరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్టకుండా వారికి వత్తాసు పలుకుతూ విద్యావ్యాపారానికి సహకరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్లో ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, మచ్చ రమేష్‌లు మాట్లాడుతూ ప్రైవేట్ కార్పోరేట్ పాఠశాలలు ఫీజుల పేరిట విద్యా విద్యావ్యాపారం చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. డీఈవో, ఎంఈవో అండదండలతోనే ప్రైవేట్ పాఠశాలల వారు ఇష్టానుసారంగా ఫీజుల వసూలు చేస్తున్నారన్నారు. అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజు, యూనిఫామ్ ఫీజు, పుస్తకాలు,స్టేషనరీ పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని వాపోయారు. ప్రైవేట్ పాఠశాలలు ఎక్కడా విద్యాశాఖ నిబంధనలు పాటించడం లేదన్నారు. మౌలిక వసతులు లేని పాఠశాలలు ఎన్నో ఉన్నాయని, నిబంధనలు విరుద్ధంగా తోక పేర్లు ఇంటర్నేషనల్, వరల్డ్, ఈటెక్నో, టెక్నో అంటూ ప్రచారం చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ఫీ రెగ్యులేషన్ కమిటీ ఏర్పాటు చేసి ఫీజుల దోపిడీని అరికట్టాలని, పాఠశాలల యాజమాన్యాలు పనిచేసే ఉపాధ్యాయులకు, సిబ్బందికి సరైన జీతాలు ఇవ్వడం లేదని, విద్యాశాఖాధికారి వారికి అన్ని విధాలా సహకరిస్తున్నారని, ప్రైవేట్ కార్పోరేట్ పాఠశాలల ఏజెంట్‌లా వ్యవహరిస్తున్న డీఈవోను సస్పెండ్ చేసి జిల్లాలో ఫీజుల నియంత్రణకు చర్యలకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, నాయకులు రాహుల్, తదితరులున్నారు.

# సైనిక చర్యలకు సంపూర్ణ మద్దతు

ప్రభుత్వ విప్ లక్ష్మ ణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి: జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో అమాయకులను కాల్చి చంపిన తీవ్ర వాదులకు తగిన గుణపాఠం చెబుతూ భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సైనిక చర్యలకు రాజకీయాలకు అతీతంగా అందరూ మద్దతు ఇవ్వాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. ఆపరేషన్ సింధూర్ చర్యల నేపథ్యంలో భారత దేశ సైన్యానికి సంఘీభావం తెలుపుతూ జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో శుక్రవారం పార్టీలకతీతంగా చేపట్టిన ర్యాలీలో అడ్లూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంది చౌక్ నుండి గాంధీ చౌక్ వరకు వందలాది మందితో సంఘీభావ ర్యాలీ జరిపిన అనంతరం విప్ లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడారు. పహల్గాంలో అమాయక పర్యాటకులను అతి దారుణంగా కాల్చి చంపిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ భారత్ చేపట్టిన సైనిక చర్యలకు ఏఐసిసి అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని చెప్పారు. తీవ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పేలా సైన్యం తీసుకుంటున్న చర్యలకు దేశంలోని 140 కోట్ల ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, యువత పాల్గొన్నారు.

# లారీల కొరత లేకుండా చర్యలు



ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి: సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అకస్మీకంగా తనిఖీ చేశారు. కొనుగోలు ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందచేసి రవాణాకు లారీల కొరత లేకుండ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తేమశాతం రాగానే గన్నీ బ్యాగులు అందించాలన్నారు. టార్పాలిన్ కవర్లు అందించి, లోడ్ చేసేందుకు లారీల కొరత లేకుండ సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండ సెంటర్లలో అన్ని వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు.

**చింతమడక, సీతారాంపల్లి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించిన కలెక్టర్**

సిద్దిపేట రూరల్ మండలం చింతమడక, సీతారాంపల్లి, మాచాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న పెండింగ్ గృహాలను జిల్లా కలెక్టర్ మనుచౌదరి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న అన్ని ఇండ్లను పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణం పూర్తయిన లబ్దిదారులు అందచేసిన గృహాలను డ్రైనేజీ వ్యవస్థ మిషన్ భగీరథ కనేక్షన్ వంటి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట తహాశీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎంపిడిఓ, ఎంపిఓ తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా జరుగుతున్న ధాన్యం కొనుగోలు



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ డి.వేణు ఓదెల మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు వివరాలు, అందుబాటులో ఉన్న టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు తదితర వివరాలను అదనపు కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓదెల మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నామని, ప్రతిరోజు నాలుగు లారీల స్టాక్ మిల్లులకు పంపుతున్నామని, రవాణా నిమిత్తం లారీల కొరత ఎక్కడా లేదని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు.కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 17 తేమ శాతం రాగానే కాంటా వేసి మద్దతు ధరకు కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించాలని అన్నారు. ధాన్యానికి సంబంధించిన మద్దతు ధర, సన్న రకం ధాన్యానికి బోనస్ డబ్బులు రైతులకు సకాలంలో జమ అయ్యేలా చూడాలని అన్నారు.ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హమాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రైతులకు అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.


## రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై నిరసన



ప్రజాపక్షం/శంకరపట్నం: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ టిజేఎస్ జిల్లా కన్వీనర్ మోరె గణేష్, టిడిపి అడహక్ కమిటీ పార్లమెంట్ సభ్యుడు మోరె ప్రభాకర్ ఆద్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా మోరె గణేష్ మాట్లాడుతూ మొలంగూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 703 ప్రభుత్వ భూమిని భూ అక్రమదారుల నుంచి కాపాడి ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ కులాలకు గూడులేని నిరుపేదలకు పంచాలని కోరారు. రెవెన్యూ అధికారులు 703 సర్వే నెంబర్ కొలతలు చేసి హద్దులు ఏర్పరచలేదని పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి భూమి హద్దులు నిర్ణయించకపోతే ఈ నెల 20న అమర నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గోపు వీరమల్లు, శ్యామ్ సాగర్, శివ స్వామి, శ్రీకాంత్ తదితరులున్నారు.

# భూ సమస్యలకు కట్టుదిట్టమైన చర్యలు


కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి: రెవెన్యూ సదస్సుల ద్వారా వస్తున్న భూ సమస్యల పరిష్కారానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం ఎలిగేడు తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు పెద్దపల్లి జిల్లాలో ఎలిగేడు మండలం పైలేట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని భూ భారతి చట్టం కింద భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని, గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మే 19 వరకు ఉన్న షెడ్యూల్ ప్రకారం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని,భూ రికార్డుల సమస్యలు ఉంటే ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ఎలిగేడు మండలంలో ఇప్పటివరకు ప్రజల నుంచి 614 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, కోర్టు సమస్యలు, కుటుంబ వివాదాలు మినహాయించి మిగిలిన భూ సమస్యలను జూన్ 2లోపు పరిష్కరించేలా కార్యచరణ అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ బషిరుద్దన్, తహసిల్దార్ యాక్కన్న, డిప్యూటీ తహసీల్దారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలు ఆకస్మిక తనిఖీ

కలెక్టర్ సత్య ప్రసాద్



ప్రజాపక్షం/జగిత్యాల రూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, బాలపెల్లి పిఏసిఎస్ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం రోజున జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందని,కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నామని, ప్రతిరోజు మిల్లులకు పంపుతున్నామని, రవాణా నిమిత్తం లారీల కొరత ఎక్కడా లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. ధాన్యాన్ని వేగవంతంగా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలనిజిల్లా కలెక్టర్ అన్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు వివరాలు, అందుబాటులో ఉన్న తార్పలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, కొనుగోలుచేసిన ధాన్యం మిల్లులకు తరలింపు, రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 17 తేమ శాతం రాగానే కాంటా వేసి కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించాలని, ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హామాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సంబధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తదితర వివరాలను జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, జగిత్యాల రూరల్ మండల తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఆర్‌సి నిర్మల్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని టిఎన్జీవో భవన్‌లో గురువారం జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) ఈ కార్య వర్గం ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్య క్రమంలో నిర్మల్ జిల్లా ఎన్‌హెచ్‌ఆ ర్‌సి చైర్మన్ విక్రమ్ మాట్లాడుతూ పేద ప్రజల తరపున పోరాడటానికి ఎన్ హెచ్‌ఆర్‌సి ముందుంటుందని, అవినీతి,అక్రమాలను వెలికితీసి న్యాయ స్థానాల ద్వారా అరికట్టడం, పేద ప్రజలకు దక్కేలా కృషి చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా వైస్ చైర్మన్ వోద్నల రాజు, భీమ్ రాజ్,జిల్లా సెక్రటరీ పోన్నం శివాజీ గౌడ్, జనరల్ సెక్రటరీ రాజశేఖర్ నాయక్, కో–కన్వీనర్ డి.సూర్యరాజ్, జాయింట్ సెక్రటరీ రవి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తొగిటి రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

## స్థానికంగా ఉండి మెరుగైన సేవలు

జిల్లా కలెక్టర్ మను చౌదరి



ప్రజాపక్షం/గజ్వేల్: వైద్యులు, వైద్య సిబ్బంది స్థానికంగా ఉండి మెరుగైన వైద్య సేవలు అం దించాలని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నా రు. గజ్వేల్ పట్టణంలోని మాత శిశు సంరక్షణ ఆసుపత్రిని శుక్రవారం ఆ యన ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా మీడి యాతో మాట్లాడారు. రోగు లకు అందుబాటులో ఉండి ఆస్పత్రి పనితీరును మరింత మెరుగు పరచాలని ఆదేశించారు. ముఖ్యంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఆశించిన మేర కు జరుగుతుండగా, సాధారణ ప్రస వాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచి ంచారు. ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, ఐసియును మరింత మెరుగుపరచాలని, అవసర మయ్యే యంత్ర పరికరాలు తదితర వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఆర్‌డిఓ చంద్రకళ, జిల్లా వైద్యా ధికారి పల్వాన్ కుమార్, వివిధ శాఖల అధికారులు ప్రవీణ్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కేంద్రం పరిశీలన



ప్రజాపక్షం/కాసిపేట: మండలంలోని పిఎసిఎస్ మల్కపల్లి వరి ధా న్యం కొనుగోలు కేం ద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ మోతిలాల్ పరిశీలిం చారు. ఈ సం దర్భంగా ఆయన వరి ధాన్యం పరిశుభ్రతను, తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొను గోలు కేంద్రాలకు తీసు కురావాలని ఆయన సూచించారు. దళారులను నమ్మి మోస పోకు ండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు విజ్ఞ ప్తి చేశారు. తూకం వేసిన వెంటనే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని ధాన్యం కొను గోలు ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి ప్రేమ్‌కు మార్‌ను ఆయన ఆదేశించారు. ఈ కార్య క్రమంలో మండల ప్రత్యేక అధి కారి, తహసీల్దార్ భోజన తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పక్కదారి!

ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ నాణ్యమైన సన్న బియ్యం రేషన్ ద్వారా అందించాలనే ఉద్దేశ్యంతో రేవంత్ సర్కార్ ఉగాది పర్వదినాన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకం (సన్నబియ్యం) పక్కదారి పడుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యం అమ్మిన వారి కార్డు రద్దు చేస్తామని, బియ్యం పక్కదారి పట్టించే ప్రయత్నం చేసిన డీలర్ల డీలర్ షిప్‌ను రద్దు చేస్తామని స్వయంగా జిల్లా కలెక్టర్ కఠినంగా ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ పలుచోట్ల ఇలాంటి సంఘటనలు జరుగు తూనే ఉన్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఇటువంటి సంఘటనలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి కలెక్టర్ ఆదేశాలను నిజం చేస్తూ కఠినంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పు నరావృతం కాకుండా ఉంటాయని పలువురు అభిప్రా యప డు తున్నారు. రేషన్ బియ్యం (తినని) అవసరం లేని వారు వాటిని అమ్మ కుండా స్వచ్ఛ ందంగా కార్డును ప్రభుత్వానికి అందిస్తే, మరి కొంతమంది అర్హులైన లబ్ధిదా రులకు సంక్షేమ పథకా లు చేరువవుతాయని పలువురు భావిస్తున్నారు.

## మొక్కల సంరక్షణకు చర్యలు

జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :నర్సరీలో పెంచుతున్న మొక్కల సంరక్షణకు చ ర్యలు తీసుకోవా లని జి ల్లా కలెక్టర్ వెంకటేష్ దో త్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న నర్సరీని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధి కారి దత్తారావుతో కలిసి పరి శీలించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నర్స రీలోని మొక్కలు ఎండిపో కుండా ప్రతిరోజు సకాలంలో నీటిని అందించాలని, పశువులు రాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి ఆదేశించారు. అనంతరం అడ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. ముందస్తు అనుమతి లే కుండా వైద్యులు, సిబ్బంది విధులకు గైరహాజరు కా కూడదని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. గర్భిణు లు సమయా నుసారంగా అవసరమైన పరీక్షలు చేయించుకోవడంతో పాటు సరైన పోషక ఆహారం, మందులు తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్త పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీని వాస్, వైద్యులు, ఇబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు



ప్రజాపక్షం/ఆసిఫాబాద్: అర్హులైన లబ్ధిదారులకే ఇండ్లు అందించడం జరు గుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని జనకాపూర్ వార్డు 1 ఎస్‌సి. కాలనీలో ఇందిర మ్మ ఇండ్ల అర్హుల జాబితా లోని లబ్ధిదారుడి ఇంటిని పరిశీలించి, లబ్ధిదా రుడి ఆదాయం, కుటుంబ నేపథ్యం, రేషన్ కార్డు వంటి వివరాలు తెలుసుకున్నారు. ఈ సం దర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారు లకు మాత్రమే ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నట్ల యితే విచారించి వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో జాబి తాలో గల పేర్లను క్షేత్రస్థాయిలో పరి శీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్హులను గుర్తించాలి



ప్రజాపక్షం/బెల్లంపల్లి : ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ గృహాల పథ కం అర్హులైన వారికి లభించేలా చూడాలని కోరు తూ, సిపిఐ బెల్లంపల్లి పట్టణ సమి తి ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఆర్ డిఓ, బెల్లంపల్లి మున్సిపల్ క మిషనర్‌కి వినతి పత్రం అంద జేశారు. ఈ సం దర్భంగా సిపిఐ బెల్లంపల్లి పట్టణ సమితి కార్యదర్శి ఆడెపు రాజమౌళి, సీనియర్ నాయ కులు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య మాట్లాడుతూ బెల్లంపల్లిలోని 34 వార్డులలో వార్డు సభలు నిర్వహించి, పేద లను గుర్తించి, అసలైన లబ్ధిదారులను ఎంపిక చేయవలసి ఉందని, కానీ వార్డు సభలు నిర్వహించకుండా, కొంతమంది నాయకులు ఇష్టారాజ్యంగా వారి అనుచరులకు, పక్కా గృహాలు ఉన్నవారికి కూడా ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తున్నారని పట్టణ ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. పట్టణం లోని 34 వార్డులలో వార్డు సభలు నిర్వహించి, అర్హులైన వారిని గుర్తించి జా బితాను ప్రకటించాలని, ఆ జాబితాను మున్సిపల్ కార్యాలయంలోని నోటీ సు బోర్డులో ప్రదర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మం డల కార్యదర్శి బొంతల లక్ష్మీ నారాయణ, పట్టణ కార్యవర్గ సభ్యులు బొం కూర్ రామచందర్, కుందేళ్ళ శంకర్, శనిగారపు రాజేందర్, నాయకులు కలువల రాయ మల్లు, కొత్తూరు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి : భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. జిల్లా భూ భారతిపైలట్‌ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సు లలో భాగంగా శుక్రవారం కొండాపూర్ మం డలం గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన సద స్సులో కలెక్టర్ క్రాంతి వల్లూరు పాల్గొన్నారు. సద స్సుకు హాజరైన రైతులతో బేటీ అయ్యి వారు ఎదు ర్కొంటున్న భూ సంబందిత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ హెల్ప్ డెస్క్ దరఖాస్తుల స్వీక రణ కౌంటర్ వద్ద సదుపాయాలు సిబ్బంది పనితీ రును కలెక్టర్ పరిశీలన జరిపే అధికారులకు సూచనలు చేశారు. రైతులు సమర్పించిన దరఖా స్తులో భూ సమస్యలను పేర్కొనే సమయంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఆన్లైన్‌లో జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని అన్నారు. వివరాల నమోదులో తప్పిదాలకు అస్కారం లేకుండా చూడాలని ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు హితువు పలికారు. దర ఖాస్తుల పరిశీలన ఆన్లైన్ నమోదు ప్రక్రియలపై పరిపూర్ణమైన అవగాహన తో ఉండాలన్నారు. పైలట్ ,ప్రాజెక్టు కింద కొండాపూర్ మండలంలో రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరి ష్కరించిన మీదట జిల్లాలోని మిగితా మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తా మని పేర్కొన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్క రించుకోవాలని సూచించారు. అంతకు ముందు కొండాపూర్ మండలం తహసీల్దార్ కార్యాల యంలో ఆకస్మిక తనిఖీ చేశారు. రెవెన్యూ సద స్సులలో వచ్చిన దరఖాస్తులు ఆన్లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ సదస్సులలో ఆర్డిఓ రవీందర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అన్‌లోడింగ్ చార్జీలు పెంచండి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్



ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి: హమాలీలకు అన్‌లోడింగ్ కూలీ రేటు పెంచాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. శుక్రవారం సిడబ్ల్యుసి గోదాం మెనేజర్‌కి వినతి పత్రం అందజే శారు. అనంతరం జిల్లా కేంద్రం లోని సెంట్రల్ వేరోజింగ్ కార్పొరేషన్ హమాలీస్ యూనియన్ ఎఐ టియుసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ లకు అన్‌లోడింగ్ కూలీ రేటు చెల్లించాలని, ఎఎంసి ఉన్న సిడబ్ల్యుసి గోదా ములు హమాలీలకు పని కల్పించాలని కోరారు. మేనేజరు సానుకూ లం గా స్పందించి పని కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చా రు. 17న యాదవ సంఘ భవనంలో సమ్మె, సదస్సును విజయవంతం చేయా లని కార్మికులకు పిలుపునిచ్చారు. 20న జాతీయ సదస్సును ఉంటు ందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు గాజంగుల రాజు ముఖదం ఎస్‌కే.దస్తగిరి, అన్నపురనే సంబాజీ, ఉపాధ్యక్షులు అబ్దుల్ కలాం సహాయ కార్య దర్శి అలకుండేబండు, సహాయ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన భూ భారతి చట్టం కింద రైతులు, ప్రజల నుండి వచ్చిన దరఖా స్తులను క్షుణ్ణంగా పరిశీలన జరి పిన మీదట క్షేత్ర స్థాయిలో సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ రాజీ వ్‌గాంధీ హన్మంతు రెవెన్యూ బృందాలను ఆదేశిం చారు. భూభారతి పైలెట్ ప్రతిపాదికన మెండోరా మండలం లోని 8 గ్రామాలలో నిర్వహించిన రైతు సదస్సుల సందర్భంగా వచ్చిన దరఖాస్తులను ప్రభు త్వ మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ, నూతన ఆర్‌ఓఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. శుక్ర వారం ఆర్మూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాల యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమావేశమై భూభారతి దరఖాస్తుల పరిశీలన, విచారణ అంశాలపై మార్గనిర్దేశం చేశారు. మండలంలోని 8 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల సంద ర్భంగా 706 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి పక్కాగా ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహిం చాలని మొక్కుబడిగా కాకుండా ప్రతి అంశాన్ని ఎంతో జాగ్రత్తగా, సమగ్రంగా పరి శీలించాలని హితవు పలి కారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, భూభారతిలోని నిబంధ నలపై పరి పూర్ణమైన అవగాహనను కలిగి ఉన్నప్పుడే తప్పిదాలకు తావు లేకుండా దరఖాస్తుల పరిశీ లన, విచారణ ప్రక్రియలను నిర్వహించగలుగుతారన్నారు. ఈ నెల 12 నుండి దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియలు చేపట్టి వారం రోజుల్లో పూర్తి చేయా లని ఈనెల 20లోగా ఎట్టి పరిస్థితుల్లోనూ అన్ని దరఖా స్తుల విచారణ పూర్తి కావలని రెవెన్యూ బృందా లకు గడువు విధించారు. క్షేత్రస్థాయి విచారణలో జాప్యానికి తావు లేకుండా ఇతర మం డలాల సర్వేయర్ల కూడా పైలట్ మండలానికి కేటాయిస్తామని, రెవెన్యూ బృందాలు సమన్వ యంతో పని చేస్తూ నిర్ణీత గడువు లోపు దరఖాస్తుల పరిశీలన, విచారణలు పూర్తి చేయా లని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఆర్‌డిఓ రాజా గౌడ్, మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక

యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి



ప్రజాపక్షం/గజ్వేల్: రాష్ట్రంలో ఉద్యానవన పం టల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక రూ పొందిస్తున్నట్లు శ్రీకొండాలక్ష్మణ్ ఉద్యానవన యూనివర్సిటీ ఉపకుల పతి డాక్టర్ దండా రాజి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ములుగు శివారులోని యూనివర్సిటీ పరిపాలన భవన ంలో ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి అధ్యక్షతన విద్యాలయ అధికారుల సమక్షంలో ఉ ద్యానవన రంగ కీలక భాగస్వాములైన రైతులు, ఉత్పత్తిదారుల సంస్థ లు, పరిశ్రమ ప్రతిని ధులు, ప్రగతిశీల రైతులు, ఎఫ్‌పిఓ నాయకులు, వ్యాపార సంస్థలు, ఎగుమతి దారులు, ఇన్ పుట్ సరఫరా దారులు, పరిశోధన నిపుణులతో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఉద్యాన వన పంటల సాగు స్థిరమైన అభివృద్ధి కోసం, ఉద్యాన వన రంగంలో వేగవంతమైన వృద్ధిని సాధించే ప్రయ త్నాలు ముమ్మరం చేస్తూ దృక్పథ ప్రణాళికపై ముఖా ముఖి చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుత సవాళ్లను పరిష్క రించడానికి ఈ సదస్సు దోహదప డుతుందన్నారు. సంస్థాగత పరిశోధన, క్షేత్ర అనుభవం, మార్కెట్ అంత ర్దృష్టులను ఉప యో గించుకునే సహకార వ్యూహం అవ సరం ఎంతో ఉందని చెప్పా రు. వ్యవసాయ పరిశ్రమ భాగస్వామ్యాలు, ఆవిష్కరణ, ఆధారిత సాగు, వాతావ రణ, స్థితిస్థాపక పంట ప్రణాళికను సులభతరం చేయ డంలో యూనివర్సిటీ నిబద్ధతను కొనియాడారు.తెలం గాణలో ఉద్యాన వన వృద్ధికి దీర్ఘకాలిక దార్శనిక పత్రా నికి దోహదం చేస్తాయని, ఇది సమగ్ర, సాంకేతికత ఆధారిత మరియు రైతు ముందు విధానంతో ఉంటుం దని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యా న సమగ్ర అభి వృద్ధి కోసం తమ నాలెడ్జ్ హబ్, ఇన్నోవేషన్ మార్గదర్శకు డిగా తన పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ కార్యక్ర మంలో రిజిస్టర్ డాక్టర్ భగవాన్, ముల్కనూర్ కోప రేటి వ్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, అప్పారావు, వివిధ శాఖల బాధ్యులు డాక్టర్ చీనా నాయక్, డాక్టర్ లక్ష్మీ నారాయణ, డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ వీణజోషి, డాక్టర్‌సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## కోరిన సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం తగదు

సయ్యద్ హైదర్, సిహెచ్.వినోద్ కుమార్, శ్రీనివాస్

ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ : సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమా చారాన్ని ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని సమా చార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ హై దర్, జిల్లా అధ్యక్షుడు సిహెచ్.వినోద్ కుమార్, జాతీ య మానవ హక్కుల సహాయ సంఘం నిర్మల్ జిల్లా చైర్మన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. నిర్మల్ మున్సిపాలిటీకి వస్తున్న సహా దరఖాస్తుల విషయంలో చట్టానికి లోబడి పనిచేయాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై అధికారులకు,ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు అవగాహన పెంచుకొని సక్రమంగా అమలు జరి గేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో స.హా.చట్ట పరిరక్షణ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాదిక్,తదితరులు పాల్గొన్నారు.

# బడీడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

సిఎంఓ కటకం మధుకర్



ప్రజాపక్షం/కాగజ్‌నగర్ : పిల్లలను తప్పనిస రిగా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సిఎంఓ కటకం మధుకర్ అన్నారు. బడి బయ ట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిం చాలని ఆయన సూచించారు. కాగజ్‌నగర్ పట్ట ణంలోని స్థానిక సర్ సిల్క్ బ్రాంచ్ స్కూల్ ప్రాథ మిక పాఠశాలలో శుక్రవారం జరిగిన పేరెంట్స్ టీచర్ సమావేశంలో ఆయన పాల్గొ న్నారు. ఈ సందర్భంగా కటకం మధుకర్ మాట్లాడుతూ జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలలు, తక్కువ ఎన్‌రోల్‌మెంట్ కలిగిన పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు, ఉపాధ్యా యులు ప్రతి శుక్ర వారం టీచర్స్ మీటింగ్‌లో తప్పకుండా పాల్గొనాల న్నారు. అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, యువత సభ్యులను ఆహ్వానించి, పాఠశాల పరిసరాల్లోని పిల్లల వివరాలు సేకరించాలని, జూన్ నెలలో జరిగే బడిబాట కార్యక్రమంలో పిల్లలను పాఠశా లల్లో చేర్పిం చేందుకు తగిన చర్యలు తీసుకోవా లని, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లి దండ్రు లకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబా టులో ఉన్న సౌకర్యాల గురించి వివరించి, వారి పిల్ల ను ప్రభుత్వ పాఠశాలలకు తరలించా ల్సిన అవసరం ఉందన్నారు. 10వ తరగతి వరకు చదువు మధ్యలో ఆగిన వారిని ఓపెన్ స్కూల్, ఇంటర్ పరీక్షల్లో చేర్పించేలా చూడా లన్నారు. మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ సర్ సిల్క్ బ్రాంచ్ స్కూల్‌లో అన్ని వసతులు అందుబా టులో ఉన్నాయని, తగి నంత మంది ఉపా ధ్యాయులు ఉన్నారని విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని తెలిపారు. జూన్‌లో బడిబాట నిర్వహించి విద్యార్థు లతో పాఠశాలలు కళకళలాడేలా చూడా లని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి, అంగన్ వాడీ ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మెరుగైన పాలన కోసం గ్రామసభ బలోపేతం

జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్



ప్రజాపక్షం/ఆసిఫాబాద్: మెరుగైన స్థానిక పాలన కోసం గ్రామసభలను బలోపేతం చేయడం జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్ తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణఅభివృద్ధి శాఖ భాగస్వామ్యం తో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యా లయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా శిక్షణ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శుల కోసం నిర్వహించిన 2రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు.జిల్లా పంచా యతీ అధికారి మా ట్లాడుతూ శిక్షణలో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018 ప్ర కారం గ్రామసభ పాత్ర, మెరుగైన స్థానిక పాలన కోసం ప్రజల భాగస్వా మ్యంతో కూడిన పాలనను ప్రోత్సహించడం జరుగుతుం దన్నారు. సమా చార హక్కు చట్టం, స్వ చ్ఛందంగా సమాచారం వెల్లడించడం ద్వారా పారదర్శకతను ప్రోత్సహించడం, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అధికా రులు, స్వయం సహాయక బృ ందాలు, పౌర సమాజ సంస్థలతో సమన్వయంతో గ్రామ సభలను బలోపేతం చేయడం జరుగుతుందని తెలిపా రు. వివిధ భాగస్వా ముల పాత్ర, మహిళా గ్రామ సభల కోసం ప్రజలను సమీకరించే వ్యూ హాలు, గ్రామ పంచాయతీ స్థాయిలో సమాచార హక్కు అమలు ద్వారా పారదర్శకత, బాలల హక్కులతో పాటు పలు అంశాలపై నిపుణులు అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో పం చాయతీ కార్యదర్శులు, రిసోర్స్ పర్సన్స్ వి.మహేం దర్ రెడ్డి, సిహెచ్.రిషి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతిలో జాప్యం లేకుండా చర్యలు

సంగారెడ్డి జిల్లా కలెక్టర్



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి : మిల్లుల వద్ద ధాన్యం దిగుమతిలో జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకో వాలని రైతు లకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశిం చారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకోవడంలో జాప్యానికి తావు లేంకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతుల నుండి సేకరిం చిన ధాన్యాన్ని వెంటది వెంట నిర్దేశిత మిల్లులకు తర లించాడంతో పాటు తక్షణమే మిల్లుల వద్ద ఆన్ లోడింగ్ జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. కొండాపూర్ మం డలం గొల్లపల్లి గ్రామంలో పిఎస్ఎస్ ద్వారా నిర్వహి స్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గోడౌన్ జిల్లా కలె క్టర్ శుక్రవారం సందర్శించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. ధాన్యం అమ్మకం విషయంలో పలు విషయాలను అడి గి తెలుసుకున్నారు. ఆయా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లుకు తరలిం చిన ధాన్యం వివరాల రికార్డులను పరిశీలించారు. జిల్లాలో రైతులు కొ నుగోలు కేంద్రాల కు దాన్యాన్ని తరలి స్తున్నందున కొను గోలు ప్రక్రియలో ఎక్కడ కూడా జా ప్యం జరగకుండా చూడాలన్నారు. రైతులు ఇబ్బందు లకు గురికాకూడ దని నిర్ణీత గడువు లోపు దాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా పూర్తియ్యేలా అధికారుల ందరూ సమన్వయం తో కృషి చేయాలని హితువు పలికారు. ధాన్యం దిగుమ తులు కొనుగోలు కేంద్రాలకు వస్తున్నందున వెంటనే ధాన్యం సేకరణ జరుపుతూ మిల్లుల వద్ద ఆన్‌లోడిం గ్‌లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్‌లు రెవెన్యూ అధికా రులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేర్వేరు చోట్ల గంజాయి పట్టివేత

మూడు బైకుల స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి : ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు కేసులు నమోదు చేసి 3,315 కేజీల గంజా యి ముగ్గురు వ్యక్తులను మూడు బైకులను స్వాధీనం చేసుకున్న ఘటన సంగారెడ్డి పట్ట ణ చోటు చేసుకుంది. ఎస్సార్ నగర్‌కు చెందిన సందీప్ వద్ద 1,500 కేజీల గంజాయి కేసులోను అరెస్ట్ చేసి అతడి వద్దన ఉన్న స్కూటీనిసెల్ ఫోన్లు స్వా ధీనం చేసుకున్నారు. అదే విధంగా బీరంగూడకు చెందిన ఆసయికుమార్, శ్రీకాంత్ వద్ద 1200 కేజీల గంజాయిని పట్టుకొని వారి వద్ద ఉన్న బైకును రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చే సుకున్నారు. మరో కేసులో 615 గ్రాముల గంజాయిని వేరువేరు చోట్ల పట్టుకుని, వారి వద్ద ఉన బైకును కూడ స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు కేసుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి సంగారెడ్డి, పోలీసు లకు గంజాయితోపాటు అప్పగించారు. గంజాయి పట్టుకున్న దాడుల్లో వీణారెడ్డి, బి.గాంధీ సి ఐలో అనిల్ యాద య్యా, ఎస్ ఐలు ప్రహ్లాద్ కరీం యాదయ్య, గోపాల్ రామరావు ఉమా మల్కయ్య కానిస్టేబుళ్లు పాల్గొన్నా రు. సంగారెడ్డి ఎక్సైజ్ శాఖ సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ సానవాజ్ ఖాసీం మెదక్ జిల్లా డిప్యూటీ కమిషనర్ హరికిషన్ అసిస్టెంట్ కమిష నర్ శ్రీనివాస్ రెడ్డిలు అభినందించారు.

## వైకల్యం శరీరానికి..లక్ష్యసాధనకు కాదు

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి : వైకల్యం శరీరా నికి మాత్రమే లక్ష్యసాధనకు కాదని విద్యార్థులకు మధుకుమార్ స్ఫూర్తి దాయకమని , మధుకు ఉన్నల చదువుల కోసం సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మధుకు మధు తల్లిదండ్రులకు శాలువాతో సత్కారం చేసిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళ్లు చేతులు కొల్పొయినా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో పదో తరగతి పరీక్షలో 86 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన కంకోల్ గ్రామానికి చెందిన మధుకు మార్‌ను ప్రశంసించి కంప్యూటర్‌ను అందజేశా రు. పదవ తరగతిలో ఎంతో కష్టపడి ఉత్తమమైన మార్కులు సాధించారని, ఇదే స్ఫూర్తితో ఉన్నత స్థా యి విద్యలో కూడా కష్టపడాలన్నారు. కంకోల్ గ్రామానికి చెందిన మదుకుమార్ కరెంటు షాక్ బారిన పడి మరణాన్ని జయించాడని, ఈ బాలు డు ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలి తాల్లో మంచి మార్కులు సాధించాడని, వైకల్యం శరీరానిక కాని లక్ష్యసాధనకు కాదని నిరూపించా దన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మారి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మధుకు మార్ , తల్లిదండ్రులు కంకోల్ పాఠశాల ఉపాధ్యా యులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఫోకస్

# సైన్స్




**ఆధునిక సమాజంలో మూఢ నమ్మకాన్ని నమ్మే బదులు సైన్స్‌ను నమ్మడమే ఉత్తమమైన మార్గం. పురోగవృద్ధికి మార్గం. ఎన్నో మూఢ నమ్మకాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను మానసిక వేదనకు, భయాందోళనలకు గురి చేస్తునే ఉన్నాయి..**

మన శరీరం కోట్లాది జీవ కణాల (cells) సమాహారం. ఒక్కో కణం మన శరీరంలో ఒక సూక్ష్మ కార్ఖానాలా పని చేస్తుంది. ఇందులో ఎనర్జీ తయారీ కోసం మైటోకాండ్రియా, ప్రోటీన్ల తయారీ కోసం రైబోసోమ్స్, సమాచారం నిల్వ చేసే న్యూక్లియస్ వంటి భాగాలు ఉంటాయి. మన శరీరం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవాలంటే, ఈ కణాల లోపలి జీవరసాయన శాస్త్రాన్ని తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. కణం అనేది జీవులలో ప్రాథమిక మరియు మూలమైన నిర్మాణాత్మక, క్రియాత్మక ఘటకం. మన శరీరంలో సుమారు 37 ట్రిలియన్ కణాలు ఉంటాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ కణాలు వివిధ రకాలుగా ఉంటాయి. వాటి రూపం, పరిమాణం, విధులు ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయి. శరీర నిర్మాణంలో కణాల పాత్రప్రతి అవయవం

## కణాలు.. సూక్ష్మ కార్ఖానాలు



అనేక కోశాలతో తయారవుతుంది. ఉదాహరణకు, చర్మం చర్మ కణాల కలయిక, కండరాలు కండర కణాలతో ఏర్పడతాయి. నాడీ వ్యవస్థ నర కణాలతో తయారవుతుంది. ఈ విధంగా శరీర నిర్మాణంలో ప్రతి భాగానికి మూలం కణమే. జీవక్రియల నిర్వహణకణాలు శరీరంలో జరిగే జీవక్రియలను నడిపిస్తాయి. వ్యర్థ పదార్థాలను తొలగించడం, శక్తిని నిల్వ చేయడంఉష్ణోగ్రత నియంత్రించడం వంటి కార్యకలాపాలన్నీ కణాల స్థాయిలోనే జరుగుతాయి. కాగా, ఎర్ర రక్త కణాలు ఊపిరితిత్తుల నుండి ఆక్సిజన్‌ను తీసుకొని శరీరంలోని అన్ని భాగాలకు అందిస్తాయి. తెల్ల రక్తకణాలు శరీరానికి రోగనిరోధకత కల్పించి, వైరస్‌లు, బాక్టీరియా వంటి దుష్ట కణాలను ఎదుర్కొంటాయి. ప్లేట్‌లెట్లు రక్తం గడ్డకట్టడంలో సహాయపడతాయి. నర కణాలు సమాచారం మార్పిడికి ఉపయోగపడతాయి. నర కణాలు మెదడు నుండి శరీరంలోని ఇతర భాగాలకు సమాచారం పంపుతాయి. ఇవే మనకి స్పందనలు, అంచనాలు, జ్ఞాపకాలు, భావోద్వేగాల స్థాయిని కూడా నియంత్రిస్తాయి. ఇలాగా, గాయపడినప్పుడు కొత్త కణాలు పాత కణాల స్థానంలో తయారవుతాయి. ఈ ప్రక్రియ కణ విభజన (cell division) ద్వారా జరుగుతుంది. ఇది శరీరం తనను తాను మరమ్మతు చేసుకునే ప్రత్యేకతను కలిగిస్తుంది. ప్రతి కణంలో డిఎన్ఎ అనే అనువంశిక పదార్థం ఉంటుంది. ఇది శరీర లక్షణాలను నిర్దేశించే సమాచారాన్ని కలిగి ఉంటుంది. ఈ సమాచారం ఆధారంగా కణం అవసరమైన ప్రోటీన్లు తయారుచేస్తుంది. మూలకణాలు ప్రత్యేకత లేని కణాలు. అయితే, అవసరమైతే ఇవి ఏ అవయవ కణంగా అయినా మారగలవు. శరీర మరమ్మతులో, వచ్చే తరాల వైద్యాల్లో వీటి పాత్ర ఎంతో విలువైనది. సూక్ష్మంగా చెప్పాలంటే, కణం ఎంత చిన్నదైనా, అది జీవితం అంతా నడిపించే మహా శక్తి కలిగిన అణువు. మన శరీరం పనిచేయడం, ఆరోగ్యంగా ఉండటం, ఎదగడం అన్నీ కణాల సహకారంతోనే సాధ్యం. కాబట్టి, శరీర ఆరోగ్యాన్ని కాపాడటానికి, కణాల ఆరోగ్యాన్ని కూడా కాపాడటం అత్యంత అవసరం.



## సైన్స్‌ను నమ్ముదాం..

మూఢ నమ్మకాలు వినాశనానికి తప్ప మానవ వికాసానికి తోడ్పడవన్నది నిజం. కుల, మత రహిత సమాజం ఏర్పడినప్పుడే మనిషి మనిషిగా బతికే అవకాశం ఉంటుంది. మతం పేరుతో జరుగుతున్న అకృత్యాలు, అరాచకాలు, దోపిడీలు, అణచివేతలను మనం చూస్తునే ఉన్నాం. మత రాజ్యంగా ప్రకటించుకున్న పాకిస్తాన్, నేపాల్ వంటి దేశాల పరిస్థితులను గమనిస్తునే ఉన్నాం. ఆధునిక సమాజంలో మూఢ నమ్మకాన్ని నమ్మే బదులు సైన్స్‌ను నమ్మడమే ఉత్తమమైన మార్గం. పురోగవృద్ధికి మార్గం. ఎన్నో మూఢ నమ్మకాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను మానసిక వేదనకు, భయాందోళనలకు గురి చేస్తునే ఉన్నాయి. ఉదాహరణకు శరీరానికి తగిలే గాయం తీవ్రతలో తేడాలు ఉండవచ్చేమోగానీ, మంచి చెడులు ఉండవు. తలకు మరేదైనా వస్తువు వల్ల గాయమైతే కష్టంగానీ, ఒక బొమ్మ కారణంగా గాయమైతే శుభం జరుగుతుందనే మూఢ నమ్మకం చాలా ప్రాంతాల్లో ఉంది. ఇది కేవలం ఒక అపోహ మాత్రమే. కారణాలు ఏవైనా, తలపై గాయం శారీరకంగా ప్రమాదకరం. తలలో మెదడు ఉంటుంది. ఒక్కోసారి చిన్న గాయం కూడా మూర్ఛ, బ్రెయిన్ ఇంజరీకి దారితీయవచ్చు. దీన్ని శుభమని భావించడం ఆరోగ్యానికి ప్రమాదం. ఎవ్వరైనా పని మీద వెళుతున్నప్పుడు పిల్లి ఎదురొచ్చినా, ముందు నుంచి వెళ్లినా అనర్థమన్నది కూడా మూఢ నమ్మకమే. పిల్లులు దారి దాటటం ప్రకృతి సహజం. నల్ల పిల్లులకు చెడు శక్తుల చిహ్నమని నమ్మడం



అసత్యం. ఇది ఒక జాతివాద దృక్పథం మాదిరి మారిందే తప్ప ఎంతమాత్రం నిజం లేదు. చనిపోయిన వ్యక్తి మన దగ్గర ఈక రూపంలో వస్తాడనే నమ్మకం కూడా చాలా మందిలో ఉంది. ఇందులోనూ హేతువు ఏమాత్రం లేదు. పక్షులు రెక్కల నుండి ఈకలు రాలడంలో అసాధారణం లేదు. ఇది ఒక సహజ ప్రక్రియ. దీన్ని ఆధ్యాత్మికంగా అన్వయించడంలో అర్థం లేదు. గ్రహణం సమయంలో తినకూడదని, గర్భవతులు బయటకు రాకూడదని మరో నమ్మకం చాలా ప్రాంతాల్లో బలంగా ఉంది. ఇది కూడా మూఢ నమ్మకమే. సూర్యుడు–చంద్రుడు మధ్య భూమి లేదా చంద్రుడు పడటం వల్లే గ్రహణం జరుగుతుంది. ఇది సహజ ఖగోళ ఘటన. తినడానికి ఎలాంటి హానికరం కాదు. గ్రహణ సమయంలో తినకూడదన్నది పూర్వం నీటి కాలుష్యాన్ని నివారించేందుకు తీసుకున్న జాగ్రత్తగా ఉండే అవకాశం ఉంది. అంతకు మించి మరే ఇతర కారణం లేదు. పచ్చిమిరపకాయలు, నిమ్మకాయలు తలుపుకి, వాహనాలకు కట్టడం వల్ల కట్టడం దుష్టశక్తుల నివారించవచ్చనే నమ్మకం కూడా ఎక్కువగానే ఉంది. మిరపకాయలు, నిమ్మకాయల వాసన వల్ల కొన్ని పిట్టలు, పురుగులు దూరంగా ఉండవచ్చు. అయితే, దుష్టశక్తులు అనే భావన శాస్త్రీయంగా నిరూపితం కాలేదు. కళ్లు లేదా తల తిరగడం... వెంటనే ఆగిపోవడం మంచి శకునం కాదని అంటారు. దీనికి కూడా ఎలాంటిహేతువు కనబడదు. అదే విధంగా ఎవరైనా వెనక్కి తిరిగి పిలిస్తే వెంటనే ఆగకూడదు, చెడు జరుగుతుంది అనే అభిప్రాయం చాలా మంది



ఉంటుంది. ఇది కేవలం అపోహ మాత్రమే. మనస్సులో భయం వల్లే ఇలాంటి అనుమానాలు బలపడతాయి. తల తిరగడం లేదా ఆగడం వల్ల శారీరకంగా లేదా భౌతికంగా ఎటువంటి ప్రభావం ఉండదు. ఎడమచేత్తో తినడం చెడుకు దారి తీస్తుందనేది సైతం మూఢ నమ్మకమే. ఇది సంప్రదాయ ప్రాతిపదికైన సామాజిక నిబంధన మాత్రమే. శరీరశాస్త్ర పరంగా రెండు చేతులూ సమానంగా పనిచేయగలవు. ఎడంచేతి వాటంగల వారు ప్రపంచ జనాభాలో 10 శాతం మంది ఉన్నారు. ఇక, ముహూర్తం, అరిష్ట కావం, రాహుకాలం వంటి నమ్మకాలు.. రాహుకాలంలో పనులు ప్రారంభిస్తే అపజయం తప్పదన్న అనుమానం ఉంటుంది. కానీ, ఒక రోజులో కొన్ని సమయాల్లో పనులు చెడతాయని శాస్త్రీయ ఆధారాలు లేవు.కొన్ని మత సంప్రదాయాల్లో ఈ సమయాలను జాగ్రత్తగా నిర్ణయించి ఉండొచ్చు. కానీ ఇది తార్కికమే తప్ప వాస్తవం కాదు. కరెన్సీ నోటుపై ఏదైనా అచ్చు (ink blot) పడటం అం అదృష్టమనే భావన కొంతమందిలో లేకపోలేదు. కొత్త నోటు లేదా రూపాయిపై అచ్చు పడడాన్ని అదృష్ట సూచనగా కొంతమంది పేర్కొంటారు. కానీ .అచ్చు అనేది ముద్రణలో జరిగిన చిన్న లోపం. ఇది ఆ కరెన్సీ విలువను మార్చదు. అదృష్టానికి సంబంధం లేదు. తలపాగా లేదా టోపీ కింద పడితే అనర్థం జరుగుతునడంలోనూ శాస్త్రీయ తర్కం లేదు. భయం వల్ల ఏర్పడే భావోద్వేగం మాత్రమే. ఇలాంటి చాలా మూఢనమ్మకాలు శతాబ్దాలుగా ప్రచారంలో ఉన్నాయి. ఆత్మస్థైర్యంతో ఆ ఊబి నుంచి బయటపడాలి. అందుకు సైన్స్‌ను మాత్రమే నమ్మాలి. సైన్స్ ఎప్పుడూ పరిశీలన, పరీక్ష, ఆధారాలపై ఆధారపడుతుంది. మూఢనమ్మకాలు అన్నీ భయానికి, అనిశ్చితి కి పుట్టిన ఫలితాలు. వాటిని తర్కంతో, విద్యతో ఎదుర్కొనాలి. సైన్స్ మనకు సమస్యలకు నిజమైన పరిష్కారాలు చూపిస్తుంది. భయాలపై కాకుండా నిజాలపై ఆధారపడి ముందుకు నడిచే మార్గాన్ని చూపిస్తుంది.


## భూమి చుట్టూ గాలి ఎందుకు ఉంది?



భూమికి వాయుమండలం (Atmosphere) ఉండడానికి ప్రధాన కారణం దాని గరుత్వాకర్షణ. మన గ్రహం సమీపంలోని గాలిని పట్టుకొని ఉంచుతుంది. ఈ వాయుమండలం మనకు ఆక్సిజన్‌ను అందిస్తుంది. గాలి ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. అంతరిక్ష వికిరణల నుండి రక్షిస్తుంది. గురుత్వాకర్షణ వల్ల భూమికి తన గుండ్రటి ఆకృతి, విస్తృత భూమితలంతో కూడిన భారీ ద్రవ్యరాశి (mass) ఉంది. ఈ ద్రవ్యరాశి వల్ల ఏర్పడే గురుత్వాకర్షణ శక్తి భూమి మీద ఉన్న గాలిని (వాయుమండలాన్ని) బలంగా తన వైపుకు లాగుతుంది. గాలి అణువులు అంతరిక్షంలోకి వెళ్లకుండా భూమి వాటిని తన దగ్గరే ఉంచుతుంది. భూమి యాజ్ఞిక పరిమాణం, ఉష్ణోగ్రత సరైనవే భూమి చిన్నదిగా లేదా ఎక్కువ వేడిగా ఉండి ఉం, గాలి అణువులు చాలా వేగంగా కదిలి అంతరిక్షంలో కలిసిపోయేవి. కానీ భూమి పరిమాణం, ఉష్ణోగ్రతలు గాలిని నిలుపుకునే విధంగా ఉన్నాయి. ఉదాహరణకు, మార్స్‌కు భూమికం తక్కువ ద్రవ్యరాశి ఉన్నందున అక్కడ వాయుమండలాన్ని నిలుపుకోవడం కష్టం. భూమి చుట్టూ మాగ్నెటిక్ ఫీల్డ్ ఉండటం భూమి లోపల నుండే వచ్చే చుంబక శక్తి వాతావరణంలో సౌర గాలులను అడ్డుకుంటుంది. వీటివల్ల గాలి అంతరిక్షంలోకి కలిసిపోయే ప్రమాదం తగ్గుతుంది. ఈ రక్షణ లేకపోతే సూర్యుని నుంచి వచ్చే అధిక శక్తివంతమైన కణాలు వాయుమండలాన్ని తుడిచివేసేవి. మొక్కలు, జీవులు శ్వాస క్రియల ద్వారా ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ లాంటి వాయువులను విడుదల చేస్తాయి. భూమి మీద జీవం ఉండటం వలన గాలి యొక్క సమతుల్యత కొంతవరకు నిలిచిపోతుంది. సంక్షిప్తంగా చెప్పాలం, భూమి చుట్టూ గాలి ఉండటం అనేది అనేది భూమి గురుత్వాకర్షణ, సరైన పరిమాణం– ఉష్ణోగ్రత, చుంబక క్షేత్రం, జీవక్రియల ప్రభావం తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది.

## విశ్వం.. ఓ అంతులేని రహస్యం..

ఎంతగా అన్వేషిస్తున్నప్పటికీ విశ్వానికి సంబంధించిన రహస్యాలు ఇంకా చాలానే తెలియాల్సి ఉంది. శాస్త్రవేత్తలు శతాబ్దాలుగా పరిశోధనలు చేస్తునే ఉన్నారు. ఎన్నో కొత్త విషయాలను కనుగొంటున్నారు. ఇంకా అంతుచిక్కకుండా ఉన్న విశ్వ రహస్యాలను శోధిస్తునే ఉన్నారు. మనమందరం జీవించే ఈ భౌతిక విశ్వం సుమారు 13.8 బిలియన్ల సంవత్సరాల క్రితం బిగ్ బ్యాంగ్ అనే మహాపరిణామంతో ఆవిర్భవించిందని శాస్త్రవేత్తల నమ్మకం. కానీ ఆ బిగ్ బ్యాంగ్‌కు ముందు ఏమి జరిగింది? ఆ పేలుడు ఎలా జరిగింది? ఆ శక్తి ఎక్కడి నుండి వచ్చింది? ఇవన్నీ ఇప్పటికీ శాస్త్రసిద్ధాంతాలకు అందని ప్రశ్నలు. విశ్వం ఎక్కడ మొదలవుతుంది? ఎక్కడ ముగుస్తుంది? అసలు ముగింపు ఉందా? లేక ఇది నిరంతరంగా విస్తరించిపోతుందా? అన్నివేళలా మానవ మేధస్సును అడుగులాడే సందేహాలే ఇవి. ఎప్పుడో ఒకప్పుడు ప్రతి ప్రశ్నకూ సమాధానం లభిస్తుందని ఆశిద్దాం.



## కేంద్ర కార్మిక విధానాలకు వ్యతిరేకంగా 20న
# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

### సన్నాహక సమావేశంలో ఎఐటియుసి నాయకులు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని మే 20న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జిల్లాలోని సంఘటిత, అసంఘటిత కార్మికులందరూ పాల్గొనాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని బైపాస్‌రోడ్‌లో గల సిమెంట్ గోదాం వద్ద సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను శుక్రవారం హమాలీ కార్మికులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ యజమానుల ప్రయోజనాల కోసం నల్లచట్టాలను తెస్తుందన్నారు. సిమెంట్ గోదాం హమాలీ అధ్యక్షుడు జంగం తిరుపతి, ఉపాధ్యక్షుడు బాగోతం వీరయ్య, నాయకులు నన్నవేని శ్రీనివాస్, ననవేని కొమురయ్య, పల్లెర్ల రాములు గౌడ్, ముత్యాల శ్రీనివాస్, దానవేని కొమురయ్య,, ఉప్పారం శ్రీనివాస్, జక్కుల ఐలయ్య, దొంగల శ్రీనివాస్, బోయిని ఐలయ్య తదితరులున్నారు.



బెల్లంపల్లి

**హనుమకొండ టౌన్ :** కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సోమేశ్వర్‌కు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బత్తిని సదానందం, నాయకులు కుక్కల మల్లయ్య, తోడెం రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**కోదాడ:** 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కోదాడ ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు, బిఆర్‌కెవి నాయకులు కె.శ్రీనివాస్, ఎం.ముత్యాలు, వక్కంతుల నర్సింహరావు, షేక్ నయీం, షేక్ లతీఫ్, రాఘవరెడ్డి, ఉప్ప శ్రీను, రజిని, ఉదయ్, రెహమాన్ పాల్గొన్నారు.

**బెల్లంపల్లి :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. శుక్రవారం బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమలు, సహజ సంపదలను కార్పొరేట్ వర్గాలకు అందజేయడం కోసమే కార్మిక చట్ట సవరణలు చేస్తున్నారని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని అన్నివర్గాల కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు చిప్ప నర్సయ్య, ఆడెపు రాజమౌళి, హమాలీ కార్మికులు చంద్రశేఖర్, నరేష్, సతీష్, రమేష్, రవి, శ్రీనివాస్, మొగిలి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్...



కోదాడ...



హనుమకొండ

## ఆపరేషన్ కగార్ ఆపండి

### కేంద్రం మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి
### మానుకోటలో వామపక్షాల భారీ ర్యాలీ, సభ



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** ఆపరేషన్ కగార్ ఆపివేయాలని, కేంద్రప్రభుత్వం మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా బి.విజయసారథి, వామపక్ష పార్టీల నాయకులు ఆకుల రాజు, చిన్న చంద్రన్న, గౌని ఐలయ్య, కొచె వెంకన్న, బొర్ర ఆనంద్, మదార్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక వివేకానంద సెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో విజయసారథి మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట గిరిజనులపై జరుగుతున్న దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని కోరారు. దండకారణ్యంలో ఖనిజ సంపద దోచుకోవడానికి మోడీ, అమిత్‌షా ఆధ్వర్యంలో ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. దాడుల పేరిట ఆదివాసి గిరిజనులను చంపుతు న్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బలగాలను వెంటనే వెనక్కి పిలిపించాలని ఆయన డిమాండ్ చేశారు. మావోయిస్టులతో చర్చలు జరిపి దాడులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, గునిగంటి రాజన్న, సమ్మెట రాజమౌళి, హెచ్ లింగయ్యానాయక్, భాస్కర్‌రెడ్డి,నందగిరి వెంకటేశ్వర్లు, దేవేందర్, పెరుగు కుమార్,రేషపల్లినవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబ లక్ష్మి, కట్లోజు పాండురంగాచారి, చొప్పరి శేఖర్, వైశ్య స్వామి, బంధు మహేందర్, వెలుగు శ్రావణ్, లింగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

### సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం వీపనగండ్ల మండలం బొల్లారంలో సిపిఐ మండల మహాసభ మండల కార్యదర్శి వంకా గోపాల్ అధ్యక్షతన జరిగింది. సమావేశాకి ముఖ్య అతిథిగా విజయరాములు హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ, ప్రజా వ్యతిరేక, మతోన్మాద విధానాలపై కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాలని కోరారు. వందేళ్లుగా సిపిఐ ప్రజల పక్షాన పోరాటం చేస్తోందన్నారు. ఇంతటి ఘన చరిత్ర మరే పార్టీకి లేదన్నారు. 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. కార్మికులు పోరాటి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుతుందన్నారు. సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, జీతం పెంచమని అడిగే హక్కు లేకుండా చేసేందుకు కుట్రలు చేస్తుందన్నారు. దేశంలో కార్పొరేట్ యాజమన్యాలకు తొత్తుగా మారి, కార్మిక హక్కులు హరిస్తుందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు గ్రామస్థాయిలో పోరాటాలు చేసేందుకు ప్రజలను సిద్ధంచేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, రమేష్, వంక గోపాల్, మండల నాయకులు ఎం.కురుమయ్య, చల్మారెడ్డి, రంజాన్, కృష్ణయ్య, తిరుపతయ్య, వేమన్న తదితరులు పాల్గొన్నారు. సభలో ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు.

## దేశానికి ఉగ్రవాదం అత్యంత ప్రమాదకరం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** ఉగ్రవాదం దేశానికి అత్యంత ప్రమాదకరమని, దానిని తుదముట్టించేందుకు కేంద్రప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌ను స్వాగతిస్తూ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కామాక్షి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సిపిఐ జనగామ 4వ పట్టణ మహాసభలలో ఆయన ప్రసంగించారు. ముందుగా ఎర్రజెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పహల్గాంలో అమాయక భారత ప్రజలపై విచక్షణరహితంగా టెర్రరిస్టులు దాడులకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన మానవత్వాన్ని మంటగలిపిందన్నారు. అమాయక ప్రజల ప్రాణా లు తీసిన పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకుంటుందన్నారు. హిందు, ముస్లీం గొడవలు సృష్టించేందుకు పాకిస్థాన్ టెర్రరిస్టు మూకలు ప్రయత్నిస్తున్నాయన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సహనానికి మారుపేరైన భారతదేశానికి ఉగ్రవాదం నుంచి శాశ్వతంగా విముక్తి జరగాలని, ఇందుకు కేంద్రానికి సిపిఐ బాసటగా నిలుస్తుందన్నారు. పాక్ ఉగ్రవాదాన్ని ఖచ్చితంగా నిర్మూలించాల్సిందేనని, కేంద్ర ప్రభుత్వం పక్కా కార్యచరణతో ముందుకు సాగేలా అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం అవుతుందని ఆకాంక్షించారు.



### కగార్ ఆపరేషన్ నిలిపివేయాలి...

ఈదేశ పౌరులైన మావోయిస్టులను ఏరివేసేందుకు ఆపరేషన్ కగార్ చేపట్టడం సరైంది కాదని, తక్షణమే దీనిని నిలిపివేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మావోయిస్టులు చర్చలకు వస్తామంటే చర్చలకు ఒప్పుకునేది లేదని ఒక కేంద్రమంత్రి నియంతలా మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కూంబింగ్ పేరుతో కర్రెగుట్టలను చుట్టుముట్టి 22 మందిని ఎన్‌కౌంటర్ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దండకారణ్యంలో ఆదివాసుల కాళ్ళ కింద ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందని ఆయన ఆరోపించారు. అందుకోసమే ఆదివాసులను అడవి నుండి మాయం చేయాలనుకుంటుందన్నారు. ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి శాంతిచర్చల ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లాలని ఆయన కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం టెక్స్‌టైల్ పరిశ్రమలను నెలకొల్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆదిసాయన్న, ఆకుల శ్రీనివాస్, నాయకులు చొప్పరి సోమయ్య, మోతె శ్రీశైలం, యాకూబ్, మల్లయ్య, సఖి, వెంకన్న, ఐలయ్య, నగేష్, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## రైతులకు విత్తనాలపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** మారుతున్న కాలనికి అనుగుణ్యమైన రైతులు శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయానికి అను కూలంగా ఉండే విధంగా నాణ్యమైన విత్తనాలు ఎరువులు వేయాలని అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎ. శ్రీజన్, డాక్టర్ ఎన్. హేమశరత్ చంద్ర అన్నారు. శుక్రవారం హసన్ పర్తి మండలం సిద్ధాపూర్ లోని బైరాన్ పల్లి క్లస్టర్ రైతువేదికలో ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, వరంగల్ వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా వినియోగంలో నియంత్రణ, సిఫారసు మేరకు రసాయనాల వినియోగం, మట్టి పరీక్షలు ప్రాముఖ్యత ,సాగునీరు ఆదా, పంట మార్పిడి ,విత్తన రసాయనాల కొనుగోలు రసీదులను భద్రపరుచుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయధికారిణి ఎ. అనురాధ, వ్యవసాయ విస్తరణ అధికారిని బి. అనూష 60 మంది రైతులు పాల్గొన్నారు.

## ములుగు గట్టమ్మ తల్లిని దర్శించుకున్న జిల్లా ఇన్‌చార్జి జడ్జి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా కేంద్రంలోని ములుగు గట్టమ్మ దేవాలయం ఆదివాసీ నాయకులు, గట్టమ్మ పూజారుల ఆధ్వర్యంలో ములుగు జిల్లా ఇన్‌చార్జి జడ్జి డాక్టర్ కె పట్టాభి రామారావు, ములుగు జిల్లా జడ్జి టి కన్యలాల్, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, గుంటి జోత్స్న, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిలకు గట్టమ్మ దేవాలయం వద్ద పూజలు నిర్వహించారు. ఆదివాసీ ఆచార సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం గట్టమ్మ పూజలు నిర్వహించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి ఇన్‌చార్జికి ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ చరిత్ర గురించి వివరించారు. తాతల తరం నాటి నుండి గట్టమ్మ పూజారులుగా కొనసాగుతున్నామని అన్నారు. పూజారులుగా ఉండడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని అన్నారు. మేడారం వెళ్లే ప్రతి భక్తులు కూడా అమ్మవారిని దర్శించ కున్న తర్వాత మాత్రమే మేడారం వెళ్తారని అన్నారు. మనస్ఫూర్తిగా మొక్కులు చెల్లించుకుంటు భక్తులకు మొక్కుకున్న మొక్కులు త్వరగా తీరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్టమ్మ ప్రధాన పూజారి కొత్త సదయ్య, కొత్త సురేందర్, అరిగెల సమ్మయ్య, కొత్త రమేష్, అరిగెల రవి, ఆకుల రవి, కొత్త రవి, పూజారులు పాల్గొన్నారు.

## ఆరు నెలల పాటు కాల్పులు విరమిస్తున్నాం

### మావోయిస్టు పార్టీ సంచలన నిర్ణయం

**ప్రజాపక్షం/వెంకటాపూర్:** ఆరు నెలలపాటు కాల్పులు విరమిస్తున్నట్లు మావోయిస్టు పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు కూంబింగ్ ముమ్మరం చేసిన వేళ మావోయిస్టు పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు నెలల పాటు కాల్పులు విరమిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు గురువారం సాయంత్రం మావోయిస్టు పార్టీ అగ్రనేత జగన్ పేరిట లేఖ విడుదలైంది. ‘‘తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ప్రజా సంఘాలు, మెజార్టీ రాజకీయ పార్టీలు మావోయిస్ట్ పార్టీకి, ప్రభుత్వానికి నడుమ శాంతి చర్చలు జరగాలనే డిమాండ్‌ను ప్రముఖంగా చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టికొని మా నుండి 6 నెలల వరకు కాల్పుల విరమణను పాటిస్తున్నామని ప్రకటించుచున్నాము అని లేఖలో పేర్కొన్నారు.

## 27న ఆటో ఆకలికేకల మహాసభలు



**ప్రజాపక్షం/తొర్రూరు :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న హైదరాబాద్‌లో తలపెట్టిన ఆటో ఆకలికేకల మహాసభను ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆటో జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ తొర్రూరు మండలంలోని లోకల్ ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయామని, ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకానికి ప్రత్యామ్నాయంగా ఏడాదికి ఆటో కార్మికునికి రూ. 12వేలు ఇస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని అన్నారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో తలపెట్టిన ఆటో ఆకలికేకల మహాసభను ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ టౌన్ అధ్యక్షుడు మంగళపల్లి ప్రసాద్, గొల్లపల్లి నరేశ్, గుండాల రంజిత్, సదానందం, మంగళపల్లి ప్రతాప్, మల్లేశ్, యాకన్న, వెంకన్న, మల్లేశ్, యాకయ్య, కుమార్, భద్రయ్య, రాజు, రాంమూర్తి, వెంకటేశ్, ఉపేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతు గుర్తింపు కార్డు నమోదు కేంద్రాలను పరిశీలించిన ప్రత్యేక అధికారి



**ప్రజాపక్షం/నెక్కొండ:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు విశిష్ట గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు చేస్తున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండల ప్రత్యేక అధికారిణి అనురాధ శుక్రవారం మండలంలోని తొపనపల్లి గ్రామంలో నమోదు కార్యక్రమ శిబిరాన్ని సందర్శించి రైతులకు, వ్యవసాయ శాఖ సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. నమోదు విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రధానమంత్రి కిసాన్ యోజన వంటి పథకాలకు సంబంధించి ఈ కొత్త రైతు విశిష్ట గుర్తింపు కార్డులనే పరిగణలోకి తీసుకుంటారని అన్నారు. మండలంలో పైలెట్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ పథకం గృహాలను గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ఐకెపి సిబ్బందికి తగిన సూచనలు చేశారు .రైతులు ఎండిన పంటను తాలు లేకుండా నాణ్యతతో కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తద్వారా మద్దతు ధరతో పాటు బోనస్ కూడా వస్తుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ నాగరాజు, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, ఎఇఒలు అరుణ్, వసంత, పంచాయతీ కార్యదర్శులు బాలకృష్ణ ,పెంటయ్య, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని నెక్కొండ అలంకానిపేట పరిధిలోని 33/11 కెవి సబ్ స్టేషన్ ,11/ కె.వి సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్ వర్క్ ఉన్నందున లైన్ల కింద చెట్ల కొమ్మలను నరికివేసే ప్రోగ్రాం వలన శనివారం రోజు ఉదయం 7:30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ఎలక్ట్రిసిటీ ఏఈ చిరంజీవి విలేకరుల సమావేశం తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన అన్నారు.

## నవజాత శిశువులకు అత్యవసర అధునాతన వైద్య సేవలు అభినందనీయం

### కీర్తి హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ హనుమకొండ ప్రతినిధి :** హనుమకొండ జిల్లా కేంద్రంలోని నయీమ్ నగర్ లో కీర్తి ఉమెన్స్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను శుక్రవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ హనుమకొండ జిల్లా కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసి నవజాత శిశు పిల్లల అత్యవసర చికిత్సను, మహిళల ఆరోగ్య సంరక్షణను అందుబటులోకి తెచ్చి అత్యుత్తమ 24/7 వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. నగరం నడిబొడ్డున అందరికి అందుబాటులో పిల్లల హాస్పిటల్ ఏర్పాటు చేయడం గర్వకారణం అని, ఈ హాస్పిటల్ లో అన్నిరకాల అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయని అన్నారు. అలాగే ఈ కీర్తి హాస్పిటల్ లో అనుభవం గల డాక్టర్‌లు ఉన్నారని, వీరి వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి, హాస్పిటల్ నిర్వహకులు డాక్టర్ ముక్క దిలీప్ కుమార్, డాక్టర్లు, హాస్పటల్ సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఇబ్బందులు రావొద్దు

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జిల్లాలోని ఏ గ్రామంలో తాగునీటి సమస్యలు రావద్దని, ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా సజావుగా జరగాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మండలాల వారీగా వివిధ శాఖల అధికారులు తాగునీటి సరఫరాపైన ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసున్నారని, యాక్షన్ ప్లాన్ గురించి గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ రివ్యూ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడిందని తెలియగానే వెంటనే సంబంధిత శాఖ అదికారి వెంటనే స్పందించి అక్కడకు వెళ్లి ఆ సమస్యను తీర్చి ప్రజలకు తాగునీటిని అందించాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతో మరింత భద్రత

### జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** భారతదేశ వ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణ, సరిహద్దు జిలాల్లో మావోయిస్టుల అలజడుల నేపథ్యంలో నిఘా మరింత బలపరిచేందుకు మహబూబాబాద్ జిల్లా వ్యాప్తం గా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందని, ప్రజల సహకారంతోనే మరింత భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలోని ప్రదాన రహదారులు, గ్రామీణ మారగాల్లో ప్రత్యేక వాహన తనికీలు నిర్వహించడం జరిగిందన్నారు.సాయంత్రం, రాత్రి వేళల్లో సడెన్ చెకింగ్స్ నిర్వహించి అనుమానాస్పద వ్యక్తలు, వాహనాలను గుర్తించి విచారణ చేయడం జరుగుతుందని అన్నారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక బలగాలతో నిఘా చర్యలను ముమ్మరం చేయడం జరిగిందని ఎస్‌పి తెలిపారు. బస్టాండ్,రైల్వే స్టేషన్లు, వసతి గృహాలు, ప్రజలు ఎక్కువ గా గుమిగూడే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచబడినట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో పోలీస్ క్యూనిటీ ఇంటరాక్షణ్ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచడం జరిగిందన్నరు. ఎస్‌పి, జిల్లా పోలీస్ శాక ప్రజలకు పలు చూసనలు చేశారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అనుమానాస్పద వ్యక్తలు సంచరించడం, వారి కార్యకలాపాలు కనిపించినా పరిస్థితులో 100 వెంబర్‌కు కానీ స్థానిక పోలీస్టేసన్‌కి గానీ సమాచారం ఇవ్వాలని తెలిపారు. మీ సహకారం వల్లనే పోలీఉలు సమాజాన్ని మరింత బద్రమైనదిగా తీర్చి దిద్దగలమని ఎస్‌పి బరోసా ఇచ్చారు.

## కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

### సాక్షి ఎడిటర్‌పై దాడిని తీవ్రంగా ఖండించిన పాత్రికేయులు




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** సాక్షి తెలుగు దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనంజయ రెడ్డి పై ఆంధ్రప్రదేశ్ పోలీసులు అక్రమంగా దాడులు జరిపి, శోధనలు నిర్వహించిన చర్యలను పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. పత్రికా స్వేచ్ఛను కాలరాసే విధంగా ఏపీ పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, ఏపీ ప్రభుత్వ తీరుపై ఆయా సం ఘాల నాయకులు మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సాక్షి పాత్రికేయులు, టియుడబ్ల్యుజె (ఐజెయు),టియుడబ్ల్యుజె(143), గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని ఎపి పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరించేలా ఏపీ పోలీసులు వ్యవహరించారని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయనున్నట్లు సం ఘం నాయకులు తెలిపారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ఖండించిన వారు, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బా ధ్యత ప్రభుత్వానిదని హితవు పలికారు. ఈ నిరసన కార్యక్రమంలో సాక్షి బ్యూ రో ఇన్‌చార్జి గడ్డం రాజిరెడ్డి, ఎడిషన్ బాధ్యులు లింగయ్య, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమ ర్, టియుడబ్ల్యుజె(ఐజెయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర నాయకులు వల్లాల వెంకటరమణ, పి. వేణుమాధవ్,జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్,టీయూడబ్ల్యూజే (143) అధ్యక్ష కార్యదర్శులు మస్కపురి సుధాకర్, రాజ్ కుమార్, నాయకులు వాంకె శ్రీనివాస్, పిన్నా శివకుమార్, అల్లం రాజేష్ వర్మ,సదానందం, సాయిరాం, తిరుపతి, గొట్టె వెంకట్, సంపేట వెంకటేశ్వర్లు, వరప్రసాద్,డెస్క్ జర్నలిస్టులు మహేష్, ఓంకార్, సీనియర్ జర్నలిస్టులు అల్వాల సదాశివుడు, కోలా కృష్ణకుమార్ రెడ్డి, అహమ్మద్ , బత్తిని రాజేందర్, అబ్బు వెంకట్ రెడ్డి,వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన వివిధ మండలాల రిపోర్టర్లు పెద్ద సంఖ్యలో హాజరై తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

## జర్నలిస్ట్‌లకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



**ప్రజాపక్షం/గూడూరు:** ఏజెన్సీ మండలంగా ఉన్న గూడూరులో జర్నలిస్ట్‌లందరికీ ఒకేచోట ఇంటిస్థలాలు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం కొంత కష్టమని చెబుతున్న నేపథ్యంలో మండలంలోని వర్కింగ్ జర్నలిస్ట్‌లందరికీ వారి వారి గ్రామలలో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి న్యాయం చేయాలని కోరుతూ టియుడబ్ల్యూజె (ఐజెయు) గూడూరు మండల శాఖ అధ్యక్షుడు గుర్రపు మాకాంబ్రం ఆధ్వర్యంలో శుక్రవారం టియుడబ్ల్యూజె (ఐజెయు)జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ జిల్లా ప్రధాన కర్యాదర్శి గాడిపల్లి శ్రీహరి గూడూరు మండల యూనియన్ బాధ్యులు పాపయ్య కరుణాకర్ రెడ్డి నవనీత్ నర్సింహ్ యాకుబ్ అలీ తదితరులు కలిసి మానుకోట ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా టియుడబ్ల్యూజె(ఐజెయు) జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనువాస్ మాట్లాడుతూ గూడూరు మండలంలోని వర్కింగ్ జర్నలిస్టలు ఇంటిస్థలాల కోసం ఇందిరమ్మ ఇండ్లు కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారని తమ కోరిక నెరవేరుతుందని ప్రస్తుత ప్రభుత్వంపై ఎమ్మెల్యే మురళి నాయక్ పై ఎన్నో ఆవలు పెట్టుకున్నారన్నారు. అందుకు అనుగుణంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం వారి వారి గ్రామాలలో దరఖాస్తు చేసుకున్న జర్నలిస్ట్‌లను ప్రత్యేకంగా గుర్తించి మొదటి విడతలోనే ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్ట్‌లు అనేక మంది పేద మధ్యతరగతి వర్గాలు నుండి వచ్చిన వారే అధికంగా ఉన్నారని మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్నీ మండలాల్లో రాజీవ్ యువవికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టల కు ఆ పథకాన్ని మంజూరు చేసి ఉపాధి అవకాశాలను కల్పించాలని సిహెచ్ శ్రీనువాస్ అభ్యర్థించారు.జర్నలిస్టల వినతిపై ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అత్యంతసానుకూలంగా స్పందించారు. మహబూబాబాద్ నియోజక వర్గంలో అర్హులైన జర్నలిస్ట్ లందరికీ ఇండ్లు ఇవ్వడం ద్వారా వారికీ శాశ్వత ప్రయోజనాన్ని చేకుర్చాలని తాను బలంగా భావిస్తున్నానని అన్నారు. గూడూరు మండలం కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం అంశాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ దృష్టికితేగా ఇది కూడా సమంజసమైన డిమాండ్ గానే తాను భావిస్తున్నానని మండల పర్యటనకు వచ్చినప్పుడు జర్నలిస్ట్ లతో కలిసి పరిశీలన చేస్తానని మాట ఇచ్చారు.జర్నలిస్ట్‌ల సమస్యలపై అంత్యంత సానుకూలంగా స్పందించిన మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ కు టియుడబ్ల్యూ(ఐజేయు) పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

## జూన్ 5న శ్రీవేణుగోపాలస్వామి ఆలయ శిఖర చక్ర ప్రతిష్ఠ



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:**వచ్చే నెల జూన్ 5న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ శిఖర చక్ర ప్రతిష్ట, కుంభాబిషేకం కార్యక్రమాలు నిర్వహించేందుకు మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, ముడుంబై లక్ష్మి నారాయణచార్యులు తదితర ప్రముఖుల ఆధ్వర్యంలో ముహూర్తం ఖరారు చేశారు. జూన్ 3న శిఖర శోభయాత్ర పుర వీధుల గుండా ఊరేగింపు, 4న సభాప్రార్ధన, విశ్వక్సేనరాధన, పుణ్యావాచనము, రక్షా బంధనలు, అంకురారోహణం, యాగప్రవేశం, మహా కుంభ స్థాపన, సాయంత్రం 6గంటలకు మూల మస్త్ర, మానోనాన శాంతి హోమం, తీర్థగోష్టి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 5న తెల్లవారు జామున 5గంటలనుండి మూల మస్త్రహవనములు, మహాపూర్ణాహుతి, ఉదయం 7గంట 56నిముషములకు మిధున లగ్న పుష్కరాంశమున శిఖర పునఃప్రతిస్టా, కుంభాభిషేకము, మూర్తి ఆరాధన, మంగళశాసనము, భక్తులకు, యాజమాన్యులకు వేదాశీర్వచనము నిర్వహిస్తున్నట్లు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ శిఖర చక్ర ప్రతిష్ట, కుంభాభిషేకం మహోత్సవంలో పాల్గొని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి కృపకు పాత్రులు కాగలరని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిష్టా కార్యక్రమాలకు చెందిన కరపత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, డిసిసి అధ్యక్షులు భరత్‌చందర్‌రెడ్డి, అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ కోశాధికారి, ప్రముఖ న్యాయవాది కొండపల్లి కేశవరావు, పర్కాల శ్రీనివాసరెడ్డి, సింగం మనోహర్, మొగిలి ప్రసాద్‌రెడ్డి, పర్కాల రవీందర్‌రెడ్డి, కొల్లూరి రవికుమార్, మాలె కాళీనాథ్, బోనగిరి గిరిధర్‌గుప్త, వొబిలిశెట్టి నరసింహారావు, పిల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


## రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందజేసి భూ సమస్యలు పరిష్కరించుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు.భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పైలట్ ప్రాజెక్టుగా వర్ధన్నపేట మండలం ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వర్ధన్నపేట మండలంలోని చెన్నారం గ్రామంలో భూ భారతిలో భూ సమస్యలపై రైతులు అందించిన దరఖాస్తులను, రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్కను పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు చట్టంపై అవగాహన కల్పించి, వారి సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. అనంతరం చెన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుని ఎంపికకు క్షేత్ర స్థాయిలో స్థితిగతులను పరిశీలించి నిబంధనల మేరకు అత్యంత నిరుపేదను పారదర్శకంగా ఎంపిక చేయాలని అధికారులను కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ విజయ్ సాగర్, రెవిన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ మోహన్‌రెడ్డి



**ప్రజాపక్షం/కాజీపేట :** భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ డాక్టర్ మోహన్ రెడ్డిని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ (నిట్) బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్‌గా నియమించింది. ఆరు నెలల కాలానికి లేదా కొత్త చైర్‌పర్సన్ నియామకం వరకు లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఈ పదవిలో ఆయన కొనసాగుతారు. సయెంట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, ప్రముఖ పరిశ్రమదారు అయిన డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, అనేక దశాబ్దాల నాయకత్వ అనుభవం, లోతైన పరిశ్రమ జ్ఞానం, భారతదేశంలో సాంకేతిక విద్యా పురోగతికి బలమైన కట్టుబాటుతో ఈ బాధ్యతను స్వీకరించారు. ప్రస్తుతం వారు ఐఐటీ హైదరాబాద్, ఐఐటిరూర్కీ బోర్డ్‌లకు కూడా చైర్‌పర్సన్‌గా సేవలందిస్తున్నారు. భారత ఇంజనీరింగ్, ఐటీ సేవల రంగంలో ప్రముఖంగా నిలిచిన డాక్టర్ రెడ్డి, గతంలో నాస్కామ్ ఛైర్మన్‌గా పని చేసి, భారత టెక్నాలజీ, సేవా రంగాలను ప్రపంచ వేదికపై ముందుకు తీసుకెళ్లే విధానాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. దేశానికి వ్యాపారం, పరిశ్రమలలో చేసిన అత్యుత్తమ సేవలకు గాను ఆయనకు భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ పురస్కారం లభించింది.ఈ సందర్భంగా నిట్ వరంగల్ డైరెక్టర్, సంస్థ ఛైర్‌పర్సన్ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి ఆనందం వ్యక్తం చేస్తూ: ఇలాంటి సమయంలో డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి నిట్ వరంగల్‌కు మార్గనిర్దేశం చేయడం తమకు గొప్ప గౌరవం అని, ఆయన నాయకత్వం సంస్థ యొక్క విద్యా లోతును, పరిశోధనా సామర్థ్యాన్ని, పరిశ్రమ సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందని నమ్ముతున్నామని, ప్రపంచ స్థాయి సాంకేతిక విద్యా, పరిశోధనలో కేంద్రంగా మారే దిశగా ఆయన మార్గదర్శనం అమూల్యంగా ఉంటుందని అన్నారు.

## క్షేత్రంలో నేటి నుంచి మకాం వేసి పుష్కర ఏర్పాట్లను పర్యవేక్షించాలి

### అధికారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో ఈ నెల15 నుండి 26వరకు 12 రోజుల పాటు జరుగనున్న సరస్వతీ పుష్కరాల సందర్భంగా నేటి శనివారం నుండి అధికారులు కాళేశ్వరంలో మకాం వేసి పుష్కర ఏర్పాట్లను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. కాళేశ్వరం దేవస్థానం కార్యాలయంలో శుక్రవారం జిల్లా,మండల అధికారులతో కలెక్టర్ రాహుల్ శర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆరోగ్య శిభిరాల ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన వేదిక, మైక్ ఇతర ఏర్పాట్లు,పారిశుద్ధ్య చర్యలు, సిబ్బందికి ఆహారం ఏర్పాట్లు,ఇతర పుష్కరాల ఏర్పాట్ల పర్యవేక్షణకు విధులు కేటాయించిన అధికారులు పటిష్ట పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ విఐపి ఘాట్ ను సందర్శించి పుష్కర ప్రాంతమైన త్రివేణి సంగమ గోదావరిలో నీటిమట్టం, టెంట్ సిటిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. టెంట్ సిటీ వద్ద వర్షం కురిసిన సమయంలో బురదతో భక్తులకు ఇబ్బంది లేకుండా గ్రావెల్ వేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, వైద్య ఆరోగ్య శాకాధికారి డా।మధుసూదన్, డిపిఓ వీర భద్రయ్య, ఆర్ అండ్ బి, పీఆర్ ఇంజినీరింగ్, దేవాదాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఇందిరమ్మ ఇళ్ళ పరిశీలన

ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు డివిజన్ పరిధిలోని కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల పరిధిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు అర్హుల జాబితాను శుక్రవారం ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు వారం రోజుల నుంచి గ్రామాలలో అర్హుల జాబితాను బట్టి క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు ఆర్డీవో రాజేంద్ర తెలిపారు. ఆర్డీవో 5 మండలాలలో ఉన్న లబ్ధిదారుల 3500 ఇండ్ల పరిశీలనలను క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. పూర్తిస్థాయి జాబితా తయారు చేసినట్లు తెలిపారు.



## తడిసిన ధాన్యం తక్షణమే కొనండి

### తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్



ప్రజాపక్షం/జూలూరుపాడుః గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల ఐకెపి కేంద్రాల వద్ద ఆరబెట్టిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడు ఐకెపి కేంద్రం వద్ద తడచిన వరి ధాన్యాన్ని బృందం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఐకెపి కేంద్రాల వద్ద వర్షాల వల్ల తడచిన ధాన్యాన్ని కల్లాలలో, ప్రభుత్వం బాధ్యత తీసుకొని తడిచిన ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధరకు తక్షణమే కొనుగోలు చేయాలని, ధాన్యంలో తేమ శాతం తాలూ తదితర కారణాలతో కొనుగోలు సంస్థలు కుంటి సాకులు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని నష్ట నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు నష్టపోయిన వరి రైతులు,కాయ రాలిపోయిన మామిడి రైతులకు ఆసరాగా నిలవాలని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు ఎల్లంకి మధు, చెరుకుమల్లి రాజేశ్వరరావు, కొండా వీరయ్య, ఎస్కే నాగుల్ మీరా, కంచర్ల రాజు, ఎస్.కె చాంద్‌పాషా,పాలెపు ప్రభాకర్, సతీష్ పాల్గొన్నారు.

## వట్టి వాగు ప్రాజెక్టు పరిశీలన



ప్రజాపక్షం/కరకగూడెంః మండల కేంద్రంలోని రేగళ్ళ గ్రామ సమీపాన నిర్మిస్తున్న వట్టి వాగు ప్రాజెక్టును గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు గొగ్గలి ఆర్కే దొర సందర్శించారు. ప్రాజెక్టు పనులు నత్తనడకన జరుగుతున్నాయని తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు వేగవంతం పెంచాలని అధికారులను కోరారు. తర్వాత స్థానిక రైతులతో మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తయితే రాబోయే రోజులలో బీడు బారిన భూములు సస్యశ్యామలం అవుతాయని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన అభ్యుదయ సంఘం మండల అధ్యక్షులు కొమరం శ్రీను, కరకగూడెం మండల ప్రధాన కార్యదర్శి గొగ్గలి కృష్ణ, ఉపాధ్యక్షులు గొగ్గలి సతీష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీ రేట్లు పెంచాలి..



### సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్

ప్రజాపక్షం/మణుగూరుః ఉపాధి హామీ పనికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో తక్కువ నిధులు కేటాయించిందని, అత్యధిక పేదవారు ఉన్నటువంటి ఈ స్కీం లో కావాలనే ఉద్దేశంతో కేవలం రూ. 80 వేల కోట్లు మాత్రమే కేటాయించారని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 2,50,000 కేటాయించాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారంఉపాధి హామీ కూలీలతో వేర్పుల నరేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, పట్టణకార్యదర్శి దుగ్యాల సుధాకర్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా 700 రూపాయలు రోజువారి కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వాలని స్థలాలు, లేని పేదవారికి ఇంటి స్థలాలు వారికి ఇవ్వాలని, ప్రభుత్వం పెట్టిన ఆర్ స్కీములు వీరికి అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్లు కనితి సత్యనారాయణ, వజ్జా వెంకటేశ్వర్లు, ఎఐటియుసి కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

## 20న కార్మికుల దేశవ్యాప్త సమ్మె

ప్రజాపక్షం/సత్తుపల్లిః కార్మికుల హక్కులు, చట్టాల రక్షణ, రైతులు వ్యవసాయ కూలీల పరిరక్షణ, వ్యవసాయ రంగ రక్షణ కోసం దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ పిలుపు నిచ్చారు. మండల పరిదిలోని రామానగరం గ్రామంలో జరిగిన ఉపాధి కూలీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోనే రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికుల హక్కులను చట్టాలను హరించివేసి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్రలు సాగిస్తుందని, దీనికి వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు ,పేదలు ఐక్యమై దేశవ్యాప్తంగా ఈ నెల 20న సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని ప్రజల పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముత్యాలు, రాహేలు, మరియమ్మ, రాధమ్మ, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రాము, రజిని ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## రాజీవ్ వికాసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : రాజీవ్ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శంగా ఉండాలని, అందుకు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మండల ప్రత్యేకాధికారి ప్రదీప్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ వికాశంపై ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పథకం దరఖాస్తు దారుల ఎంపికకు కావాల్సిన వివరాలను అందించాలని, ముఖ్యంగా సివిల్ స్కోర్ వంటి వివరాలను పరిశీలించి ఇవ్వాలన్నారు. ఐదు సంవత్సరాలలోపు ఎటువంటి ప్రభుత్వ పథకాలను పొందని వారిని గుర్తించాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మున్సిపల్ కమీషనర్ సుజాత, పలు బ్యాంక్‌ల అధికారులు పాల్గొన్నారు.

# 4నెలల్లో యాతాలకుంట టన్నెల్ పూర్తి

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/సత్తుపల్లిః సీతారామ ఎత్తిపోతల పథకం యాతాలకుంట టన్నెల్ పనులు 4 నెలల్లో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని యాతాలకుంటలో సీతారామ ప్రాజెక్టు క్రింద నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి. పాటిల్ లతో కలిసి పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా మెయిన్ కెనాల్,3 పంప్ హౌస్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకున్నామని, రాజీవ్ లింక్ కెనాల్ ఏర్పాటు చేసుకొని రాబోయే వానాకాలంలో దుమ్ముగూడెం ఆనకట్టకు గోదావరి నీరు రాగానే వైరా ప్రాజెక్టుకు, పినపాక నియోజకవర్గం తుమ్మలపల్లి వద్ద మారేడుపాక ఎత్తిపోతల పథకం ప్రారంభించి 25 వేల ఎకరాలఆయకట్టు,కొత్తగూడెంనియోజకవర్గంలో యాటిలు ఏర్పాటు చేసుకొని అన్ని చెరువులకు నీళ్ళు వదిలేటట్లు ఏర్పాటు చేయాలన్నారు. సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ 1.8 కిలోమీటర్లకు గాను, 1.2 కిలో మీటర్లు పూర్తయిందని, పెండింగ్ ఉన్న 600 మీటర్ల పనులు 4 నెలల్లో పూర్తి చేయాలని, అవసరమైతే మరో నిచ్చెన పెట్టుకోవాలని, అప్పటి లోపు అవసరమైన అక్వాడెట్ లు, ఇతర నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి, అశ్వారావుపేట శాసనసభ్యులు మట్టా, జారేలను సమన్వయం చేసుకుంటూ అవసరమైన భూసేకరణ చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు శస్య శ్యామలం కావలనే ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు సస్య శ్యామలం కావాలనే ఆకాంక్షతో ఈ ప్రాజెక్టు చేపట్టామని, దీనిని త్వరగా పూర్తి చేయలనిసూచించారు. సత్తుపల్లి, పినపాక, మధిర, వైరా, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఈ సంవత్సరమే సాగునీరు అందాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి సమస్యలు వచ్చిన అయా జిల్లాల కలెక్టర్ ల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ లు దోమ ఆనంద్ బాబు, నీరజ చౌదరి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చలగుళ్ళ నరసింహారావు, భీమిరెడ్డి సుబ్బారెడ్డి, కాజా శ్రీను, మట్టా చెన్నారావు, ఫక్రుద్దీన్, తమ్మిన రవి, పల్లె రామకృష్ణ వెచ్చా రాంప్రసాద్, ఇరిగేషన్ సిఇ ఏ. శ్రీనివాస రెడ్డి, ఎస్ఇ ఎస్. శ్రీనివాస రెడ్డి, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసా చారి, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కెనాల్ పనుల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి:మండల పరిధిలోని తొట్టిపంపు గ్రామ సమీపంలో కొనసాగుతున్నటువంటి సీతారామ ప్రాజెక్ట్ 9 ఫేజ్ పనులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ జిల్లా అధికారులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ త్వరగ పనులను పూర్తి చేస్తే సీతారామ కాలువ ద్వారా అనుకున్న లక్ష్యానికే రైతులకు నీళ్లు అందించాలని, అందు వల్ల పెండింగ్‌లో ఉన్న పనులన్నిటిని వేగవంతంగా పూర్తి చేయాలని పనుల్లో ఎటువంటి రాజీ పడకుండా నాణ్యత లోపం లేకుండా బ్రిడ్జిలు నిర్మాణం చేపట్టాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే అధికారులువెంటనేవాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్, నీటి పారుదల శాఖకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సీతారామ ప్రాజెక్ట్ కాలువల పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ పార్టీ రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గోదావరి జలాలతో సస్యశ్యామలం

ములకలపల్లి:జూన్ నాటికి సీతారామ కాలువల్లో పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి గోదావరి జలాలతో ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ములకలపల్లి మండలం మధారం దగ్గరలో ఇటీవల సీతారామ ప్రాజెక్ట్ కాలువల్లో సూపర్ పాసేజ్ పిల్లర్ కూలిన48.30కిలోమీటర్ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు.పిల్లర్‌పనులువేగవంతం చేయాలని ఆదేశించారు. జూన్ నాటికి కాలువకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసుకుని నీటి విడుదలకు సిద్ధంగా ఉండాలన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్,అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీవో మధు సూదన్, సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## నీటి గుంతలకు ప్రాధాన్యత

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : రైతుల వ్యవసాయ భూముల్లో నీటి గుంతల ఏర్పాటుతో భూగర్భ జలాలు గణనీయంగా పెరగటంతో పాటు భూసారం పెరుగుదలకు ఉపకరిస్తుందని అడిషనల్ డిఆర్‌డిఓ నల్లబోతుల రవి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఆయనమాట్లాడుతూమండలంలోని 30 పంచాయతీల్లో 3601 నీటిగుంతలు (పారంపాండ్) మంజూరయ్యాయని, విటన్నింటికీ తక్షణమే మాస్ మార్కింగ్ ఇచ్చి పనులు ప్రారంభించాలన్నారు. వీటితో పాటు ప్రతి గ్రామపంచాయతీలో 50చొప్పున ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాల్లో ఇంకుడు గుంతలు తవ్వించి జలశక్తి అభియాన్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి తెలిపారు. ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, ఎడిఎ రవికుమార్, ఎఓ శివరామ్ ప్రసాద్, ఈసి రామచంద్రరావు, ఎఇఓలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## జవాన్లకు ఘనసన్మానం



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని గోరీలపాడు తండకు చెందిన యువకులు భారత జవాన్లుగా పనిచేస్తున్న బానోతు భాస్కర్ మరియు తేజావత రమేష్ లు నెల రోజులు సెలవు తీసుకొని గ్రామానికి వచ్చారు. గురువారం నుండి జరుగుతున్న భారత్ పాకిస్తాన్ యుద్ధం వలన ఈ జవాన్లకు కేంద్ర ప్రభుత్వం సెలవును క్యాన్సిల్ చేసింది. శనివారం ఉదయం వీరు తిరిగి తమ విధుల్లో చేరటానికి బయలుదేరి వెళుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన గోరీలపాడు తండా గ్రామవాసులు ఆ ఇద్దరు జవాలను పాఠశాల ఆవరణంలో వాళ్లకు శాలువతో సన్మానం చేసి ధైర్యం చెప్పి చెప్పడం జరిగినది.మాజీ ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ భరత భూమిని రక్షణ కల్పించడంలో మన గ్రామం నుంచి మీరు వెళ్ళటం మాకు చాలా గర్వ కారణంగా ఉన్నదని చెప్పటం జరిగింది. దేశ మును కాపాడటానికి మీ సహసక్తులుగా కృషి చేసే ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోరీలపాడుంతడపాడు గ్రామపంచాయతీ అభివృద్ధి సహకార సంఘం చైర్మన్ బానోత్ బాసునాయక్, అధ్యక్షులు తేజావత్ రామకోటి, ప్రధాన కార్యదర్శి బానోత్ కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు బాబు నాయక్, లచ్చిరెడ్డి నాయక్, శ్రీను నాయక్, రవి రాథోడ్, జీవన్ నాయక్, బాబు, కుమార్, గుట్ట, రవి, ఉద్యోగ సంఘాల నాయకులు తేజావత్ భాస్కర్, మల్ల, వెంకన్న, ఉపేందర్, వెలుగుశ్రీను, విజయ్, ఇందిరా మరియు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యం

### కల్లూరు ఆసుపత్రి తనిఖీ



ప్రజాపక్షం/ఖమ్మం : కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఫార్మసి, ప్రాథమిక పరీక్ష గది, ఎక్స్‌రే, ఆసుపత్రిలో మందుల నిల్వలు, వైద్య సేవలు తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు వార్డులనుపరిశీలించి వైద్యసేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రోగులకు మెరుగైన సేవలను అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధవహించి వైద్య చికిత్సలు అందించాలన్నారు. రోగులతో సేవాభావంతో మెలుగుతూ మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని అన్నివేళల అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రోగులతో అనుసరించాల్సిన పద్ధతి గురించి అధికారులకు తెలియజేశారు. కలెక్టర్ వెంట వైద్యాధికారులు రమేష్, నవ్యకాంత్, కల్లూరు తహసీల్దార్ సాంబశివుడు, వైద్య సిబ్బంది ఉన్నారు.



## ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణం బంజారాకాలనీ శ్రీ లక్ష్మీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయ 16వ వార్షికోత్సవ బ్రహోత్సవాల్లో భాగంగా పవర్ యూత్ డాన్స్ అకాడమి, కళాసాధన నృత్య కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారుల కార్యక్రమాలు అలరించాయి. శుక్రవారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి,నృత్య ప్రదర్శనలుఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన చిన్నారులకు ఆలయకమిటీ అధ్యక్షులు గుర్రాల రామారావు, ప్రమీల దంపతులు, జిల్లా రంగ స్థలం కళాకారుల సమైక్య అధ్యక్షులు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, మల్లాది వాసు, సవిత దంపతుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. కళా సాధన్ నృత్య కళానికేతన్ ఆర్గనైజర్ కళ్యాణపు నాగరాజు, స్థానిక ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు రఘునాథపాలెం మండల విద్యాశాఖాధికారి బి. రాములు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన రఘునాథపాలెంలో బడిబాటలో ఎంఈవో రాములు పాల్గొన్నారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఇతర సౌకర్యాలు కల్పిస్తుందన్నారు.అనంతరం రఘునాథపాలెం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుక్మిణి, సిఆర్‌పిలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం





ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : శుక్రవారం కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ నందు గల ప్రొఫసర్ జయశంకర్ గ్రౌండ్స్ నందు ప్రతి ఏటా నిర్వహిస్తున్న క్రికెట్ ఆఫ్ సింగరేణి ఎగ్జిక్యూటివ్ టోర్నమెంట్ లో భాగంగా సింగరేణి ఎగ్జిక్యూటివ్ లకు ఇంటర్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నమెంట్ ను డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు కన్వీనర్‌గా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలెం రాజు ను నియమించారు. డైరెక్టర్ మాట్లాడుతూ ఈ స్నేహపూర్వక క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా నన్ను ఆహ్వానించినందుకు చాలా సంతోషంగా ఉందని, ఈ టోర్నమెంట్ నిర్వహణకు అనుమతి అడిగిన వెంటనే సానుకూలంగా స్పందించి టోర్నమెంట్ నిర్వహించుకొనుటకు అనుమతించిన చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. టోర్నమెంట్ శనివారం నుండి వరకు మూడు రోజులు ఉంటుందని క్రీడాకారులు ఎగ్జిక్యూటివ్స్ ఎంత ఆనందంగా ప్రారంభోత్సవంలో పాల్గొన్నారో అంతే ఆనందంతో చివరి రోజు వరకు కూడా ఉండాలని దెబ్బలు తగలకుండా తగు జాగ్రత్తలతో ఆటను ఆడాలని అన్నారు. అలాగే క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కొత్తగూడెం ఏరియా జీఎం శ్యామల్ రాజ్ జీఎం పర్సనల్ వెల్ఫేర్ సిఎస్ఆర్ జీవి కిరణ్ కుమార్, కొత్తగూడెం ఏరియా సీఎంఓఏఐ జనరల్ సెక్రెటరీ ఏ.ఉపేంద్ర బాబు, కొత్తగూడెం ఏరియా ఎస్ఓటు జీఎం జీవి. కోటిరెడ్డి, ఏజీఎం సివిల్ సిహెచ్.రామకృష్ణ, డిజిఎం పర్సనల్ బి.శివ కేశవరావు, పాలడుగు శ్రీనివాస్, ఈ టోర్నమెంట్ కు కమిటీ నెంబర్లుగా పాల్గొన్నారు. రాజేంద్రప్రసాద్ ఎజిఎం పర్సనల్, వెల్ఫేర్, కొత్తగూడెం ఏరియా రక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, అచ్యుతరామయ్య, బి.మాధవ్, ఎం.మురళి, యు.అభిలాష్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్స్ పాస్‌నైట్, జె.రాంబాబు, ఎంపెర్స్‌గా సిహెచ్.సాగర్, గులాం గౌస్ పాల్గొన్నారు.

## దాడిని ఖండించిన జర్నలిస్టు సంఘాలు

### ఖమ్మంలో ప్రదర్శన, ఆందోళన





ప్రజాపక్షం/ ఖమ్మం : సాక్షి ఎడిటర్ ధనుంజయ్ రెడ్డిపై దాడిని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. పాలక వర్గాలు తమకు అనుకూలంగా లేని మీడియాపై దాడులను ప్రోత్సహిస్తున్నాయని జర్నలిస్టు సంఘాల నేతలు ఆరోపించారు. శుక్రవారం సాక్షి ఎడిటర్‌పై దాడిని ఖండిస్తూ ఖమ్మంలో ప్రదర్శన నిర్వహించి అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నేతలు మాట్లాడుతూ ప్రభుత్వాలు మీడియా స్వేచ్ఛను హరిస్తున్నాయని గతంలో ఎన్నడులేని విధంగా దాడులు పెరిగాయని వారు ఆరోపించారు. వార్తలు ప్రచురించని పత్రికలు, ఛానెళ్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. ప్రభుత్వం మీడియా స్వేచ్ఛకు సంబంధించి పునరాలోచన చేయాలని వాస్తవాలు ప్రచురించే మీడియాకు దన్నుగా నిలవాలని జర్నలిస్టు సంఘాల నేతలు కోరారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, టియుడబ్ల్యూజెఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో ఐజెయు నాయకులు మైసా పాపారావు, మోహినుద్దీన్, చెరుకుపల్లి శ్రీనివాస్, శివానంద, కళ్యాణ్, టిజెఎఫ్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, నాయకులు కొరకొప్పుల రాంబాబు, జగదీష్, చక్రవర్తి, టియుడబ్ల్యూజెఎఫ్ నాయకులు ఖదీర్, సాగర్, ఆవుల శ్రీనివాస్, గోపి, మాధవరావు, సాక్షి జర్నలిస్టులు మహేందర్, హరీష్, కేశవ్, మోహన్‌కృష్ణ, మహేందర్‌కుమార్, నెల్లూరి ఉపేందర్, ప్రేమ్‌కుమార్, ఆనంచిన్ని రామారావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ, శివ, పిడిఎస్‌యు నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరు ఘటనల్లో 103 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాపక్షం/భద్రాచలం : పట్టణంలో వేర్వేరు సంఘటనల్లో ఎక్సైజ్ అధికారులు సుమారు 103 కేజీల 400 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. వివరాల ప్రకారం గురువారం ఖమ్మం ఇన్ఫోర్స్మెంట్ అధికారులు కూనవరం రోడ్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా వేగంగా వస్తున్న వాహనాన్ని ఆపి సోదాలు చేయగా అందులో నాలుగు బస్తాల్లో సుమారు 67 కేజీల 500 గ్రాముల గంజాయి లభ్యమైంది. రాజస్థాన్‌కు చెందిన నిందితులు ముఖేష్, అనీల్ కుమార్ ఒడిస్సాలో 1 కేజి రూ. 2000 చొప్పున కొనుగోలు చేసి రాజస్థాన్‌కు తరలిస్తున్నారు. వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. పట్టుబడ్డగంజాయి విలువ సుమారు 33లక్షల 77 వేలు వరకు ఉంటుంది. అదే ప్రదేశంలో హీరో వాహనంపై వేగంగా వస్తున్న ఒక వ్యక్తి ఎక్సైజ్ అధికారులను చూసి కంగారు పడి వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. సోదాలు చేయగా సుమారు 6 కేజీల450గ్రాములగంజాయి లభ్యమైంది. ఈ గంజాయి విలువ సమారు రూ.3 లక్షల 50వేల వరకు ఉంటుంది. ఆరా తీయగా పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన లావుడ్యా దుర్గ ప్రసాద్ అనే వ్యక్తిగా తేలింది.మరో ప్రక్క స్థానిక ఎక్సైజ్ అధికారులు ఆర్‌టిఓ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా షిఫ్ట్ డిజైర్ టిజి 07టి 1638 నెంబర్ గల కారులో తరలిస్తున్న 29 కేజీల 500 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. కడపకు చెందిన సాయి కృష్ణ, పవన్ కుమార్, హైదరాబాద్‌కు చెందిన శ్రీహరి అనే ఇద్దరు వ్యక్తులు ఒడిస్సాలోని మల్గనగిరి జిల్లాలో ఈ గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అమ్మకం చేసేందుకు తరలించుకుపోతున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు 14 లక్షల 50 వేల వరకు ఉంటుంది. గంజాయిని స్వాదీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు వారి వద్ద ఉన్న మూడు సెల్ ఫోన్లు సీజ్ చేసి అరెస్టు చేశారు. మూడు వేర్వేరు కేసుల్లో 103.400 గ్రాముల గంజాయిని పట్టుకోగా, దీని మొత్తం విలవు సుమారు రూ.51 లక్షల 77 వేలు. ఈ దాడుల్లో ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు స్థానిక సిఐ రహెమున్నీసా బేగం, ఎస్సై అల్లూరి సీతారామరాజు, సిబ్బంది అలీం, బాబు, వీరబాబు, లలిత, రాకేష్, కిరణ్ కుమార్, మనోహర్, శ్రీకాంత్, అధికారులు తదితరులున్నారు.

# క్రీడ

## భారత్-పాక్ ఉద్రిక్తతల ఎఫెక్ట్.. ఐపిఎల్ వారం వాయిదా





ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ వాయిదా పడింది. భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ టోర్నీ నిర్వాహకులు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐపిఎల్ మ్యాచ్‌లను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు టోర్నీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. "ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఫ్రాంఛైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ఐపిఎల్ పాలక మండలితో చర్చించాం. ప్రసారకర్తలు, స్పాన్సర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. మన సాయుధ బలగాల స్థైర్యం, సన్నద్ధతపై మాకు పూర్తి విశ్వాసం ఉన్నప్పటికీ.. అందరి అభిప్రాయాలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశానికి బీసీసీఐ పూర్తి మద్దతు ప్రకటిస్తోంది. మన సాయుధ బలగాల ధైర్యం, నిస్వార్థ సేవకు సెల్యూట్ చేస్తున్నాం" అని ఐపిఎల్ తమ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చింది. ఆటగాళ్ల భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో టోర్నీని కొంత కాలం వాయిదా వేసినట్టు బీసీసీఐ అధికారులు పేర్కొన్నారు. "ఓవైపు దేశం యుద్ధం చేస్తుంటే.. ఇలాంటి సమయంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం సరైంది కాదనిపించింది" అని వెల్లడించారు.

### ఇంకా 16 మ్యాచ్‌లు


ఐపీఎల్ ప్లే ఆఫ్స్ బెర్త్‌ల నిర్ణయించే కీలక మ్యాచ్‌ల టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. అయితే.. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల నడుమ ఆటగాళ్ల భద్రతను దృష్టిలో ఉంచుకొని లీగ్‌ను వారం రోజులు వాయిదా వేసింది బీసీసీఐ. దాంతో,ఈ వారం షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన మ్యాచ్‌లకు బ్రేక్ పడింది. మే 9న లక్నో వేదికగా ఆర్సీబీతో పంత్ సేన తలపడాల్సింది. కానీ, మ్యాచ్ రద్దుతో ఆ టికెట్లను చెల్లించేందుకు ఫ్రాంఛైజీ అంగీకరించింది. సన్‌రైజర్స్, లక్నో తరహాలోనే ఇతర ఫ్రాంఛైజీలు కూడా వాయిదా పడిన మ్యాచ్ టికెట్ల డబ్బులు రీఫండ్ చేయనున్నాయి. 18వ సీజన్‌లో 57 మ్యాచ్‌లు పూర్తిగా సాగాయి. 58వ మ్యాచ్ అర్ధాంతరంగా రద్దు కాగా.. ఫైనల్‌తో కలిపి ఇంకా 16 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. సాధారణ పరిస్థితులు నెలకొన్నాక వీటికి కొత్త షెడ్యూల్ ప్రకటించే అవకాశముంది.

### భారీ భద్రత నడుమ ఢిల్లీకి క్రికెటర్లు

ఐపిఎల్ మ్యాచ్‌లను వారం పాటు వాయిదా వేసిన బీసీసీఐ ఆటగాళ్ల భద్రతకు పెద్ద పీట వేస్తోంది. అందులో భాగంగానే ధర్మశాలలో చిక్కుకుపోయిన ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ క్రికెటర్లను సురక్షితంగా ఢిల్లీకి తరలిస్తోంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వందే భారత్ రైలులో భారీ భద్రత నడుమ ప్లేయర్లు, సహాయక సిబ్బంది, అంపైర్లు.. మీడియా బృందం అందరూ ఢిల్లీకి వెళుతున్నారు. టీమ్ హోటల్‌లో ఉన్న ఇరుజట్ల క్రికెటర్లు, సిబ్బంది శుక్రవారం పోలీసుల గట్టి బందోబస్త్ మధ్య ధర్మశాల నుంచి జలంధర్ రైల్వే స్టేషన్‌కు తరలించారని ఎస్పీ షాలిని అగ్నిహోత్రి వెల్లడించింది. 'శుక్రవారం ఉదయం పంజాబ్, ఢిల్లీ జట్ల ఆటగాళ్లు, సహాయక సిబ్బంది.. బ్రాడ్‌కాస్టింగ్ బృందాన్ని గ్రూప్‌లుగా జలంధర్ తరలించాం. 40 నుంచి 50 చిన్న వ్యాన్లలో భారీ భద్రత నడుమ వీళ్లను పంజాబ్ సరిహద్దులోని హోషియాపూర్‌కు తీసుకొచ్చాం. క్రికెటర్లు, ఇతర సిబ్బందితో కూడిన కాన్వాయ్‌కు ఎస్కార్ట్ పోలీసులు, పంజాబ్ పోలీసులు రక్షణగా ఉన్నారు. హోషియాపూర్ చేరుకున్నాక ప్లేయర్లను జలంధర్‌కు సురక్షితంగా తరలించాం. బీసీసీఐ ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో క్రికెటర్లు వాళ్ల సహాయక సిబ్బందిని ఎక్కించాం' అని షాలిని తెలిపింది.

### 20 నిమిషాల్లోనే ఖాళీ

ఢిల్లీ, పంజాబ్ జట్ల మధ్య ధర్మశాలలో గురువారం జరిగిన మ్యాచ్ అర్ధాంతరంగా ఆగిపోయింది. పంజాబ్ ఇన్నింగ్స్ 10.1 ఓవర్ వద్ద ఫ్లడ్ లైట్స్ పని చేయలేదు. అప్పటికే సరిహద్దుల్లో పాక్ డ్రోన్ల దాడిని భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. దాంతో, జమ్మూసహా పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. ఆటగాళ్ల భద్రతను దృష్టిలో పెట్టుకొని బీసీసీఐ మ్యాచ్‌ను రద్దు చేసింది. ఆ వెంటనే ఇరుజట్ల ఆటగాళ్లు, సిబ్బందిని భద్రత నడుమ సురక్షితంగా టీమ్ హోటల్‌కు తరలించిన పోలీసులు.. 20 నిమిషాల్లోనే స్టేడియం మొత్తాన్ని ఖాళీ చేయించారు.



### అభిమానులు ఆందోళన వద్దు.. డబ్బులు రీఫండ్ చేస్తాం!

వారం రోజుల పాటు వాయిదా పడడంతో అభిమానులు మ్యాచ్ టికెట్ డబ్బులు వాపస్ ఇస్తామని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఐపీఎల్ వాయిదాతో టికెట్లు కొన్న అభిమానులు డబ్బులు పోయినట్టేనా? అని ఆందోళన చెందుతున్నారు. అయితే.. ఎవరూ కంగారు పడాల్సిందేమీ లేదని.. టికెట్ పైసల్ తిరిగి ఇచ్చేస్తామని సన్‌రైజర్స్ ఎక్స్ వేదికగా వెల్లడించింది.



### అరుణ్ జైట్లీ స్టేడియానికి బాంబు బెదిరింపు..

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో బాంబు ఉందంటూ ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్‌కు ఓ మెయిల్ వచ్చింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులతో పాటు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ శుక్రవారం మైదానాన్ని అణువణువూ గాలించారు. అయితే వారికి మైదానంలో అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదు. దీంతో అది అబద్ధపు మెయిల్ అని తేలింది. ఈ విషయాన్ని డీడీసీఏ కార్యదర్శి అశోక్ శర్మ ధ్రువీకరించారు.

# రీల్

## 30న భైరవం రిలీజ్



టాలీవుడ్‌లో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'భైరవం'. మంచు మనోజ్, నారా రోహిత్, బెల్లంకొండ సాయిశ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. అదితి శంకర్, దివ్యా పిళ్లై, ఆనంది కథానాయికలు. ఈ సినిమా రిలీజ్‌కు సంబంధించి ఇప్పటికే పలు తేదీలు తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను టీమ్ అధికారికంగా ప్రకటించింది. మే 30న ప్రపంచ వ్యాప్తంగా దీనిని విడుదల చేయనున్నట్లు చెప్పింది. కొత్త పోస్టర్‌ను అభిమానులతో పంచుకుంది. విభిన్న కథాంశంతో రానున్న ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. యాక్షన్ డ్రామాగా శ్రీ సత్యసాయి ఆరట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

### కొత్త సినిమాకు మనోజ్ గ్రీన్ సిగ్నల్..?

మనోజ్ తాజాగా ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. '90ఎంఎల్' చిత్ర దర్శకుడు శేఖర్ రెడ్డి చెప్పిన కథకు మనోజ్ ఓకే చెప్పాడని.. ఈ సినిమాను త్వరలోనే అధికారికరంగా ప్రారంభించబోతున్నట్లు సినీ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. ఓ కొత్త ప్రొడక్షన్ హౌజ్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేసేందుకు రెడీ అవుతుందని తెలుస్తోంది. మరి ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందో తెలియాలంటే ఈ మూవీకి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే వరకు వెయిట్ చేయాల్సిందే.



## హాలీవుడ్‌లోకి కంగనా ఎంట్రీ!

హాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నది కంగనా రనౌత్. ఓ హారర్ ఫిల్మ్‌లో ఆమె నటిస్తోంది. బ్లెస్డ్ బీ ద ఈవిల్ చిత్రంలో కంగనా నటించనున్నది. తనూ వెడ్స్ మనూ, ఫ్యాషన్, క్వీన్, తలైవీ లాంటి చిత్రాల్లో నటించిన బాలీవుడ్ క్వీన్ ఇప్పుడు హాలీవుడ్‌లో తన పర్ఫార్మెన్స్ ఇవ్వనున్నది. స్కార్లెట్ రోజ స్టాలోన్‌తో కలిసి కంగనా ఆ చిత్రంలో తన పాత్రను పోషించనున్నది. యాక్షన్ హీరో సూపర్ స్టార్ సిల్వస్టర్ స్టాలోన్ కుమార్తె స్కార్లెట్ రోజ్ స్టాలోన్. ఈ ఫిల్మ్‌లో టీన్ వోల్ఫ్ నటుడు టైలర్ పోసే కూడా నటిస్తున్నారు. ఈ చిత్రానికి అనురాగ్ రుద్ర దర్శకత్వం వహిస్తున్నారు. స్క్రీన్ ప్లే గాథ తివారీ. ఈ చిత్రాన్ని ఇద్దరు కలిసి ప్రొడ్యూస్ చేయనున్నారు. హారర్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి ఈ వేసవిలోనే షూటింగ్ ప్రారంభంకానున్నది. విదేశీ చిత్రాలపై 100 శాతం పన్ను వసూల్ చేయనున్నట్లు ట్రంప్ వార్నింగ్ ఇచ్చిన నేపథ్యంలో ఈ చిత్రాన్ని అమెరికాలనే షూట్ చేయనున్నారు.

## నాన్ స్టాప్ ప్రమోషన్స్‌లో కమల్





కోలీవుడ్ విలక్షణ నటుడు కమల్ హాసన్ హీరోగా తన ఎవర్ గ్రీన్ దర్శకుడు మణిరత్నంతో చేస్తున్న భారీ చిత్రం థగ్ లైఫ్ కోసం అందరికీ తెలిసిందే. ఇక ఈ సినిమాపై సాలిడ్ హైప్ ఆల్రెడీ నెలకొనగా ఈ చిత్రం కోసం తెలుగు ఆడియెన్స్ కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి ఈ సినిమాకి ఫస్ట్ సింగిల్ నుంచే కమల్ అండ్ టీం ప్రమోషన్స్‌ని ఆల్రెడీ స్టార్ట్ చేసేసారు. మొదటి పాట నుంచే గట్టి ప్రమోషన్స్ ఈ సినిమాకి స్టార్ట్ కాగా మన తెలుగు ప్రమోషన్స్‌ని కూడా మేకర్స్ స్టార్ట్ చేసేసారు. మరి ముఖ్యంగా కమల్ హాసన్ మాత్రం మామూలు డెడికేషన్‌లో ఈ ప్రమోషన్స్‌లో పాల్గొనడం లేదని చెప్పాలి. తనతో ఉన్న కొందరు హీరోలు అయినా మారుతున్నారు కానీ కమల్ మాత్రం నాన్ స్టాప్‌గా ప్రమోషన్స్‌లో కొనసాగుతున్నారు. మరి తన నుంచి ఈ రేంజ్ లో డెడికేషన్ అనేది సినిమా కోసం తాను పడుతున్న తపన ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించగా ఈ జూన్ 5న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతుంది.

## 'వార్ 2' టీజర్‌కి ఆల్ సెట్?



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ అలాగే బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్‌లు హీరోలుగా నటించిన లేటెస్ట్ అవైటెడ్ భారీ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమే వార్ 2. దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి ఒక్క రిలీజ్ డేట్ మినహా మన హీరోల ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా బయటకి రాలేదు. అయితే ఇవి కాదు కానీ నేరుగా టీజర్ నే మేకర్స్ ఇపుడు దింపబోతున్నట్టుగా సాలిడ్ బజ్ ఇపుడు వినిపిస్తుంది. దీని ప్రకారం వార్ 2 టీజర్‌ని ఈ మే లోనే మేకర్స్ విడుదల చేయనున్నారట. వస్తే ఎన్టీఆర్ బర్త్ డే కానుకగా లేదా నెలాఖరున ఈ టీజర్ ఉండొచ్చని ఇపుడు టాక్. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది వేచి చూడాల్సిందే. ఇక ఈ చిత్రానికి యష్ రాజ్ ఫిలమ్స్ వారు నిర్మాణం వహిస్తుండగా వారి స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమా రాబోతుంది. ఇక ఈ అవైటెడ్ సినిమా ఈ ఏడాది ఆగస్ట్ 14న గ్రాండ్‌గా విడుదల కాబోతుంది.

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించరా?

### ఆలస్యంపై హైకోర్టు అసహనం



ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రాట్యుటీతోపాటు పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపులు జాప్యం కావడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సకాలంలో చెల్లించకపోవడంతో పదవీ విరమణ చేసిన వాళ్లకు సమస్యలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆర్థికంగా సమస్యలున్నాయని చెప్పడానికి నిరదర్శమని చెప్పింది. చెల్లింపులో జాప్యానికి కారణాలు ఏవైనా కావచ్చని, అయితే ప్రభుత్వ వైఫల్యమే అవుతుందని అభిప్రాయపడింది. ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుందని చెప్పింది. ఇలాంటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ఉచిత పథకాలపై పునరాలోచన చేయాలని సూచన చేసింది. ఉచిత పథకాల వల్ల ఎదురయ్యే సమస్యలను కూడా పరిశీలన చేయాలంది. ఇది విధాన నిర్ణయం కాబట్టి సుప్రీం కోర్టు కూడా జోక్యం చేసుకోలేదని, తాము కూడా ఉత్తర్వులు ఇవ్వడం లేదని పేర్కొంది. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం ఇవ్వలేదంటూ రిటైర్డు ఏఈ ఎ.నరేంద్రరెడ్డి వేసిన పిటిషన్ను జస్టిస్ నగేశ్ భీమపాక విచారించారు. పిటిషనర్ 40 ఏళ్ల సర్వీసు పూర్తి చేశారని, ఎలాంటి మచ్చ లేకుండా సర్వీస్ పూర్తి చేశారని లాయర్ చెప్పారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ, ఆర్థిక సమస్యలు ఉన్నమాట నిజమేనని, చెల్లింపు ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు వాదనల తర్వాత న్యాయమూర్తి పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపులో జాప్యంపై రోజు రోజుకు పెరుగుతునన పిటిషన్లను పరిశీలిస్తే ఆందోళన కలుగుతోందన్నారు. నిర్దిష్ట కాలంలో చెల్లించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ పిటిషన్లపై విచారణను మూసివేస్తున్నా రోజు రోజుకు పెరుగుతున్న పిటిషన్లను చూస్తే పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో కొన్ని వ్యాఖ్యలు చేయకుండా ఉండలేకపోతున్నట్లు చెప్పారు. గ్రాట్యుటీ, పదవీ విరమణ ప్రయోజనాలు దానం కాదన్నారు. పదవీ విరమణ కోసం దాఖలవుతున్న పిటిషన్లపై విచారణ సందర్భంగా ఉచిత పథకాల పేరుతో నిధులను మళ్లిస్తున్నట్లు లాయర్లు చెబుతున్నారని గుర్తు చేశారు. ఇవన్నీ విధాన నిర్ణయాల పరిధిలోకి వస్తాయని, అధికరణ 226 కింద న్యాయసమీక్షకు వీలుందని చెప్పారు. దీనిపైఎలాంటి వ్యాఖ్యలు చేయలేమని పేర్కొన్నారు. పిటిషనర్కు పదవీ విరమణ ప్రయోజనాలను రెండున్నర నెలల్లోపు చెల్లించాలని ఆదేశించారు. పిటిష్న విచారణను మూసివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

## తిరిగి సర్వీసులోకి తీసుకోండి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ (ఏపీవీసీసీ)కి చెందిన ఏడుగురు దృష్టి లోపం ఉన్న ఉద్యోగులను ఏకపక్షంగా తొలగించడం చెల్లదని హైకోర్టు తేల్చి చెప్పింది. రెండు దశాబ్దాల క్రితం చేరిన ఉద్యోగులకు వయస్సు నిర్ధారణ పరీక్షల ద్వారా 2012లో నిర్బంధ పదవీ విరమణ ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుబట్టింది. ఈ ఉత్తర్వులను రద్దు చేస్తూ వారిని సర్వీసులోకి తీసుకోవడంతో పాటు తదనంతర ప్రయోజనాలను చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. 1988, 1990ల మధ్య కాలం లో వికలాంగుల కోఆపరేటివ్ సంస్థలో చేరిన తమను ఉస్మానియా ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం నిర్వహించిన వయస్సు నిర్ధారణ పరీక్ష ద్వారా ఆగస్టు 2012లో తొలగించడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన ఎస్.మల్లేష్ ఇతరులు 2017లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నగేష్ భీమపాక ఇటీవల పైవిధంగా తీర్పు చెప్పారు. నోటీసు కూడా ఇవ్వకుండా వాళ్లకు వైద్య పరీక్షలు చేసి ఉద్యోగాల నుంచి తొలగించడం చెల్లదన్నారు. షోకాజ్ నోటీసు ఇవ్వకుండా, వైద్య పరీక్షలపై వివరణ తీసుకోకుండా ఉద్యోగులను తొలగించడం చెల్లదన్నారు. తొలగింపు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వారికి రావాల్సిన వేతన బకాయిలతోపాటు పదవీ విరమణ ప్రయోజనాలను చెల్లించాలని కార్పొరేషన్ను ఆదేశిస్తూ తీర్పు చెప్పారు.

## నిర్దేశించుకున్న క్యాలెండర్ ప్రకారమే

**రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



ప్రజాపక్షం/హైదరాబాద్ : ముందుగా నిర్దేశించుకున్న క్యాలెండర్ ప్రకారంగా రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులను ఎంపిక చేసి, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న మంజూరు పత్రాలు పంపిణి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో రాజీవ్ యువ వికాసంపై సంబంధిత ఉన్నత అధికారులతో సమీక్షించారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం చేసుకున్న దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేసి, ఈనెల 15 నుంచి 25 వ తేదీలోగా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని సూచించారు. ఈ నెల 25 నుంచి 30వ తేదీలోగా ఎంపికైన లబ్ధిదారుల సంబంధించిన మంజూరు పత్రాలను సిద్ధం చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఇందులో ఎలాంటి జాప్యం జరగకుండా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. మంజూరు పత్రాలను పంపిణి చేసిన తర్వాత లబ్ధిదారులకు శిక్షణ ఇప్పించి, పథకాలకు సంబంధించిన గ్రౌండింగ్ చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్‌సి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, బిసి సంక్షేమ శాఖ శ్రీధర్, ఉపముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ పాల్గొన్నారు.

## ఆందోళన వద్దు

(మొదటి పేజీ తరువాయి)

భవనాలపై మరో 40 నుంచి 50 సైరన్‌లు ఏర్పాటు చేస్తామని పిడబ్ల్యుడి మంత్రి పర్వేష్ వర్మ తెలిపారు. ప్రతి సైరన్ పరిధి 8 కిలోమీటర్ల మేర ఉంటుందని చెప్పారు. రెండు రోజుల్లో వీటి ఏర్పాటు పూర్తవుతుందని అన్నారు. 24 ఎయిర్‌పోర్టుల మూసివేతను కేంద్రం పొడిగించింది. ఈనెల 14 వరకు మూసివేత అమలులో ఉండనుంది. చండీగఢ్, అమృత్‌సర్, లూధియానా, భుంటార్, కిషన్‌గఢ్, పాటియాలా, సిమ్లా, జైసల్మేర్, పఠాన్‌కోట్, శ్రీనగర్, జమ్ము, బికనీర్, లేహ్, పోర్‌బందర్, ఇతర నగరాల్లోని విమానాశ్రయాలు మూసివేసినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది. తొలుత 10 వరకు ఈ ఎయిర్‌పోర్టులను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఆ గడువును మే 14 వరకు శుక్రవారం పొడిగించింది. మరోవైపు భద్రతా ప్రోటోకాల్స్ వల్ల ఢిల్లీ విమానాశ్రయంలో విమాన సేవలపై ప్రభావం పడిందని ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య మొత్తం 60కు పైగా దేశీయ విమానాల రాకపోకలు, 4కు పైగా అంతర్జాతీయ సర్వీసులను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. సరిహద్దు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. ముందస్తు చర్యలు చేపట్టాయి. వేడుకల్లో బాణసంచా, డ్రోన్ల వాడకంపై గుజరాత్ సర్కార్ నిషేధం విధించింది. పంజాబ్‌లో ఔట్‌డోర్‌లో ఇన్వర్టర్లు, జనరేటర్లు, ఇతర పవర్ బ్యాకప్ వస్తువుల వాడకంపై ఆంక్షలు అమలు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి త్రివిధ దళాధిపతులతో ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. తాజా పరిస్థితిని సమీక్షించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ సరిహద్దు రాష్ట్రాలు రాజస్థాన్, పంజాబ్ ముఖ్యమంత్రులతో ఫోన్‌లో మాట్లాడారు. సరిహద్దులో పరిస్థితులను వారిని అడిగి తెలుసుకున్నారు. ఉదయం కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ బిఎస్‌ఎఫ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సిఐఎస్‌ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో భేటీ అయ్యారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం జాతీయ భద్రతా పరిస్థితిపై అత్యున్నత సైనిక నాయకత్వంతో సమగ్రంగా సమీక్షించారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉరిలో పర్యటించారు. భద్రతాదళాలతో ఆయన సమావేశమయ్యారు. సరిహద్దు వెంట పరిస్థితులను సమీక్షించారు. కేంద్ర ఆరోగ్య మంత్రి జెపి నడ్డా ఆ శాఖ సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. దేశంలోని ఆసుపత్రుల్లో ఆరోగ్య మౌలిక సదుపాయాల సంసిద్ధతను ఆయన సమీక్షించారు. దేశవ్యాప్తంగా హాస్పిటల్స్, ఆరోగ్య సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు కేంద్ర మంత్రి జెపి నడ్డాకు వివరించారు. సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంపై ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా స్పందించారు. భారత్, పాక్ సింధూ జలాల ఒప్పందంలో వరల్డ్ బ్యాంక్ ది సహాయక పాత్ర మాత్రమేనని తెలిపారు. 'సింధూ నదీ జలాల ఒప్పందం రద్దుపై మేము జోక్యం చేసుకోబోం. ఈ ఒప్పందంలో వరల్డ్ బ్యాంకుది సహాయకుడి పాత్ర. అంతకు మించి ఏం లేదు. సింధూ నదీ జలాల డీల్ విషయంలో ప్రపంచ బ్యాంక్ జోక్యం చేసుకొని సమస్యను ఎలా పరిష్కరిస్తుందనే దానిపై చాలా ఊహాగానాలు వస్తున్నాయి. కానీ అవన్నీ అర్థం లేనివి' అని అజయ్ బంగా వ్యాఖ్యానించారు. భారత్ – పాక్ మధ్య దాడులు తారాస్థాయికి చేరుకోవచ్చన్న భయాలతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం క్షీణించాయి. దాదాపు అన్ని రంగాల షేర్లు అమ్మకాలు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో వరుసగా రెండో రోజూ మన సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్ 800 పాయింట్లకుపైగా నష్టపోయి మళ్లీ 80 వేల దిగువకు చేరగా నిఫ్టీ 24 వేలకు కాస్త ఎగువన ముగిసింది. ఐపిఎల్ మ్యాచ్‌లను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నటు టోర్నీ అధికారులు అధికారికంగా ప్రకటించారు.

## విక్టరీ డే వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)



తుర్కమెనిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌ల సైనిక బలగాలు కూడా భాగస్వాములయ్యాయి. వియత్నాం, ఈజిప్ట్, చైనా, లావోస్, మంగోలియా, మయన్మార్ బలగాలు కూడా కవాతులో పాల్గొన్నాయి. మిలిటరీ కవాతులో సుమారు 11వేల ట్రూపులు, అందులో 1500 ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్ యోధులు, 183 ద్వితీయ ప్రపంచ యుద్ధం ట్యాంకులు, ఆధునిక ఆయుధ వ్యవస్థలను తమ పాటవాన్ని ప్రదర్శించాయి. ద్వితీయ ప్రపంచ యుద్ధం నాటి టి–34 ట్యాంకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా, తొలిసారిగా మానవరహిత వ్యవస్థల దళం కూడా కవాతులో భాగమైంది. ఇందులో డ్రోన్‌లు, యుఎవిలను ప్రదర్శించారు. సైనిక పరేడ్‌లో రష్యా అణు శక్తికి గుర్తుగా యార్స్ న్యూక్లియర్ అంచుతో కూడిన ఇంటర్ బాలిస్టిక్ మిస్సైల్స్‌ను రెడ్ స్క్వేర్‌లో ప్రదర్శించారు. చివరల్లో రష్యా వైమానిక దళానికి చెందిన ఏరోబాటిక్ టీమ్‌ల ఆధ్వర్యంలో ఫైటర్ జెట్‌లు రెడ్ స్క్వేర్ మీదుగా విన్యాసాలు చేస్తూ రంగురంగుల పొగ ద్వారా రష్యా జాతీయ పతాకాన్ని ఆకాశంలో సృష్టించారు.

పిటిఐ కథనం ప్రకారం భారీ సైనిక కవాతుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాటు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ లూలా డ సిల్వా సహా అనేక విదేశీ నేతలు హాజరయ్యారు. మే 9న రష్యాలో నిర్వహించే విక్టరీ డే సందర్భంగా దేశ్యాప్తంగా అత్యంత ముఖ్యమైన సెలవు దినంగా పాటిస్తారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరేడ్, ఇతర కార్యక్రమాల ద్వారా తన భౌగోళిక శక్తిని, పశ్చిదేశాల ఆధిపత్యానికి సమతుల్యం చేసే విధంగా, భాగస్వామ్య దేశాలతో బంధాన్ని బలోపేతం చేసుకునేందుకు మాస్కో కృషి చేసింది. ఉక్రేన్ ఘర్షణలు నాలుగవ సంవత్సరంలో కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. అనేక రాజకీయ శక్తుల మధ్య విభేధాలను తుడిచిపెడుతూ జాతి గౌరవాన్ని, రష్యాను భౌగోళిక శక్తిగా నిలబెట్టేందుకు క్రెమ్లిన్‌కు ద్వితీయ ప్రపంచ యుద్ధం ఒక అవకాశంగా నిలిచింది. 1941–45 మధ్య మహా దేశభక్తి యుద్ధం(గ్రేట్ పాట్రియాటిక్ వార్)గా పిలిచే యుద్ధంలో సోవియెట్ యూనియన్ 2.7 కోట్ల మంది ప్రజలు ప్రాణత్యాగాలు చేశారు.

### రష్యా సైనికుల సహసానికి గర్విస్తున్నాం : పుతిన్

కవాతును ఉద్దేశించి పుతిన్ ప్రసంగిస్తూ రష్యా సైనిక బలగాల సాహసం, సంకల్పానికి, తమకు విజయాన్ని చేకూర్చే వారి ఆధ్మాత్మిక శక్తిని చూసి గర్వపడుతున్నామని వ్యాఖ్యానించారు. ఉక్రేన్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్న రష్యన్ దళాలను ప్రశంసించారు. నాజీలపై మహోన్నత విజయాన్ని, స్మృతులను అత్యంత విశ్వసనీయంగా భద్రపరుచుకుంటామని తెలిపారు. విజేతల వారసులుగా విక్టరీ డేను అత్యంత ముఖ్యమైన సెలవుగా వేడుకలు జరుపుకుంటామన్నారు. నిజం, న్యాయం తమవైపు ఉన్నదని, కీవ్ పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న సైనిక చర్యల్లో పాల్గొంటున్న బలగాలకు దేశమంతా మద్దతుగా నిలుస్తోందన్నారు.

ప్రదర్శన అనంతరం పుతిన్ పరేడ్‌కు నేతృత్వం వహించిన సైనికాధికారులతో కరచాలనం చేశారు. పరేడ్‌ను వీక్షించిన ఉత్తర కొరియా ఉన్నతాధికారులతో కాసేపు మాట్లాడడంతో పాటు, వారిఓ ఒకరిని కౌగిలించుకున్నారు. ఉక్రేన్ బలగాలకు వ్యతిరేకంగా రష్యా బలగాలతో కలిసి పోరాడిన ఉత్తర కొరియాకు గత మాసం పుతిన్ కృతజ్ఞతలు తెలియజేశారని, వారి త్యాగాలను కొనియాడినట్లు ప్యాంగ్యాంగ్ తొలిసారిగా తమ సైన్యాన్ని పంపినట్లు నిర్ధారించింది.

### మాస్కోపై ఉక్రేన్ డ్రోన్‌ల దాడులు

ద్వితీయ ప్రపంచ యుద్ధం 80వ వార్షికోత్సవ వేడుకలకు అంతరాయం కలిగించేందుకు ఉక్రేన్ ప్రయత్నించింది. మాస్కో లక్ష్యంగా డ్రోన్ దాడులు జరపడంతో పాటు, రాజధాని విమానాశ్రయంపై అనేక అంతరాయాలు సృష్టించింది. రష్యా విమానయాన సంస్థ ఎరోఫ్లోట్ బుధవారం ఉదయం మాస్కోకు రావాల్సిన, మాస్కో నుంచి వెళ్ళాల్సిన 100కు పైగా విమానాలను రద్దు ఏయగా, 140 విమానాలను ఆలస్యంగా నడిపింది. పరేడ్ నేపథ్యంలో రష్యన్ అధికారులు భద్రతను పటిష్టంగా చేశారు. ఉక్రేన్ డ్రోన్ దాడులను నిర్వీర్యం చేసేందుకు ఎలక్ట్రానిక్ ప్రి చర్యల నడుమ అనేక సార్లు సెల్‌ఫోన్, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగింది. విక్టరీ డే వేడుకలను పురస్కరించుకొని మే 7 నుంచి 72 గంటల పాటు పుతిన్ కాల్పుల విరమణను ప్రకటించారు. అదే సమయంలో దాడుల జరిగితే రష్యా ప్రతీకార దాడులు తప్పవని హెచ్చరించారు. ఉక్రేన్ అంగీకరించిన అమెరికా ప్రతిపాదిత 30 రోజుల కాల్పుల విరమణ పట్ల మాస్కో అనాసక్తి ప్రదర్శించింది. ఎందుకంటే అదే సమయంలో ఉక్రేన్‌కు పశ్చిమ దేశాల ఆయుధ సరఫరాలను నిలిపివేయాలనే షరతులకు ఉక్రేన్, దాని పశ్చిమ దేశాల మిత్రులు అంగీకరించని కారణంగా రష్యా ఆ ప్రతిపాదన పట్ల మొగ్గు చూపలేదు. మరో వైపు ఖేర్సాన్, జాఫోరిఝియా ప్రాంతాలపై రష్యా అనేక దాడులకు పాల్పడిందని, ఇందులో కనీసం ఇద్దరు మరణించారని ఉక్రేన్ విభాగాలు తెలియజేశాయి. రెడ్ స్క్వేర్ పరేడ్‌తో పాటు ఇతర ఉత్సవాలు జరుగుతున్న సమయంలో పశ్చిమ ఉక్రేన్‌లోనీ లీవ్‌లో అనేక పశ్చిమ దేశాల అధికారులు సమావేశమయ్యారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com